ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ fb.com/vaartha
PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
23-5-2023 మంగళవారం సంపుటి : 29 సంచిక : 112 పేజీలు : 10+4 వెల : 6.50

మణిపూర్‌లో మళ్లీ టెన్షన్
రంగంలోకి దిగిన ఆర్మీ 5లో

శ్రీనగర్‌లో జి-20 సన్నాహక సదస్సు



ప్రముఖ నటుడు

## శరత్ బాబు కన్నుమూత

**దీర్ఘ అస్వస్థతతో ఆసుపత్రిలో మృతి**

**1973లో 'రామరాజ్యం'తో చిత్రరంగ ప్రవేశం**

**300 పైగా చిత్రాలలో నటించి విలక్షణ నటుడుగా ఖ్యాతి**

**నేడు చెన్నైలో అంత్యక్రియలు**

**ప్రధాని, సిఎంలు సహా పలువురు ప్రముఖుల నివాళులు**

**గచ్చిబౌలి, మే 22 ప్రభాతవార్త:** ప్రముఖ సినీ నటుడు శరత్‌బాబు (71) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న ఆయన గచ్చిబౌలిలోని ఏఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాసవిడిచారు. గత ఏప్రిల్ 20వ తేదీన ఏఐజీ ఆసుపత్రిలో చేరిన శరత్‌బాబు నెల రోజుల పాటు మృత్యువుతో పోరాడి సోమవారం కన్నుమూశారు. కొద్దినెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న శరత్‌బాబు మొదట బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఏప్రిల్ 20వ తేదీన హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి శరత్‌బాబును కుటుంబ సభ్యులు తరలించారు. వయస్సు మీద పడడంతో వచ్చిన అనారోగ్య సమస్యలకు తోడు శరీరం మొత్తం విషతుల్యం కావడంతో ≫2

## తగ్గని మోడీ పాపులారిటీ

**దరిదాపుల్లో లేని మిగతా ప్రపంచ నేతలు**

**న్యూఢిల్లీ, మే 22:** ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ కలిగిన దేశాధినేతల్లో ప్రధాని నరేంద్రమోడీ మరోసారి టాప్‌లో నిలిచారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ సర్వేలో మోడీకి 78 శాతం రేటింగ్ దక్కింది. అంతకుముందు సర్వేల్లోనూ ఆయన తొలి స్థానంలో ఉన్నారు. ఈ సారి కూడా 22 దేశాల నేతలను వెనక్కి నెట్టి మోడీ అగ్రస్థానం సాధించడం విశేషం. పరిపాలనలో తనదైన మార్కు నిర్ణయాలు, అభివృద్ధి, అందరినీకలుపుకుని వెళ్లడం, అవినీతి రహిత పాలన వంటి అంశాలే మోడీ ప్రజాదరణను పెంచాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ సర్వేలో తర్వాతి స్థానాల్లో స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలెన్ బెర్సెట్, మెక్సికో అధ్యక్షుడు ఆండ్రిస్ మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రాడోర్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఉన్నారు. ఈ సర్వేలో అమెరికా అధ్యక్షుడు పాపులారిటీ 50 శాతం కంటే తక్కువ ఉండటం గమనార్హం. జో బైడెన్, కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో, జర్మనీ చాన్సరల్ ఒలాఫ్ స్కోల్జ్, బ్రిటన్ ప్రధాని రిషిసునాక్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. టాప్‌హెల్త్ జర్నల్స్‌లో ఒకటిగా పరిగణించే లాన్సెట్ ఆయుష్మాన్ భారత్‌ను ప్రశంసించింది.

## 26న హస్తినకు కాంగ్రెస్ నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే22:** రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఆ పార్టీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఈనెల 26న ఢిల్లీకి రావాలని ఆ పార్టీ ఆదేశించింది. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ నేతలు చర్చించనున్నారు. మరోవైపు తెలంగాణలో ప్రతి 10 రోజులకు ఓసారి పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ తెలంగాణలో పర్యటించేలా కాంగ్రెస్ నాయకత్వం ప్లాన్ చేస్తుంది. తెలంగాణసహా ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు చెందిన నేతలకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నుంచి పిలుపువచ్చింది. ఆయా రాష్ట్రాలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనుంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిది. దీంతో తెలంగాణపై ఆ పార్టీ నాయకత్వం ఫోకస్ పెట్టింది.

# మైనారిటీ మతస్థులకు సర్కార్ చేయూత



సోమవారం సచివాలయంలో జైనమత పెద్దలు సిఎం కెసిఆర్‌తో సమావేశమైన దృశ్యం

**జైన్ భవన్ కోసం ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలం**

**మహావీర్ హాస్పిటల్‌కు ప్రభుత్వ లీజు స్థలం ఉచితంగా అందజేత**

**సచివాలయంలో సిఎం కెసిఆర్‌తో జైనమత పెద్దల సమావేశం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే22:** రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ మతస్తుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పునరుద్ఘాటించారు. గంగా జమున తెహజీబ్‌కు నిలయమైన తెలంగాణ రాష్ట్రంలో దేశంలో పలు ప్రాంతాలకు చెందిన విభిన్న మతాలు, సంస్కృతుల ప్రజలు సుఖశాంతులతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సిఎం కెసిఆర్‌తో జైనమత పెద్దలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ మైనారిటీ హక్కులను గుర్తిస్తూ తమకు మైనారిటీ కమిషన్‌లో ప్రాతినిధ్యం కల్పించినందుకు సిఎం కెసిఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా జైన మతస్తులత కోరిక మేరకు జైన్ భవన్ నిర్మాణానికి ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలాన్ని సిఎం కేటయించారు. దీంతో పాటు జైన మహావీర్ హాస్పిటల్ చైర్మన్, మత పెద్దల విన్నపంమేరకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో దశబ్దాల కాలంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి ఆదరణ పొందుతూ వైద్య సేవలందిస్తున్న మహావీర్ హాస్పిటల్ నిర్మితమై ఉన్న ప్రభుత్వ లీజు ≫2

జూ॥ పంచాయతీ కార్యదర్శుల 2లో

## సర్వీసు క్రమబద్ధీకరణ

**విధివిధానాలు ఖరారు చేయాలని అధికారులకు సిఎం కెసిఆర్ ఆదేశం**




సోమవారం పోర్ట్ మోర్స్‌బైలో ప్రధాని మోడీకి పపువా న్యూగినియా అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరిస్తున్న గినియా గవర్నర్ జనరల్ సర్ బాబ్ దాదే

## మీతోనే ఉంటాం.. మీరే మా సౌత్ లీడర్

**పపువా న్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపే**

**పోర్ట్‌మార్స్‌బీ(పపువాన్యూగినియా), మే 22:** పసిఫిక్ ద్వీపకల్ప దేశాలు నేడు భారత ప్రధాని నరేంద్రమోడీని దక్షిణాది ప్రపంచనేతగా పరిగణిస్తున్నాయని, భారత్ నాయకత్వంలో అంతర్జాతీయ వేదికల్లో ఈదేశాల వాణిని ప్రధానిమోడీ వినిపించాలని పపువాన్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపే విజ్ఞప్తిచేసారు. పసిఫిక్ దేశాలు ఇటీవలి కాలంలో రష్యా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని ప్రధాని చెపుతూ ఇంధనధరలు, విద్యుత్ ట్యారిఫ్‌లు పెరిగాయని, ఆహార ఉత్పత్తులు పెరిగి ద్రవ్యోల్బణం ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తంచేసారు.

ఫిపిక్ సదస్సుకు సహాధ్యక్షునిగా వ్యవహరించిన గినియా ప్రధాని తన ప్రసంగంలో మాట్లాడుతూ మీరేఇపుడు గ్లోబల్‌సౌత్‌లీడర్. మాదేశాలు అన్నీ కూడా మీ వెంటే అంతర్జాతీయ ≫2



సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి. చిత్రంలో విహెచ్, కోదండరెడ్డి

## 111 జీఓ రద్దు వెనుక లక్షల కోట్ల కుంభకోణం

**నిజ నిర్ధారణ కమిటీ వేస్తాం: రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ మే 22 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన జిఓనెంబరు.111 రద్దు వెనుక ప్రపంచ చరిత్రలో కనివిని ఎరుగని భారీ కుంభకోణం దాగి ఉందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కెసిఆర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ కుంభకోణం విలువను లెక్కించడానికి ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేయాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ తీసుకున్న జిఓ 111 రద్దు నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం వరదల్లో మునిగి వేల మంది చనిపోయే పరిస్థితి వస్తుందన్నారు. పరిపాలనపై పట్టులేని వ్యక్తి నిర్ణయాల వల్ల హైదరాబాద్ ఆగం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కెసిఆర్ సిఎం అయ్యాక హైదరాబాద్ విధ్వంసం మొదలైందన్నారు. మంత్రి కెటిఆర్ రియల్ ఎస్టేట్ మాఫియాను తయారు చేసుకున్నారని ఆరోపించారు. 111 జిఓ రద్దు అణువిస్ఫో ≫7

# ఒంటరిగానే పోటీ

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బండి సంజయ్**



సోమవారం చంపాపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

**హైదరాబాద్ (సైదాబాద్), మే 22 ప్రభాతవార్త:** తెలంగాణాలో ఒంటరిగానే పోటీ చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమాశాలను సోమవారం చంపాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒంటరిగానే పోటీ చేసి విజయం సాధించి అధికారంలోకి వస్తామని అన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన కాంగ్రెస్‌పార్టీ బిఆర్ఎస్‌కు ఎలా ప్రత్యామ్నాయ మవుతుందని ప్రశ్నించారు. కర్ణాటక ఫలితాలకు తెలంగాణాకు సంబంధం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ బలంగా ఉంటే వరంగల్, జిహెచ్ఎంసి, నిజామాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎందుకు గెలవలేదని ఆయన ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయని కాంగ్రెస్ నేతలే చెబుతున్నారని అన్నారు. ప్రధానికి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశ్యంతో తెలంగాణాలో కేంద్ర సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి వస్తున్న ఆదరణను చూసి ముఖ్యమంత్రి కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్‌ను పెంచడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పథకం ప్రకారం తెలంగాణాలో బిజెపి మీద కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. బిఆర్ఎస్ బలహీనంగా ఉన్న స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయిస్తున్నారని ఆయన ఆరోపించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం చేపడుతామని అన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలను మోసం చేసిన విశ్వాస ఘాతకుడు సిఎం కెసిఆర్ అని బండి సంజయ్ మండి పడ్డారు.

**కాంగ్రెస్‌కు కెసిఆర్ డబ్బులు..**

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కెసిఆర్ డబ్బులు పంపించారని బండి సంజయ్ ఆరోపించారు. కర్ణాటకలో బిజెపికి అధికారం దక్కకున్నా ఓట్ల శాతం మాత్రం తగ్గలేదన్నారు. తెలంగాణాలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం ≫2

# 27 దాకా విచారణకు రాలేను



**సిబిఐకి అవినాష్ రెడ్డి మరో లేఖ**

**ముందస్తు బెయిలు పిటిషన్‌పై సుప్రీంలో నేడు విచారణ**

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తల్లి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరినందున ఈ నెల 27వ తేదీ వరకు తాను విచారణకు రాలేనని అవినాష్ రెడ్డి సిబిఐ అధికారులకు సోమవారం మరోమారు లేఖరాశారు. తనతల్లి కర్నూలులో ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని, దీనికి సంబంధించి వైద్యులు ఇచ్చిన నివేదిక ప్రతిని ఆయన తన లేఖతో పాటు సిబిఐ అధికారులకు పంపారు. తన తల్లి అనారోగ్యం రీత్యా తాను కర్నూలులోనే వున్నానని, ఈ తరుణంలో తాను విచారణకు రాలేనని, తనకు కొంత గడువు కావాలని, ఈ నెల 27వ తేదీ వరకు గడువు ఇవ్వాలని ఆయన కోరారు. ఇదే సమయంలో మంగళవారం నాడు తన ముందస్తు బెయిల్‌కు సంబంధించిన పిటిషన్ సుప్రీం కోర్టులో విచారణకు రానుందని కూడా ఆయన తన లేఖలో ప్రస్తావించారు. కాగా ఎంపి అవినాష్ రెడ్డి వాస్తవానికి సోమవారం ఉదయం 11గంటలకు హైదరాబాద్ లోని సిబిఐ కార్యాలయానికి విచారణకు హాజరు కావాల్సి వుండగా తన తల్లి అనారోగ్యంతో వున్నందున హాజరు కావడంలేదని ఆయన ఆదివారం నాడే లేఖను పంపగా దీనిపై సోమవారం నాడు మరో లేఖను పంపారు. కాగా దీనిపై సిబిఐ ఇంకా స్పందించలేదు.

మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణకు సంబంధించి సోమవారం నాడు రెండు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇందులో మొదటిది ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టులో అవినాష్ రెడ్డి దాఖలు చేసుకున్న పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. విచారణ మంగళవారం జరుగుతుంది. ఇదే సమయంలో సిబిఐ విచారణకు వచ్చేందుకు తనకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు కావాలని అవినాష్ రెడ్డి సిబిఐ అధికారులకు మరో లేఖను రాశారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపి అవినాష్ రెడ్డికి సుప్రీం కోర్టులో మరోసారి చుక్కెదురయ్యింది. అవినాష్ రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు వెకేషన్‌బెంచ్ సోమవారం నిరాకరించింది.

ఈ తరహా కేసులను మెన్షనింగ్ లిస్టులో ≫2

# 'కాళేశ్వరా'నికి ప్రపంచ స్థాయి గుర్తింపు

**అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ అవార్డు అందజేత**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** తెలంగాణ తలమానిక కాళేశ్వరం ప్రాజెక్టుకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్(ఎఎస్‌సిఈ) కాళేశ్వరం ప్రాజెక్టును 'ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొగ్రెస్' గుర్తించి అవార్డును ప్రధానం చేసింది.అగ్ర రాజ్యం అమెరికాలో తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయగాథలను ఐటీ,పరిశ్రమల మంత్రి కెటిఆర్ వివరించారు. అమెరికాలోని నేవెడా రాష్ట్రం హెండర్సన్ నగరంలో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్(ఎఎస్‌సిఈ) నిర్వహించిన వరల్డ్ ఎన్విరాన్మెంట్ అండ్ వాటర్ రిసోర్స్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కెటిఆర్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా తాగు, సాగునీటిరంగంతో పాటు పలు రంగాల్లో సాధించిన విజయాలను ఆమెరికా ఇంజినీరింగ్ నిపుణులు, సామాజికవేత్తలు,పరిశ్రమ వర్గాలకు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఎదుర్కొన్న కష్టాలు,పల్లం నుంచి ఎత్తుకు గోదావరి నదీ జలాలను ఎత్తిపోసేందుకు సిఎం కెసిఆర్ ఇంజనీర్‌గా మారిన ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరానికి రూపకల్పన చేసిన తీరు,నాలుగేళ్లలోనే ప్రాజెక్టు పూర్తి చేసిన తీరుపై ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 13 జిల్లాలో 500 కిలోమీటర్ల మీద ఈ ప్రాజెక్టు విస్తరించిందని, 1800కిలోమీటర్ల కాల్వల నిర్మాణం జరిగిందని, ఏడు మెగా లింకులను 28 ప్యాకేజీలుగా 22 పంపు హౌస్‌ల నిర్మాణం చేశారన్నారు. కాలువనిర్మాణం, పంప్‌హౌస్‌లు, సర్జ్ పూల్‌లు, ప్రాజెక్టులో వినియోగించిన స్టీల్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ వ్యాప్తంగా తాగునీటి కష్టాలను తీర్చేందుకు చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టు,దీంతో వందశాతం ఇంటింటికీ తాగునీటిన అందిస్తున్నట్లు ప్రజంటేషన్ ద్వారాతెలిపారు. ఒక నాయకుడి నిబద్ధతకి కాళేశ్వరం ప్రాజెక్టు నిదర్శనమని కెటిఆర్ తెలిపారు.



సోమవారం పోర్ట్‌మోరిస్బీలో ప్రధాని మోడీకి ఫిజి అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తున్న ఆదేశ ప్రధాని సిత్వెని రెబుకా

# మోడీకి ఫిజీ అత్యున్నత పురస్కారం

**పోర్ట్ మోరెస్బీ, మే 22:** పసిఫిక్ దేశమైన పపువా న్యూగునియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీకి అపూర్వ ఆదరణ లభించింది. పపువా న్యూగునియా, ఫిజీ నుంచి అత్యున్నత పురస్కారాలను పొందారు. ఫిజీ తన దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ది కంపానియన్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఫిజీ'ని ఇచ్చి సత్కరించింది. ఆయన గ్లోబల్ లీడర్‌షిప్‌కు గుర్తుగా దీనిని అందచేసింది. ఆ తర్వాత గునియా నుంచి అరుదైన గౌరవాన్ని పొందారు. పపువా న్యూగునియాలో పర్యటించిన మోడీ, సోమవారం ఇండియా–పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్ మూడవ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిజీ ప్రధాని సిటివేని రెబుకా, మోడీకి పౌర పురస్కారాన్ని అందించారు. ఇప్పటి వరకు ఫిజీయేతరులైన అతికొద్ది మందికి మాత్రమే దీనిని అందుకొన్నారు. అనంతరం గినియా ప్రభుత్వం 'కంపానియన్ ఆఫ్ ఆర్డర్ ఆఫన లోగొహు'ను ఇచ్చి గౌరవించింది. గతంలో పలు దేశాలు మోడీకి అత్యున్నత పురస్కారాలను అందించాయి. అంతర్జాతీయ వేదికపై మోడీ నాయకత్వంతో భారత్‌కు పెరుగుతోన్న ప్రాబల్యం, ఇతర దేశాలతో మెరుగవుతున్న సంబంధాలకు గుర్తుగా ఈ గౌరవాలు దక్కుతున్నాయి. వాతావరణ మార్పులు ప్రపంచ దేశాలపై చూపిస్తోన్న పెనుప్రభావం విషయంలో అందరినీ చైతన్యం చేసేందుకు ప్రధాని మోడీ ముందుంటారు. దానితో భాంగా ఆయన పర్యావరణ హితమైన నీలం రంగు జాకెట్‌లో కన్పించారు. గునియాలో తొలిసారి పర్యటించిన ఆయన, రోజంతా ఈ వస్త్రధారణలోనే ఉన్నారు. ప్లాస్టిక్ బాటిళ్లను రీసైకిల్ చేసి దానిని తయారు చేశారు.

# మీరే మా సౌత్ లీడర్

వేదికలపై నిలుస్తాయని పేర్కొన్నారు. పెద్దదేశాల్లో నెలకొంటున్న భౌగోళిక రాజకీయాలు, అధికార యుద్ధాలకు మాలాంటి చిన్నదేశాలు సతమతం అవుతున్నాయని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంతో మేం ద్రవ్యోల్బణం దిగుమతిచేసుకున్నామని, ఇంధనం, విద్యుత్ ట్యారిఫ్‌లు ఆకాశానికి చేరుకున్నాయని ఇవన్నీ పెద్దదేశాల క్రీనీడల కారణంగానే మాలాంటి చిన్నదేశాలు సతమతం అవుతున్నాయన్నారు.

మా దేశాల సమస్యలను మీనాయకత్వంలోనే జి7, జి20 వంటి దేశాల సదస్సుల్లో వినిపించాలని, మా వాణిని వినిపిం చాలని, ఆర్థికవ్యవస్థథ, వాణిజ్యం, వర్తకం, భౌగోళిక రాజకీయ పరిస్థితులపైనా మాతరపున వాణి వినిపించాలని మోడీని కోరారు. పసిఫిక్ ద్వీపకల్పదేశాలతరపున ప్రధానిమోడీ నాయకత్వం వహిస్తే మేం వెన్నంటి నిలుస్తామని, వర్ధమాన దేశాలు, వర్ధమాన ఆర్థివ్యవస్థల హక్కులకు పోరాటానికి సిద్ధం అవుతామని మరాపే పిలుపునిచ్చారు.

# సర్కార్ చేయూత

స్థలాన్ని ఉచితంగా సిఎం కెటాయించారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ నిర్ణయాల పట్ల హర్షధ్వనాలతో జైన సమాజం ధన్యవాదాలు తెలిపింది.

ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ భారత దేశానికి నీరు, భూమి, వాతావరణం, సూర్యరశ్మి వంటి ప్రకృతి అందించిన వనరులను సద్వినియోగం చేసుకోవడంలో 75 ఏండ్లుగా దేశ పాలక వ్యవస్థ వైఫల్యం చెందిందని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశంలో లభ్యమవుతున్న ప్రకృతి వనరుల వివరాలను ఒక్కొక్కటిగా సిఎం కెసిఆర్ వారికి వివరించారు. వ్యవసాయాధారిత భారతదేశంలో కేంద్ర పాలకులకు దార్శనికత లేకపోవడమే రైతుల పాలిట శాపంగా మారిందని సిఎం అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ఇవాళ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, ప్రజలందరి సహకారంతో దేశ వ్యాప్తంగా ఆ అభివృద్ధిని పరిచయం చేస్తామని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు.

**వ్యాపార,వాణిజ్య,పారిశ్రామిక రంగాలకు తెలంగాణ పాలన రామరాజ్యం:**

జైన సమాజం గత పాలకుల హయాంలో ఎన్నడూ లేనివిధంగా అత్యంత సమర్థవింతంగా శాంతిభద్రతలను పటిష్టంగా కొనసాగిస్తూ తెలంగాణనను అభివృద్ధి పథాన నడిపిస్తున్న సిఎం కెసిఆర్ పాలన రామరాజ్యాన్ని తలపిస్తున్నదని జైన మత సమాజ పెద్దలు కీర్తించారు. పారిశ్రామికాభివృద్ధి,వ్యాపార వాణిజ్య రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈ విషయం వ్యాపార వర్గాలైన తమ అనుభవంలోకి స్వయంగా వచ్చిందని స్పష్టం చేశారు.

సిఎం కెసిఆర్‌తో సమావేశంలో జైన మత పెద్దలు మాట్లాడుతూ 'మరెవ్వరికీ సాధ్యం కాని ఇంతటి అభివృద్ధి ముఖ్యమంత్రి కెసిఆర్ దార్శనికతతో మాత్రమే సాధ్యమైందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, పారిశ్రామిక రంగాలకు అవసరమైన నాణ్యమైన విద్యుత్,తదితర మౌలిక వసతులను పటిష్టపరచడంతో నేడు తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మత్స్య, పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సిఎం కెసిఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపిన వారిలో శ్రీజైన్ సేవా సంఘ్ చైర్మన్ అశోక్ బర్మేచా, ప్రెసిడెంట్ యోగేష్ జైన్,వైస్ ప్రెసిడెంట్ వినోద్ సంచతి, సెక్రటరీ జీమురా, జైన్ రత్న అవార్డు గ్రహీత,ఫౌండర్ సెక్రటరీ సురేందర్ లోనియా, మహావీర్ హాస్పిటల్ ఎక్స్ చైర్మన్ మోతీలాల్ జైన్, మాజీ అధ్యక్షులు గౌతం లోడ,మాజీ కార్యదర్శి బసంత్, మాజీ అధ్యక్షులు గౌతంచంద్ జైన్,జువెలరీ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ షెర్మల్ జైన్, జయప్రకాశ్ బాంగడ్, హిమాన్షు,తలసాని సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 27 దాకా విచారణకు రాలేను

వుంటేనే విచారిస్తామని జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం పేర్కొంది. దీనికి సంబంధించి మెన్షనింగ్ అధికారిని కలవాలని సూచించిన ధర్మాసనం మరోసారి తమ ముందుకు ఈ పిటిషన్ విచారణకు రాకూడదని ఆదేశించింది. ఈ మేరకు మెన్షనింగ్ అధికారికి ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం ఆయన తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఇందుకోసం వెకేషన్ బెంచ్ జస్టిస్ జె.కె మహేశ్వరి, జస్టిస్ నరసింహాలతో కూడిన ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌ను మెన్షన్ చేశారు. ఈ పిటిషన్ తమ ముందుకు విచారణకు రావడం లేదని చెప్పిన ద్విసభ్య ధర్మాసనం మరో వెకేషన్ బెంచ్ ముందుకు వెళ్లాలని అవినాష్ రెడ్డి తరపు న్యాయవాదులకు సూచించింది. దీంతో అవినాష్ రెడ్డి తరపు న్యాయవాదులు జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం ముందుకు వెళ్లగా మెన్షనింగ్ లిస్టులో వుంటేనే పిటిషన్‌ను విచారిస్తామని పేర్కొంది. అప్పటివరకు విచారణకు నిరాకరించింది. కాగా ఈ కేసుకు సంబంధించి అవినాష్ రెడ్డి నెల రోజుల క్రితం ముందస్తు బెయిల్ కోసం మొదట సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. అయితే ఈ కేసు విచారణను తెలంగాణ హైకోర్టుకు అప్పగిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు ఇవ్వడం విదితమే. దీనిపై సుప్రీం కోర్టు తేదీని ఖరారు చేయక పోవడంతో వేసవి సెలవుల తరువాత జూన్ రెండవ వారంలో దీనిపై విచారిస్తామనితెలంగాణ హైకోర్టు పేర్కొంది. అయితే ఈలోగా సిబిఐ తనను అరెస్టు చేసే అవకాశం వుండడంతో అవినాష్ రెడ్డి మరోసారి సుప్రీం కోర్టును ఆశ్రయించి వివేకా హత్య కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. కాగా ఇదే కేసులో మంగళవారం నాడు అవినాష్ రెడ్డి తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్‌కు వెళ్లాలని భావిస్తున్నారని తెలిసింది.



సోమవారం తిరువతనంతపురంలో జరిగిన కేరళ శాసనసభ రజతోత్సవాలలో సావనీర్ విడుదల చేస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

## జూ॥ పంచాయతీ కార్యాదర్శుల

# సర్వీసు క్రమబద్ధీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తవినిపించింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను సిఎం కెసిఆర్ ఆదేశించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసు క్రమబద్ధీకరణపై సిఎం కెసిఆర్ అధ్యక్షతన సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. దీనికి సంబంధించి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరును మదింపు చేయడానికి జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని సిఎం సూచించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్), జిల్లా ఫారెస్ట్ అధికారి,జిల్ల ఎస్పీ లేదా డిసిపి మెంబర్లుగా ఉంటారు. దీనికి రాష్ట్ర స్థాయి నుంచి ఒక సెక్రటరీ లేదా హెచ్‌ఓడి స్థాయి అధికారి పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేయనున్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా పంపించినటువంటి ప్రతిపాదనను రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. ఆ తర్వాత రాష్ట్ర స్థాయి కమిటీ చీఫ్ సెక్రటరీకి నివేదికను పంపిస్తుంది.

రాష్ట్రంలోని కొన్ని గ్రామ పంచాయతీలలో తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ పంచాయతీ సెక్రటరీలను జిల్లా కలెక్టర్లు నియమించారు. ఈ స్థానాల్లో కూడా కొత్త జూనియర్ పంచాయతీ సెక్రటరీల భర్తీ ప్రక్రియను, క్రమబద్ధీకరణ తర్వాత దశలో ప్రారంభించాలని సిఎం కెసిఆర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, సిఎం ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సిఎం కార్యదర్శి భూపాల్‌రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరిగానే పోటీ

అయిందన్నారు. బిజెపి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేస్తామని అన్నారు. దుబ్బాక నుంచి మునుగోడు ఉప ఎన్నిక వరకు ఏ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదన్నారు. అన్ని ఎన్నికలు బిఆర్ఎస్‌కు బిజెపియే ప్రత్యామ్నాయమని తేల్చాయని అన్నారు.

కాగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌రావు కూతురు డాక్టర్ సుసి ్మత, బిఆర్ఎస్ నాయకులు గోవిందా రాఠీ, మనోజ్‌లు సునిల్ బన్సాల్, బండి సంజయ్‌ల సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డాక్టర్ లక్ష్మణ్, డికె అరుణ, ఈటెల రాజేందర్, రాజగోపాల్‌రెడ్డి, జితేందర్ రెడ్డి, వివేక్, నల్లు ఇంద్రసేనారెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, మురళీధర్‌రావు, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి తదితరులు పాల్గొన్నారు.

# శరత్ బాబు కన్నుమూత



శరత్‌బాబు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జయసుధ, మురళీమోహన్

కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం ఇతర అవయవాలు దెబ్బతిని మల్టి ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారి తీసింది. ఏఐజీ ఆసుపత్రిలో సీనియర్ డాక్టర్ నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యబృందం శరత్‌బాబుకు వైద్య సేవలు అందించినా, చికిత్సకు ఆయన శరీరం సహకరించకపోవడంతో సోమవారం మధ్యాహ్నం 1.32 గంటలకు ఆసుపత్రిలోనే శరత్‌బాబు తుదిశ్వాస విడిచారు. శరత్‌బాబు పార్థీవదేహాన్ని కుటుంబ సభ్యులు చెన్నైలోని ఆయన నివాసానికి తరలించారు. మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయి. కాగా శరత్‌బాబు అసలు పేరు సత్యం బాబు దీక్షితులు. హీరోగానే కాకుండా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అనేక సినిమాల్లో శరత్‌బాబు విలక్షణ పాత్రలు పోషించారు. 1973లో రామరాజ్యం సినిమాతో తెలుగు సినిమా పరిశ్రమలోకి ప్రవేశించిన శరత్‌బాబు చాలా హిట్ సినిమాల్లో నటించారు. రామరాజ్యం, కన్నె వయస్సు,పంతులమ్మ, అమెరికా అబ్బాయి, చిలకమ్మ చెప్పింది, నీరాజనం, సీతాకోకచిలుక, ఓభార్యకథ, అన్వేషణ, ఇది కథకాదు, ఆపద్బాంధవుడు వంటి ఎన్నో సినిమాల్లో శరత్‌బాబు తన అద్భుతమైన నటనను ప్రదర్శించారు. వెండితెర పైనే కాదు బుల్లితెర వేదికగానూ ప్రేక్షకులకు చేరువగా ఉండాలనుకున్నారు. అందుకే పలు దారావాహికల్లో నటించారు. శరత్‌బాబు నటించిన అంతరంగాలు సీరియల్ ఆయనకు మంచి పేరుతెచ్చిపెట్టింది.

శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలసలో 1951 జూలై 31 జన్మించిన ఆయన పోలీస్ ఆఫీసర్ కావాలని కలలుకన్నాడు. కానీ ఆయన కళ్ల సమస్యల వల్ల పోలీస్ కాలేకపోయాడు. ఆతర్వాత ఓ పేపర్‌లో ఆడిషన్ ప్రకటన చూసి సినిమా యాక్టర్‌గా ఆడిషన్‌కు వెళ్లిన ఆయన ప్రముఖ దర్శకుడు బాలచందర్ దర్శకత్వం వహించిన 'నిళిల్ నిజమా గిరదు' అనే సినిమా ద్వారా మొదట తమిళ చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా తెలుగులో ఇదికథకాదు సినిమాగా తెరకెక్కింది. ఇందులో శరత్‌బాబు సహచర నటులు కమలాసన్, చిరంజీవి, జయసుధ వంటి గొప్ప నటులతో కలిసి నటించారు. బాలచందర్ తెరకెక్కించిన తెలుగు సినిమాలన్నింటిలో ఏదో ఒక రోల్‌లో కనిపించారు. 'సాగర సంగమం'లో కమల్ స్నేహితుడిగా ఆయన నటన అందరి మనసులను హత్తుకుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఇలా ఆరు భాషల్లో హీరో, విలన్, సహాయనటుడిగా 300కి పైగా చిత్రాల్లో నటించారు. శరత్ బాబు తన సినీ ప్రయాణంలో మూడు సార్లు ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాలను అందుకున్నారు. ఇక ఆయన వ్యక్తిగత జీవితంలో మొదట రమాప్రభను పెళ్లి చేసుకుని 1988లో విడిపోగా ..1990లో స్నేహా నంబియార్‌ను పెళ్ళి చేసుకుని ఆమెకు 2011లో విడాకులు ఇచ్చారు. ఇండస్ట్రీలో అందరితో స్నేహితుడిగా ఉంటూ అందరి ప్రేమను అందుకుని..సహజ నటనతో ప్రేక్షకుల హృదయంలో మంచి స్థానాన్ని దక్కించుకున్న శరత్‌బాబు ఆకాల మరణంతో తెలుగు సినీ లోకం మూగబోయింది. ఆయన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ అభిమానులు ఆయనకు నివాళులర్పించారు.

**శరత్‌బాబు విలక్షణ నటుడు: ప్రధాని మోడీ**

సీనియర్ నటుడు శరత్‌బాబు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన తన స్పందనను సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. శరత్‌బాబు గారు విలక్షణమైన, సృజనాత్మక నటుడు అని కొనియాడారు. తన సుదీర్ఘ సినీ జీవితంలో అనేక భాషల్లో అనేక పాత్రలతో ఎప్పటికీ గుర్తిండిపోతారని కీర్తించారు. శరత్‌బాబు ఈ లోకాన్ని విడిచి వెళ్లడం విచారకరం అని మోడీ పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబానికి అభిమానులకు సంతాపం తెలియజేస్తున్నానని వెల్లడించారు.

**పలువురు నటుల నివాళులు**

కాగా..అభిమానుల సందర్శనార్థం శరత్‌బాబు భౌతికకాయాన్ని హైదరాబాద్‌లోని ఫిలించాంబర్ వద్దకు తీసుకువచ్చారు. శరత్‌బాబు భౌతికకాయానికి ఫిలిం చాంబర్ సభ్యులు, మా ప్రతినిధులు నివాళులు ఆర్పించారు. నివాళులర్పించినవారిలో సినీ ప్రముఖులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, జయసుధ, రఘుబాబు, మంచు విష్ణు, ప్రభాస్ శ్రీను, నరేశ్, పవిత్ర, శివాజీ రాజా, శివబాలాజీ తదితరులు శరత్‌బాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.ప్రముఖ నటులు జూనియర్ ఎన్టీఆర్,నాని, సాయిధరమ్‌తేజ్ తదితరు తమ సంతాప సందేశాన్ని పంపారు. ఆయన సినిమా ప్రపంచానికి చేసిన సేవలతో ఎప్పటికీ గుర్తుండిపోతారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు.

## వారం - వర్జ్యం

23-5-2023 మంగళవారం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయనం

జ్యేష్ఠ మాసం, శుక్ల పక్షం, కార్తి కృతిక

చవితి రా.11-12; ఆరుద్ర ఉ.11-31

వర్జ్యం రా. 12-37 ల 02-21

రా.కా. మ.3-00 ల 4-30 వ

యమగండం ఉ.9-00 ల 10-30 వ

దుర్ముహూర్తం ఉ.8-24 ల 9-12 వ

రా.10-48 - 11-36

## వార్తాఫలం

**మేషం:** వాహన యోగం. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి.

**వృషభం:** ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు.

**మిథునం:** అనుకోని ధన లాభం. స్త్రీలకు శుభ యోగం.

**కర్కాటకం:** గృహ యోగం. శుభ కార్యాలకు అధిక ధనం ఖర్చు చేస్తారు.

**సింహం:** క్రయ-విక్రయాలు లాభదాయకం. ఉద్యోగులకు ప్రశంసలు లభిస్తాయి.

**కన్య:** అకారణంగా ఆందోళన చెందుతారు. మిత్రులతో మనస్పర్థలు.

**తుల:** ఖర్చులు అధికం. అనుకున్నది సాధించలేకపోవచ్చు. సహనంతో ఉండండి.

**వృశ్చికం:** దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

**ధనుస్సు:** ఆకస్మిక ధన లాభం. వ్యాపారులకు పోటీ అధికంగా ఉంటుంది.

**మకరం:** వ్యాపారులకు ఆశించిన ఫలితాలు ఉండకపోవచ్చు.

**కుంభం:** ఉద్యోగులకు బాగుంటుంది. అన్ని వ్యవహారాల్లో విజయం.

**మీనం:** వ్యాపారులకు సామాన్యం. ఉన్నతాధికారులను సందర్శిస్తారు.

- పాలకుర్తి సంతోష్ శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

### SINGAM KUIL YELLOW MONDAY
DrawDate on:22/05/23

DAY - SINGAM SERIES Dr No:188
1st Prize Rs.100000/- 578894
2nd Prize Rs.7000/- 58148
3rd Prize Rs.3500/-
11479 14752 15231 45736 45764
49674 62720 64326 80051 93424
4th Prize Rs.200/-
1097 2620 2786 3302 4878 5966 6832
7561 8198 8814
5th Prize Rs.100/-
1513 2022 2789 6454 8347 8349 8454
9166 9376 9918
6th Prize Rs.50/-
0415 1548 3051 4234 5454 7226 8876
0439 1620 3087 4449 5701 7416 8972
0488 1671 3233 4476 5800 7440 9121
0519 1921 3437 4493 5811 7648 9202
0812 1983 3450 4497 5907 7658 9289
0813 2033 3506 4579 6093 7688 9305
0941 2192 3582 4643 6137 7852 9327
1058 2221 3809 4847 6138 7949 9709
1081 2323 3888 4997 6334 8085 9787
1146 2493 3904 5026 6712 8256 9975
1371 2547 4009 5136 6744 8332
1433 2633 4058 5250 6962 8442
1437 2665 4092 5278 7035 8574
1497 2742 4150 5417 7208 8601
1539 2961 4180 5426 7212 8737

DAY - KUIL SERIES Dr No:188
1st Prize Rs.100000/- 936839
2nd Prize Rs.7000/- 52466
3rd Prize Rs.3500/-
01295 11947 12045 16680 31647
39194 62485 72828 79967 91228
4th Prize Rs.200/-
0611 1384 2122 2513 3414 3491 6271
6891 7907 8312
5th Prize Rs.100/-
0378 0501 3114 3323 6358 7280 7483
8818 9088 9488
6th Prize Rs.50/-
0000 1180 2536 4223 5879 7900 9238
0017 1188 2668 4431 5916 8148 9367
0036 1345 2673 4610 6097 8152 9393
0152 1382 2924 4738 6309 8274 9534
0567 1467 3340 4766 6322 8451 9564
0579 1499 3418 4924 6431 8530 9641
0651 1704 3447 5083 6440 8551 9691
0672 1708 3465 5097 6625 8583 9767
0776 1924 3520 5137 7032 8587 9769
0791 2075 3526 5223 7037 8687 9806
0884 2174 3577 5249 7063 8740
0948 2218 3585 5327 7089 8745
1010 2375 3634 5346 7486 8983
1065 2436 3836 5635 7563 9069
1173 2442 4083 5730 7751 9142

### ROSA DEAR ROYAL MONDAY
DrawDate on:22/05/23

DAY - ROSA SERIES Dr No:188
1st Prize Rs.100000/- 471372
2nd Prize Rs.7000/- 85960
3rd Prize Rs.3500/-
20485 37672 40081 42835 55746
56955 61306 61838 81486 97967
4th Prize Rs.200/-
0424 4197 4476 5452 7028 7565 9192
9573 9702 9849
5th Prize Rs.100/-
2249 3842 4659 4742 5264 5644 6266
7851 7903 9959
6th Prize Rs.50/-
0288 1318 2981 4560 6087 7607 9076
0323 1327 3090 4569 6183 7653 9134
0541 1353 3122 4782 6351 7739 9171
0543 1358 3304 4824 6468 7756 9370
0605 1374 3389 4915 6507 7785 9529
0682 1461 3411 4965 6516 8091 9692
0783 1588 3497 5300 6536 8251 9696
0850 1821 3498 5326 6661 8262 9785
0861 2034 3834 5518 6731 8329 9790
1064 2358 3934 5626 6760 8425 9962
1072 2539 4100 5666 7003 8475
1107 2598 4120 5841 7195 8486
1170 2671 4226 5883 7413 8653
1259 2686 4434 5967 7480 8920
1296 2710 4523 5972 7570 8982

DAY - DEAR SERIES Dr No:188
1st Prize Rs.100000/- 115966
2nd Prize Rs.7000/- 15983
3rd Prize Rs.3500/-
12091 18522 22109 25999 34860
41103 46262 49878 78872 96910
4th Prize Rs.200/-
0383 1355 1457 1701 3760 5341 5870
7857 8596 8833
5th Prize Rs.100/-
0168 0660 1050 2097 2855 4230 6751
6806 8160 8418
6th Prize Rs.50/-
0267 1210 2159 3441 5518 7110 9017
0273 1275 2264 3769 5567 7120 9073
0335 1299 2330 3876 5765 7217 9294
0356 1300 2450 4222 5829 7315 9306
0363 1418 2753 4233 5835 7471 9356
0390 1452 2931 4281 5853 7591 9384
0411 1523 2968 4300 5915 7629 9437
0542 1527 2989 4497 6083 7665 9753
0543 1673 3025 4599 6401 7809 9778
0616 1685 3160 4614 6432 7975 9986
0637 1803 3324 4843 6543 8255
0901 1945 3368 4906 6660 8433
0926 1991 3411 5091 6703 8732
1141 1995 3425 5309 6719 8812
1157 2110 3432 5358 7077 8818

### THANGAM VAIRAM LUCK MONDAY
DrawDate on:22/05/23

DAY - THANGAM SERIES Dr No:188
1st Prize Rs.100000/- 642527
2nd Prize Rs.7000/- 90145
3rd Prize Rs.3500/-
09402 10241 14492 19731 27564
35596 74096 80239 85553 98002
4th Prize Rs.200/-
1074 2104 2395 2775 2841 3911 4317
7116 8979 9943
5th Prize Rs.100/-
1837 2127 5054 5837 6176 6596 7875
8993 9246 9250
6th Prize Rs.50/-
0007 2071 3412 4799 6149 7708 9191
0434 2168 3425 4859 6206 7729 9309
0515 2316 3485 5136 6213 7735 9314
0553 2461 3512 5181 6257 7787 9359
0841 2622 3696 5321 6510 7899 9415
0906 2626 3741 5382 6806 7953 9695
1017 2721 3769 5480 6841 8153 9701
1408 2892 3799 5481 7107 8332 9768
1569 2985 3848 5736 7278 8686 9918
1710 3033 3989 5751 7338 8713 9949
1798 3138 4077 5774 7342 8720
1822 3181 4315 5924 7491 8876
1854 3208 4487 6016 7537 8896
2033 3277 4746 6045 7619 9014
2067 3373 4788 6053 7697 9031

DAY - VAIRAM SERIES Dr No:47
1st Prize Rs.50000/- 964248
2nd Prize Rs.7000/- 03332
3rd Prize Rs.3500/-
01667 06942 17766 19521 20116
41163 41490 57151 63015 83456
4th Prize Rs.200/-
0005 0356 2834 3403 3977 4269 4369
4626 4799 9693
5th Prize Rs.100/-
2141 2389 3143 3375 3437 3818 4927
6051 7338 9267
6th Prize Rs.50/-
0157 1161 2387 4294 6046 7483 9159
0360 1165 2559 4351 6180 7512 9356
0365 1276 2788 4516 6277 7636 9383
0396 1305 2955 4560 6327 7659 9405
0443 1352 3004 4883 6330 7708 9468
0456 1394 3368 4926 6384 7751 9638
0584 1540 3399 5258 6420 7821 9694
0606 1553 3584 5428 6462 7852 9740
0857 1788 3690 5593 6513 8027 9927
0881 1829 3704 5709 6545 8080 9944
0923 1885 3802 5818 6831 8410
0926 2001 3902 5917 7014 8417
0985 2144 4154 5990 7016 8645
0987 2174 4184 5991 7200 8689
0999 2321 4205 5996 7353 9149

### NALLANERAM MANI LUCK MONDAY
DrawDate on:22/05/23

DAY - NALLANERAM SERIES Dr No:188
1st Prize Rs.50000/- 346271
2nd Prize Rs.7000/- 96774
3rd Prize Rs.3500/-
02545 04274 19133 40283 60066
63488 64188 66991 67487 89264
4th Prize Rs.200/-
0113 2913 3370 5287 5329 6653 6844
7155 7508 9435
5th Prize Rs.100/-
0224 0988 3195 3474 3682 4354 6035
8636 9840 9853
6th Prize Rs.50/-
0010 1104 2749 4297 5882 7600 8985
0034 1167 2974 4360 5895 7898 9000
0358 1298 2975 4390 6048 8003 9397
0391 1445 3000 4714 6491 8076 9416
0484 1450 3095 4840 6542 8224 9637
0577 1505 3267 4871 6590 8266 9646
0661 1727 3364 5002 6722 8303 9801
0762 1768 3387 5277 6971 8421 9825
0766 2085 3433 5310 7067 8426 9876
0795 2138 3543 5356 7139 8429 9942
0808 2221 3569 5536 7150 8524
0866 2399 3679 5565 7299 8563
0874 2454 3896 5699 7401 8635
0940 2503 3979 5762 7472 8699
1073 2602 4275 5845 7551 8822

DAY - MANI SERIES Dr No:47
1st Prize Rs.50000/- 781776
2nd Prize Rs.7000/- 82193
3rd Prize Rs.3500/-
06487 55544 64315 66999 69178
78363 85063 87964 96318 96961
4th Prize Rs.200/-
0425 0487 0623 0901 1112 1415 4576
4676 4870 8096
5th Prize Rs.100/-
2548 3463 4864 6086 6610 8053 8141
9091 9591 9632
6th Prize Rs.50/-
0059 1460 2902 4509 6033 7194 8327
0074 1467 2926 4766 6162 7229 8591
0139 1693 3037 4897 6270 7330 8670
0236 1856 3116 4979 6295 7353 8849
0280 1884 3118 5054 6390 7418 8945
0393 1885 3358 5091 6427 7477 9143
0426 2018 3410 5106 6434 7579 9149
0437 2056 3577 5114 6466 7606 9569
0930 2142 3741 5610 6564 7628 9957
1033 2304 3945 5614 6604 7762 9999
1040 2702 3962 5684 6625 7782
1061 2760 3972 5811 6837 7883
1292 2767 4172 5836 6902 7941
1355 2772 4303 5856 6983 8046
1423 2817 4444 5971 6997 8275

### KUMARAN VISHNU SUN MONDAY
DrawDate on:22/05/23

DAY - KUMARAN SERIES Dr No:188
1st Prize Rs.50000/- 452923
2nd Prize Rs.7000/- 39332
3rd Prize Rs.3500/-
22755 25318 25903 34597 44680
45019 50214 64216 81901 81950
4th Prize Rs.200/-
0497 0771 2196 3268 5551 6367 7435
7450 7575 7703
5th Prize Rs.100/-
0763 0973 1362 2851 3205 3492 4146
6194 6979 7625
6th Prize Rs.50/-
0062 1875 2979 4140 5831 7031 9223
0122 1898 2981 4203 5929 7137 9496
0183 1904 3029 4235 6138 7170 9576
0233 2178 3035 4486 6144 7412 9631
0321 2207 3047 4519 6174 7480 9633
0347 2220 3052 4697 6249 7482 9693
0409 2371 3071 4756 6480 7532 9696
0724 2404 3120 4965 6669 7622 9764
1116 2451 3446 4992 6689 7755 9847
1170 2579 3600 5112 6773 8488 9996
1344 2639 3799 5277 6804 8711
1434 2752 3873 5341 6813 8736
1606 2765 3939 5473 6815 8877
1719 2914 4015 5554 6818 9008
1860 2929 4096 5695 6956 9079

DAY - VISHNU SERIES Dr No:188
1st Prize Rs.50000/- 257679
2nd Prize Rs.7000/- 42890
3rd Prize Rs.3500/-
03831 15040 17125 27072 43837
44352 46402 70682 88090 89922
4th Prize Rs.200/-
2872 3223 4391 4727 6442 6635 6730
6827 6921 9789
5th Prize Rs.100/-
2562 2693 2734 3128 4685 5228 5841
7576 8068 9633
6th Prize Rs.50/-
0074 1750 2929 4029 5616 7529 9145
0118 1768 3096 4075 5699 7602 9182
0159 1981 3125 4137 5711 7625 9274
0507 2125 3204 4260 5734 7645 9290
0717 2149 3217 4285 5883 7796 9320
0730 2203 3264 4305 5909 8000 9530
0737 2254 3332 4510 6014 8165 9614
0769 2529 3438 4624 6211 8201 9780
0849 2534 3465 4912 6378 8204 9839
0994 2569 3637 5060 6441 8212 9975
1172 2622 3682 5101 6483 8273
1418 2624 3782 5187 6917 8548
1442 2625 3788 5262 7060 8788
1499 2639 3836 5553 7225 8794
1748 2775 3921 5611 7346 9026

### SWARNALAXMI LION PEARL MONDAY
DrawDate on:22/05/23

DAY - SWARNALAXMI SERIES Dr No:188
1st Prize Rs.50000/- 262407
2nd Prize Rs.7000/- 51849
3rd Prize Rs.3500/-
16195 27719 38400 49821 51337
51517 62226 62934 73654 84502
4th Prize Rs.200/-
0076 1424 1464 5017 5806 5809 5978
7293 8274 9433
5th Prize Rs.100/-
2112 2297 2399 3358 3511 3519 4906
6097 6345 6384
6th Prize Rs.50/-
0005 1989 2864 3898 5540 7068 8359
0392 2005 2890 3975 5594 7098 8379
0644 2091 2896 4028 5649 7198 8635
0665 2259 2977 4646 5850 7206 8724
0698 2287 2982 4661 5906 7342 9086
0786 2488 3082 4761 6186 7349 9516
0840 2616 3096 4820 6200 7492 9674
0856 2653 3168 4911 6359 7511 9802
0920 2694 3217 4935 6398 7725 9809
0947 2712 3257 5083 6427 7793 9911
0952 2773 3309 5162 6575 7935
1236 2785 3364 5192 6720 7965
1604 2792 3425 5259 6863 7981
1683 2809 3529 5370 6912 8126
1740 2856 3733 5508 6987 8254

DAY - LION SERIES Dr No:47
1st Prize Rs.50000/- 237230
2nd Prize Rs.7000/- 59246
3rd Prize Rs.3500/-
15120 26197 26784 37924 48647
59774 61630 72658 83567 94343
4th Prize Rs.200/-
0223 0836 2400 3241 3489 4215 4836
6742 7021 8837
5th Prize Rs.100/-
2060 3245 3618 3647 4030 5683 6702
6884 6918 7217
6th Prize Rs.50/-
0080 1487 3216 4457 5779 6941 8784
0107 1545 3520 4479 5781 7104 8840
0246 1765 3674 4523 5819 7204 9140
0320 1989 3715 4576 6037 7552 9158
0363 2061 3792 4613 6133 7583 9312
0647 2248 3897 4620 6141 7608 9394
0763 2495 4017 4689 6172 7990 9583
0798 2586 4044 4869 6234 8077 9739
0900 2649 4145 5106 6322 8189 9816
0934 2655 4241 5152 6426 8303 9821
1000 2677 4263 5200 6433 8352
1047 2725 4290 5345 6579 8397
1207 2743 4402 5372 6704 8451
1345 2969 4410 5682 6813 8578
1473 3087 4427 5777 6858 8754

## దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి భాగ్యరెడ్డివర్మ కృషి

### 135 జయంతి సందర్భంగా సిఎం కెసిఆర్ నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** దళిత వైతాళికుడు,దళిత మహిళలు,విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నివాళులర్పించారు. మహనీయుడు భాగ్యరెడ్డి వర్మను గౌరవించుకోవడంతో పాటు వారి స్ఫూర్తిని ఆశయాలను కొనసాగించేందుకు వారి జయంతి, వర్ధంతులను ప్రభుత్వ అధికారికంగా నిర్వహిస్తున్నదని సిఎం తెలిపారు. హైదరాబాద్ సంస్థానంలో దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి వారి విద్యాభివృద్ధికి,ఉన్నతికి భాగ్యరెడ్డి వర్మ గట్టి పునాదులు వేశారని సిఎం అన్నారు. దళితజాతి విద్యా వికాసానికి, సాహిత్యం, వారికథలు,ఉపన్యాసాల ద్వారా చైతన్యం తీసుకురావడానికి మాదిరి భాగ్యరెడ్డి వర్మ విశేషంగా కృషి చేశారని సిఎం కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మ స్ఫూర్తితో ఎస్సీ కులాల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నదని సిఎం అన్నారు. షెడ్యూల్ కులాలకు ప్రత్యేక ప్రగతి నిధి, విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్,ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, దళితులకు మూడు ఎకరాల భూమి, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు, దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు టిఎస్ ప్రైడ్, నిరుపేద ఎస్సీ కుటుంబాలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,ఎస్సీలకు గొప్ప భవిష్యత్తులను అందించేందుకు గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యాబోధన వంటి ఎన్నో పథకాలు,కార్యక్రమాలతో ఎస్సీల సమున్నతాభ్యున్నతికి ప్రభుత్వం గొప్ప కార్యాచరణను అమలు చేస్తున్నదని సిఎం అన్నారు. ఎస్సీల సంపూర్ణ వికాసానికి,వారి స్వయం సమృద్ధికి యావత్ దేశంలోనే లేని విధంగా దళితబంధు పథకాన్ని తెచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని సిఎం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంగా పేరు పెట్టడంతో పాటు,హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల భారీ విగ్రహాన్ని నెలకొల్పడం వెనుక దళిత జాతిని సమున్నతంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆకాంక్ష వెల్లడవుతుందని సిఎం అన్నారు.

# ఎన్టీఆర్ జీవితచరిత్ర పాఠం లాంటిది

- తనయుడు నందమూరి రామకృష్ణ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 22, ప్రభాతవార్త:** నందమూరి తారకరామారావు జీవిత చరిత్ర పాఠం లాంటిదని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి తారకరామ కల్చరల్ అసోసియేషన్, ఎన్టీఆర్ వీరాభిమాని మానేపల్లి శరత్‌చంద్ర ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, సుప్రసిద్ధ సినీనటుడు నందమూరి తారకరామారావు శతజయంతి సందర్భంగా 'శకపురుషుడి శతజయంతి' కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో కిక్కిరిసిన ఎన్టీఆర్ అభిమానుల సమక్షంలో, ఎన్టీఆర్ వీరాభిమాని పార్థసారథి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ యుగపురుషుడు ఎన్టీఆర్ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.100 కాయిన్‌ను ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో సంక్షేమ కార్యక్రమాలకు, పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని అన్నారు. ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ యుగపురుషుడు, శకపురుషుడు, తెలుగు ప్రజల నీరాజనాలు అందుకున్న సాటిలేని మేటి దిగ్గజం ఎన్టీఆర్ అని అన్నారు. నూరేళ్ళ పండుగను ప్రపంచంలోని 50కిపైగా దేశాల్లో జరుపుకోవడం ఏ వ్యక్తికి జరగని గౌరవం ఆయనకే దక్కిందన్నారు. నిజమైన ప్రజానాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. భారతీయ వెండి చిత్రంగంలో మార్పులకు, రాజకీయాలకు మార్పులకు శ్రీకారం చుట్టిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు సినిమా సంపద ఎన్టీఆర్ అని, గత కొన్ని దశాబ్దాలుగా అటు రాజకీయ రంగంలోనూ, ఇటు సినీరంగంలో తనదైన ముద్రను వేసుకున్న మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు, ఎన్టీఆర్ వీరాభిమాని పిన్నమనేని సాయిబాబా మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలతో తాను కొనసాగుతున్నానని, ఆయన చూపిన బాటలో ముందుకు సాగుతూ పది మందికి సేవ చేయడానికి తాను కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వీరాభిమానులు కొమ్మినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ చిత్రాలలో నుంచి విలక్షణ గీతాలతో ప్రముఖ గాయకుడు వైఎస్.రామకృష్ణ బృందం నిర్వహించిన 'సినీసంగీత విభావరి' అందరిని మంత్రముగ్దులను చేసింది.



ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణను సత్కరించిన దృశ్యం

# 27న హైదరాబాద్‌లో భారీ 'యోగా'

- హాజరుకానున్న పలువురు కేంద్రమంత్రులు
- 25 రోజుల కౌంట్‌డౌన్ ఆరంభం
- ప్రపంచానికి యోగా ఘనతను పరిచయం చేసిన ప్రధాని మోడీ : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



యోగా డే కార్యక్రమంపై మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట), మే 22, ప్రభాతవార్త :** యోగా అనేది ఏ మతానికి, సంస్కృతికి సంబంధించింది కాదని, ప్రతి మనిషి మానసిక,శారీరక ఆరోగ్యాన్ని పెంచేందుకు యోగా ఒక సాధనమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో మే 27న 25రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తామని కిషన్‌రెడ్డి అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఏదైనా పనిని ఎంతో ఉత్సాహంతో ప్రారంభించడం కొనసాగించడం చాలా ముఖ్యమని అన్నారు. మోడీ ప్రధాని అయ్యాక యోగాను ప్రపంచానికి పరిచయం చేసారు. అలాగే ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి యేడాది కూడా జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవంగా ప్రకటించారు. ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు అనేక దేశాలు అధికారికంగా యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. అనేక కంపెనీల్లో యోగా కోసం ప్రత్యేక ఫ్లోర్స్ కేటాయిస్తున్నారని, ప్రతి రోజు అక్కడ యోగా చేయడం మనకు గర్వకారణంగా ఉందన్నారు. మన దేశంలోని అనేక పార్కులు, సంస్థలు, కాలనీల్లో యోగా శిక్షణా కేంద్రాలు నడుపుతున్నారు. ఈ యేడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని దేశ వ్యాప్తంగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వ హించాలని ఐక్యరాజ్య సమితి,భారత ప్రభుత్వం సంయుక్తంగా అనేక చర్యలు తీసుకుంటున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలియజేసారు. అంతర్జాతీయ యోగా ఉత్సవాన్ని మన దేశంలో ఆజాద్ కా అమృత్ మహోత్సవం సెకండ్ ఫేజ్‌లో భాగంగా యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మన దేశంలోని ప్రతీ గ్రామంలో ప్రతి ఇంట్లో కుటుంబసభ్యులు జూన్ 21వ తేదీన యోగా కార్యక్రమాన్ని జరుపు కోవడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. తూర్పున ఉన్న ఫిజీ నుంచి పశ్చిమాన ఉన్న సాన్ ఫ్రాన్సిస్కో వరకు అన్ని దేశాల్లో యోగాలో పాల్గొ నాలని కోరుకుంటున్నామన్నారు. అన్ని సంస్థలతో కలిసి 100 రోజుల కౌంట్ డౌన్ ఢిల్లీలో ప్రారంభించామన్నారు.75రోజుల కౌంట్ డౌన్ అస్సోంలో 50 రోజుల కౌంట్ డౌన్ రాజస్థాన్, జైపూర్‌లో జరిగిందన్నారు. 25రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమం మే 27న నిర్వహిం చాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో 25రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమం జరుగుతుంది.ప్రపంచానికి జూన్ 21న యోగా దినోత్సవం అద్భుతంగా నిర్వహించాలనే సందేశం పంపడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు.మే27వ తేదీ ఉదయం గం 5లకు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే యోగా కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. హైదరాబాద్‌లో ఉన్న యోగా సంస్థల వారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మే 27వ తేదీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. యోగా ద్వారా ఇచ్చే సందేశం ప్రతి ఇంటికి చేరాలని,ఆయుష్ రిపోర్ట్ ద్వారా సినీ నటులు,క్రీడాకారులను ఆహ్వానిస్తున్నామని, ఆహ్వానం అందినా అందక పోయినా అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని తాము భావిస్తున్నామన్నారు. రాష్ట్రగవర్నర్‌ను కూడా రావాలని కోరుతున్నా మన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలియజేసారు.

## మారుమూల గిరిజన జిల్లాను టాప్‌ర్యాంకుకు చేర్చిన ఐఎఎస్

### ఉమ్మడి ఆంధ్రకు చెందిన విజయభాస్కర్‌రెడ్డి ఇపుడు అసోం హీరో



**గువాహతి, మే 22:** రాష్ట్రంలో ప్రకటించిన పదో తరగతి పరీక్షల్లో ఆక మారుమూల గిరిజన జిల్లాను రాష్ట్రంలోనే టాప్‌స్థాయిలో నిలబెట్టిన ఘనత ఒక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ ఐఎఎస్ దక్కింది. మారుమూల గిరిజన జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక ఉత్తీర్ణతశాతం సాధించాడు. అస్సోంలో పదోతరగతి పరీక్షలకు 4,22,174 మంది హాజరుకాగా వారిలో 3,06,878 మంది ఉత్తీర్ణులయ్యారు. అసోం సెకండరీ విద్యాశాఖ బోర్డు మొత్తంగా 72.69శాతం ఉత్తీర్ణతశాతం నమోదుచేసింది. పరీక్షల ఫలితాలు వెల్లడించిన తర్వాత ఆంధ్రకు చెందిన ఒక యువ ఐఎఎస్ అధికారి పివిజయభాస్కర్‌రెడ్డి ఇపుడు అసోంలో హీరో అయ్యాడు. అసోం మేఘాలయ కేడర్‌కు చెందిన విజయ్‌భాస్కర్ అసోంలోని మారుమూల గిరిజన జిల్లాను ఇపుడు అస్సోంలోనే అత్యున్నతస్థాయికి తీసుకెళ్లాడు. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 88.68శాతం నమోదుచేసాడు. విజయభాస్కరరెడ్డి ఈ గిరిజన జిల్లాలో డిప్యూటి కమిషనర్‌గా చేరాడు. చిరాంగ్ ప్రాంతం అసోం రాజధాని గువాహతికి 200 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కేవలం పదినెలల క్రితమే ఇక్కడ విధుల్లోచేరినప్పటినుంచి ఆయన తనదైన ఫార్ములాను అమలుచేసారు. అంతకుముందు పాఠశాల విద్యాపరంగా చిరాంగ్‌జిల్లా విసిరేసినట్లుగా ఉండేది. అతితక్కువ వ్యవధిలోనే ఈ జిల్లాను ఇపుడు రాష్ట్రంలోనే టాప్ ర్యాంకులో నిలిపాడు. రాష్ట్రంలో ఉత్తీర్ణత 72.69శాతం ఉంటే చిరాంగ్‌ప్రాంతంలో మాత్రం 88.68శాతం నమోదయింది. అసోంలో ఉన్న 31 జిల్లాల్లో ఇపుడు కొత్తగా ఆవిర్భవించిన చిరాంగ్ గిరిజన జిల్లాను స్వల్ప వ్యవధిలోనే అగ్రస్థానంలో నిలిపాడు. ఈ ఉత్తీర్ణత శాతంతో ఈ యువ ఐఎఎస్ ఇపుడు అసోంలో పరీక్షల హీరో అయిపోయాడు.

## సుప్రీంకోర్టులో అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** మాజీమంత్రి వై.ఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సహ నిందితుడుగా వున్న కడప ఎంపి అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ పి టిషన్‌పై మంగళవారం నాడు సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. వివేకా హత్య కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని, అలా కుదరని పక్షంలో తన తల్లి అనారోగ్యాన్ని పరిగణలోకి తీసుకుని, సిబిఐ విచారణకు వారంరోజులపాటు మినహాయింపు ఇచ్చేలా ఆదేశాలు అయినా ఇవ్వాలని అవినాష్‌రెడ్డి సోమవారం సాయంత్రం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అవినాష్ రెడ్డి తరపున ఆయన న్యాయవాదులు ఈ పిటిషన్ దాఖలు చేసి మంగళవారం వెకేషన్ బెంచ్ ఎదుట వి చారణకు వచ్చేలా మెన్షనింగ్ చేయించారు. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ తన బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినేవరకు తనను సిబిఐ అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని అవినాష్‌రెడ్డి తన పిటిషన్‌లో కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం మంగళవారం విచారించనుంది.

## సాహితి ఇన్‌ఫ్రాలో ఇడి సోదాలు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** నగరంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ సాహితి ఇన్ ఫ్రాలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికా రులు సోమవారం నాడు సోదాలు చేబట్టారు. ఆ కంపెనీ డైరక్టర్ పూర్ణారావు ఇంటితో పాటు కార్యాలయంలో సోదాలు ని ర్వహించిన ఈడీ అధికారులు అక్కడి పలు డాక్యుమెంట్లను జప్తు చేశారు. సాహితి ఇన్‌ఫ్రా గతం లో రియల్ ఎస్టేట్ పేరిట అనేక మందిని మోసం చేసినట్లు అభియోగాలు రావడంతో దీనిపై నిగ్గు తేల్చేందుకు ఇడి అధికారులు రంగంలో దిగారు. సాహితి ఇన్‌ఫ్రాపై గతంలో ఈడీతో పాటు ఐటి అధికారులు కూడా సోదాలు నిర్వహించడం తెలిసిందే.

# అన్ని పార్టీలు బిసిల డిక్లరేషన్ చేయాలి

### జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్




సమావేశంలో ప్రసంగిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, కులకచర్ల శ్రీనివాస్, జస్టిస్ ఈశ్వరయ్య, కేశన శంకరరావు, బైరి రవికుమార్ తదితర బిసి ప్రముఖ నాయకులు

**హైదరాబాద్ (నాంపల్లి), మే 22, ప్రభాతవార్త :** జనాభాలో 60శాతంపైగా ఉన్న బిసిలపట్ల అన్ని రాజకీయ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, జనాభా దామాషా ప్రకారం ఎన్నికల్లో సీట్లు కేటాయించడం, పార్టీ అధ్యక్ష పగ్గాలివ్వడం, ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వడంలేదని, దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బిసిలను కేవలం ఓటుబ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని ధ్వజమెత్తిని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అరకొర శాతమున్నవారు ముఖ్య మంత్రులు అధికారాలు చలాయిస్తుంటే 60శాతమున్న బిసిలు రాజకీయంగా దేహీ అని అడుక్కోవాలా .. ఓట్లు మావైతే సీట్లు మీవి ఎట్లయితయని ఈనాటి కార్యాచరణ పథకంలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు బిసి డిక్లరేషన్ చేయాలని, జనాభా ప్రాతిపదికన సీట్లతోపాటు ముఖ్యమంత్రి పదవి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం లకిడీకాపూల్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిసిలు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్య, భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై బిసిల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం పెద్దయెత్తున నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, విశిష్ట అతిథులుగా జస్టిస్ ఈశ్వరయ్య, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, బిసి కులసంఘాల జెఏసి ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, విద్యార్థి సంఘం కేంద్రకమిటీ అధ్యక్షుడు టి.విక్రమ్‌గౌడ్, యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు కనకాల శ్యామ్‌కురుమ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.బాలాచారి, ఉపాధ్యాయ సంఘ రాష్ట్రాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్, మహిళా సంఘ అధ్యక్షురాలు మణిమంజరి, మహిళా ఉద్యోగ సంఘ అధ్యక్షుడురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈ సమావేశంలో వచ్చే సాధారణ, అసెంబ్లీ ఎన్నికల్లో బిసిల పాత్ర ఎలావుండాలి, రాజకీయ కార్యాచరణ, బిసిలను సిద్ధచేయడంలో సుదీర్ఘ విస్తృతస్థాయిలో చర్చించడం జరిగిందని, ఈ ఎన్నికలు బిసిల ఎజెండాతోనే జరుగబోతున్నాయని, బిసిలు ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకోవడమే ప్రధాన ఎజెండాగా ముందుకుపోతున్నాయన్నారు. కెసిఆర్ జూన్ 2నుండి బ్రహ్మాండంగా వందలకోట్ల రూపాయలతో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని చెప్పడం జరిగిందని, అయితే ఈ ఉత్సవాలకు, తెలంగాణ రావడానికి బిసిల త్యాగాలు, బలిదానాలు చేశారని గుర్తుచేస్తూ అదే జూన్ 2నుండి ఏ బిసి మేలుకో.... నీ రాజ్యమేలుకో అనే నినాదంతో నెలమొత్తం రాష్ట్రవ్యాప్తంగా బిసిల రాజకీయ బాట నిర్వహిస్తున్నా మన్నారు. ఇటీవలే బిజెపి బిసి డిక్లరేషన్ చేసినా అసలు బిసి కులగణన చేయకుండా, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ పెట్టకుండా, చట్టసభల్లో బిసి 50శాతం రిజర్వేషన్లు పెట్టమంటే నిర్లక్ష్యంచేస్తూ బిసి డిక్లరేషన్ పెడితే ప్రయోజనమేమిటని, ఇంకెంతకాలం బిసిలను మోసం చేస్తారని ప్రశ్నించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ముందుగా బిసి క్రమశిక్షణ తప్పక నేర్చుకొంటేనే సమాజానికి సందేశమంటూ ఇవ్వగలమని, చైతన్యపరచి మేల్కొల్పగలమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనం ముందుగా 0.4శాతమున్న వెలమదొరలకొచ్చిందని, 60శాతమున్న బిసి బడుగు బలహీనవర్గాలకు రాలేదన్నారు. ప్రజాస్వామ్యంలో అందరికీ భాగ స్వామ్యముండాలని, అన్ని కూలాల సమూహామే రాష్ట్రమని, అన్నింటి ప్రాతినిధ్యముంటేనే ప్రజాస్వామ్యమని, అప్పుడే చట్టాలేర్పడతాయని, రాజ్యాంగంలో, విద్య ఉద్యోగాల్లో ఆర్థిక సంక్షేమంలో ఎవరి భాగం వారికి, ఉద్యోగాల్లో, రాజకీయాల్లోగానీ అన్నింటిలో సరైన భాగస్వామ్యం రావాల్సిందేనని, అప్పుడే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. బిసిలకు తమ హక్కులు ఎవ్వరో ఇస్తే రావడంకాదు మనకిమనమే సాధించాలని సూచించారు. అందుకు తగ్గట్టు ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిసి సంఘాలన్నీ ఐక్యం కావాలన్నారు. సంఘాలు వేర్వేరైనా ఏదైనా సమస్య వచ్చినప్పుడూ అందరూ విధిగా సంఘటితం కావాలని తెలిపారు. బిసిల జనాభా ఎంతవుందో అన్నిరంగాల్లో అంత భాగస్వామ్యం ఉండాలని... మనమెంతో మనకంత అన్నారు. అనంతరం ఇతర నాయకులు ప్రసంగించారు.

## లాభాల బాటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు

### మొత్తం లాభం రూ.1,04,649 కోట్లు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** ప్రభుత్వ రంగ బ్యాంకులు లాభాలతో కళకళ్లాడుతున్నాయి. మార్చి నెలతో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకుల లావాదేవీల తుది లెక్కలను రిజర్వ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగలోని బ్యాంకుల మొత్తం లాభం లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 85,390 కోట్ల రూపాయల మేర నికర నష్టాలను మూటగట్టుకున్న ప్రభుత్వ రంగ బ్యాంకులు 2022-23 సంవత్సరం చివరి నాటికి ఈ నష్టాలను అధిక మించి 1,04,649 కోట్ల రూపాయల మేర లాభాలను సంపాదించడం గమనార్హం. 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు 2021-22 ఆర్థిక సంవత్స రంలో ఆర్జించిన 66,539.98 కోట్ల రూపాయలతో పోలిస్తే 2022-23 లో మొత్తం లాభంలో 57 శాతం వృద్ధి రేటును సాధించాయి. ప్రధానంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 50,232 కోట్ల రూపాయలు, బ్యాంక్ ఆఫ్ మహా రాష్ట్ర 2,602 కోట్ల రూపాయలు, యూకో బ్యాంక్ 1,862 కోట్ల రూపా యలు, బ్యాంక్ ఆఫ్ బరోడా 14,110 కోట్ల రూపా యల మేర అత్యధిక లాభాలను ఆర్జించాయి.

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II**
**1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT : HYDERABAD**

**O.A. NO. 647of 2022**
**HDFC BANK LIMITED ...Applicant**
**AND**
**SRI SHIRIDI SAI TRAVELS AND OTHERS ...Defendant(s)**
**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
1. **Mr. Yalamanchi Sankar Babu, S/o.Mr.Yalamanchi,** Aged Major, Occ: Ex-cadre. H.No-103 Adarsh Homes, Nizampet Road, Kukatpally, Hyderabad-500085, Telangana State. **...Defendant No.2**
2. **Mr. Yalamanchi Sankar Babu, S/o.Mr.Yalamanchi,** Aged Major, Occ: Ex-cadre. H.No-103 Adarsh Homes, Nizampet Road, Kukatpally, Hyderabad-500085, Telangana State....**Defendant No.3**

**...Defendants**

Please take the summons in the above **O.A.No.647of 2022** filed by the Applicant for Recovery of money of **Rs.46,81,316.53 Ps** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA" Telugu Daily,** newspaperand posted the matter to **26.06.2023.**

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;

(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(V) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **26.06.2023 at 10.30 a.m** at Debts Recovery Tribunal-II, 1st floor, Triveni complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the Application will be heard and determined in your absence **08TH Day of May, 2023.**

**(By Order of the Court)**
**Asst Registrar**
**Debts Recovery Tribunal - II**
**Hyderabad.**

## జి-20లో ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి సినీహీరో రామ్‌చరణ్ ప్రాతినిధ్యం

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** శ్రీనగర్‌లో జరుగుతున్న జి20 సమ్మిట్‌కు మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హాజరుకానున్నారు. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీని ఈ జి10 సమ్మిట్‌లో రిప్రెజెంట్ చేసేందుకు హైదరాబాద్ నుండి సోమవారం ఆయనన శ్రీనగర్‌కు బయలుదేరి వెళ్లారు. ఆర్ఆర్ఆర్ సినిమా విజయవంతం అయిన తర్వాత ఇంటర్నేషనల్ సెలబ్రిటీ అయిపోయిన రామ్ చరణ్ ఇప్పటికే బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ తరపున జి20లో పాల్గొనేందుకు అవకాశం దక్కడంతో తెలుగు చలన చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేస్తోంది.

## తెలంగాణలో మరో రెండు రోజులపాటు వర్షాలు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో అక్కడక్కడా మంగళవారం, బుధవారం నాడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఉన్నాయని తెలిపింది. ఉత్తర-దక్షిణ ద్రోణి విదర్భ నుండి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకూ సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి ఉండి ఒక మోస్తరు వర్షాలు కురిసే వీలున్నట్లు పేర్కొంది. తూర్పు, దక్షిణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కొన్ని జిల్లాల్లో పడనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరోపక్క ఇదే సమయంలో రాగల మూడు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుండి 44 డిగ్రీల వరకూ నమ ఓదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

# 10 మంది మావోయిస్టు కొరియర్లు, మిలీషియా సభ్యులు అరెస్టు

- భారీగా నక్సల్స్ సామాగ్రి స్వాధీనం : ఎస్పీ వినీత్

**భద్రాద్రికొత్తగూడెం, ప్రభాతవార్త ప్రతినిధి :** భద్రాద్రికొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం ములకలపల్లి అటవీ ప్రాంతంలో దుమ్ముగూడెం పోలీసులు, 141 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు కలిసి సంయుక్తంగా సోమవారం కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో 10 మంది అనుమాని తులను పట్టుకుని విచారించగా అందులో ఐదుగురు నిషేధిత భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కొరియర్లు, మరో ఐదుగురు ఆ పార్టీకి చెందిన మిలీషియా సభ్యులుగా నిర్ధారించుకున్నారు. వారి నుంచి భారీగా మావోయిస్టు సామాగ్రి బయట పడింది. సోమవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో డా.వినీత్ జి మీడియాకు వివరాలను వెల్లడించారు. పట్టుబడిన కొరియర్ లందరూ వరంగల్ జిల్లాకు చెందిన వారని, దుగ్గొండి మండలం చలపర్తికి చెందిన జన్ను సమ్మయ్య, నర్సంపేట మండలం లక్కినేనిపల్లికి చెందిన ఆరిపల్లి శ్రీకాంత్, చెన్నారావుపేట మండలం లింగాపురానికి చెందిన మేకల రాజు, చెన్నారావుపేట మండలం కొన్నాపురానికి చెందిన చిలివేరు రమేష్, దుగ్గొండి మండలం లక్ష్మీపురానికి చెందిన తాళ్ళపల్లి ఆరోగ్యం అని విచారణలో తేలిందని వెల్లడించారు. అదేవిధంగా మిలీషియా సభ్యులందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన వారుగా గుర్తించామన్నారు. ఆవుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన ముసికి రమేష్, ముసికి సురేష్, బాడిస లాలూ, సోడి మహేష్, కొత్తపల్లి గ్రామానికి చెందిన మడివి చేత్ లుగా గుర్తించామన్నారు. వీరి వద్ద నుండి కార్డెక్స్ 90 బండిల్స్, డిటోనేటర్లు 500, స్ట్రరి స్టిక్స్ -600, టీఎస్24టీ 8640 అనే నెంబర్ గల బొలెరో వాహనం, ఏపీ20టీఏ 7313 అనే నెంబర్ గల ట్రాక్టర్, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్పీ వినీత్

పట్టుబడిన వీరంతా పోలీసు క్యాంపు పైన, కూంబింగ్‌కు వచ్చే పోలీసుల పైన దాడులు చేయడానికి అవసరమైన ల్యాండ్ మైన్‌లు, ఐఈడీలు, రాకెట్ లాంచర్ల తయారీకి ఉపయోగపడే పేలుడు పదార్థాలను ఆ ఐదుగురు మా మావోయిస్టు కొరియట్లు బొలెరో వాహనంలో దుమ్ముగూడెం మండలం ములకనాపల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకుని వచ్చి మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులు ఐదుగురు తీసుకువచ్చిన ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారని అన్నారు. పేలుడు పదార్థాల వ్యాపారం చేస్తున్న వారు ఎవ్వరూ కూడా నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ప్రేలుడు పదార్థాలను సరఫరా చేయవద్దని, ఒకవేళ ఎవరైనా సరఫరా చేస్తే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**తెలంగాణ ప్రభుత్వం**
**నీటి పారుదల శాఖ**
**పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం, నీటి పారుదల శాఖ సర్కిల్, మెదక్**

ఈ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెంబర్: 03/2023-24, తేది: 20.05.2023
నీటి పారుదల శాఖ: ఫైజాబాద్ (గ్రా॥) చిలిపిచేడ్ (మం॥), మెదక్ (జిల్లా) సమీపంలోని మంజీరా నది పై నీటి పారుదల ఎత్తిపోతల పథకం యొక్క పునర్నిర్మాణ పని కొరకు తేది: 23.05.2023 నుండి 30.05.2023 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. పని అంచనా విలువ రూ. 17.48 లక్షలు. మిగతా వివరాలకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫాం www.tender.telangana.gov.in తేది: 23.05.2023 నుండి చూడగలరు.
సం/-. పర్యవేక్షక ఇంజనీర్, నీటిపారుదల శాఖ సర్కిల్, మెదక్.
DIPR.No.2093-PP/CL/Advt/1/2023-24 తేదీ: 22.05.2023

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
**ఆపరేషన్ మేడ్చల్ సర్కిల్, టెండరు ప్రకటన నం: 02/2023-24**
**Ext-I-Tsp No.01/23-24 to Tsp No.03/2023-24, Tsp No.07/2023-24 to Tsp No.12/2023-24**

అనుభవం కలిగిన మరియు GST నమోదిత విక్రేతల నుండి ఈ క్రింది వాటి కొరకు సీలు టెండర్లు కోరబడుతున్నవి. 1. Ext-I-T.sp No.01/23-24 అడిషనల్ కెమికల్ ఎర్త్ పిట్స్-ప్రశాంతి హిల్స్ SS. 2. Ext-I-T.sp No.02/23-24 అడిషనల్ కెమికల్ ఎర్త్ పిట్స్-బాచుపల్లి SS. 3. Ext-I-T.sp No.03/23-24 అడిషనల్ కెమికల్ ఎర్త్ పిట్స్-పేట్ బషీరాబాద్ SS. 4. T.sp No.07/23-24 SC-నిర్మాణం స్థాపన-అడిషనల్ 4నం॥DTR లు, గాజులరామారం. 5. T.sp No.08/23-24- 34నం.ల 9.1 PSCC పోల్స్-షమీర్‌పేట పునఃస్థాపన. 6. T.sp No.09/23-24 -34 నం.ల 8M PSCC పోల్స్ మరియు 13 నం.ల బెండ్ పోల్స్ పునఃస్థాపన-షమీర్‌పేట. 7. T.sp No.10/23-24 నిర్మాణ స్థాపన. అడిషనల్ 100 KVA DTR-నాగిరెడ్డిపల్లి-అల్లాబాద్. 8. T.sp No.11/23-24-లోడ్ 35KWకు M/s. ది డిప్యూటీ కమిషనర్ GHMC- జీడిమెట్ల. 9. T.sp No.12/23-24 నిర్మాణ స్థాపన-2 నం. అడిషనల్ 100 KVA DTR షమీర్‌పేట. తదుపరి వివరాలకు www.tssouthernpower.com దర్శించండి.
DIPR.No. 2083-PP/CL/Advt/1/2022-23 తేదీ: 22.05.2023 సం/-.సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్, మేడ్చల్.

వార్త


ప్రజలు విధానాలు విడనాడినప్పుడు రాజులు నియంతలుగా మారుతారు.

- ఎడ్మండ్ బర్క్

# రైతు బతుకుతో ఆటలాడొద్దు

బాధపడటమే తప్ప బాధించటం తెలియని రైతన్నలు ఇటీవల కాలంలో సహనం, ఓర్పు సన్నగిల్లి ఆందోళనల బాట పడుతున్నారు. తమకు ఎంతనష్టం జరిగినా, ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లి కుళ్లి మనసులోనే బాధలు భరించి చివరకు ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధపడతారే తప్ప తమను దగా చేసిన వారిపై కక్ష కట్టి దాడులు చేసేందుకు సాహసించక పోయేవారు. పంటకు గిట్టుబాటు ధరలు రాకపోయినా కొన్ని సందర్భాల్లో కనీసం పంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన ఖర్చులు కూడా రాకపోయినా రోడ్లపై పారబోసి తమ ఖర్మకు తాము బాధపడుతూ మౌనరోదనతో ఇంటిముఖం పట్టేవారు. అప్పుడప్పుడు కట్టలు తెంచుకున్న ఆగ్రహాన్ని, ఆవేశాన్ని అదుపు చేసుకోలేని దశలో వున్న రైతులకు కొందరు రాజకీయ నాయకులు ఇచ్చిన ప్రోత్సాహంతో రోడ్లపైకి వచ్చినా ప్రశాంతంగానే నిరసన కార్యక్రమాలు చేసేవారు. కానీ ఇటీవల కాలంలో ఇలా రోడ్ల పైకి రావటం, నిరసనలు-ధర్నాలు తెలిపేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అవి ఎక్కడికక్కడ జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా అధిక శాతం మార్కెట్లలో దళారులదే రాజ్యం. కొలతల్లో మోసం, ధరలు నిర్ణయించడంలో దగా. ఒకటేమిటి.. ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచి వుంటూనే వున్నారు. రైతులు మోసపోతూనే వున్నారు. మోసపోయే వారు వున్నంత కాలం మోసం చేసేవారు ఉన్నారన్నట్టే ఈ దళారీ వ్యవస్థ వున్నంత కాలం రైతులకు ఈ బాధలు తప్పవు. ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధమైనా ఏదో ఒక కారణం చూపి కొందరు అధికారులతో లాలూచీ పడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీసధర రాకుండా చూడగలుగుతున్నారు. కొన్నిసార్లు రైతులు విధిలేని పరిస్థితుల్లో దళారులు నిర్ణయించిన రేట్లకు వారికి అప్పగించాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు తాజాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు నెలలుగా కురిసిన వర్షాలతో ధాన్యం ఒక్కసారి కాదు, రెండు మూడు సార్లు తడిసిపోయాయి. ఈ తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొంటామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించినా వాస్తవంగా క్షేత్ర స్థాయిలో పూర్తిగా ఆచరణకు నోచుకోవడం లేదు. తేమశాతం ఎక్కువగా ఉందంటూ కోతలు పెడుతున్నారు. అంతేకాదు, తరుగు కింద పది, పదిన్నొండు కిలోలు క్వింటాలుకు తీస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అసలే గిట్టుబాటు కావడంలేదు, దీనికితోడు కోతలు, ఈ తరుగులతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగ మారుతున్నది. ధాన్యాన్ని తరలించేందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు స్వయంగా తమ వాహనాలతో మిల్లింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండలం విస్సంపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు మూడు ఎకరాల్లో పండించే ధాన్యాన్ని పిఎస్సీఎస్ కేంద్రంలో విక్రయించారు. ప్రభుత్వ అధికారుల సూచన మేరకు పెద్ద నాగారం స్టేజీ వద్ద వున్న ఓ రైస్ మిల్లుకు తన ట్రాక్టరులో ఈ నెల 19న తరలించారు. అయితే ఆ రైస్ మిల్లుయజమాని తమకు ఆ ధాన్యాన్ని కేటాయించలేదని, దిగుమతి చేసుకొనే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. తిరిగి కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్తే వారు అదే మిల్లుకు వెళ్లాలని సూచించారు. మళ్లీ అదే రైస్‌మిల్లు వద్దకు వెళ్లి ఎంత ప్రాధేయపడినా దిగుమతి చేసుకునేందుకు నిరాకరించడంతో తన ట్రాక్టరులోని వడ్ల బస్తాల్లో ఎనిమిది బస్తాలను రోడ్డుపై వేసి మిల్లు గేటు ఎదుటనే దహనం చేసి ఆందోళనకు దిగారు. ఇలా ఒక రైతుకాదు, ఎందరో అన్నదాతలు తాము పండించిన పంటలు అమ్ముకునేందుకు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కొందరు దళారులు రైతుల జీవితాలతో ఆటలాడుకొంటున్నారు. ఆ బాధలు భరించలేక మరొక పక్క ఖరీఫ్ సాగు ముందుకు వస్తున్న దశలో ఆవేదనతో ఆందోళనకు దిగుతున్నారు. రోడ్లపైకి వచ్చి నిరసనలు, రాస్తారోకోలకు స్వచ్ఛందంగా దిగుతున్నారు. రైతు సమస్యలు ఒక్క తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. ఎన్నిసమస్యలున్నా, ఎంతటి సంక్షోభం వున్నా భారత్‌లో ఇప్పటికీ వ్యవసాయాధారంగా బతికేవారే అధిక సంఖ్యలో వున్నారు. ఇంత పెద్ద జనాభాకు కావలసిన పంటలో వారి చెమట పుణ్యమేననే వాస్తవాన్ని అందరం గుర్తుంచుకోవాలి. వ్యవసాయ విస్తీర్ణం పెరిగేకొద్దీ రైతులకు కష్టాలు కూడా పెరిగిపోతున్నాయి. ఏడాదికేడాదికి కుంగిపోతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ రంగానికి ఈ పరిస్థితి ఎందుకు దాపురిస్తున్నదో? లోపాలు ఎక్కడున్నాయో? వాటిని ఎలా అధిగమించాలి? తదితర అంశాలపై ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించాల్సిన తరుణమిది. అప్పు లేని రైతు లేడు. ఆత్మహత్యల్లో కూడా రైతన్నలే అగ్రస్థానంలో ఉన్నారు. విత్తనం దగ్గర నుంచి విక్రయించే వరకు అన్నీ కష్టాలే. అన్ని స్థాయిల్లో దోపిడికి గురవుతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే రైతులు నిలదొక్కుకోవడానికి కావలసిన రాయితీలు, దయాదాక్షిణ్యాలు కాదు. సరైన సాంకేతిక సలహా, వ్యవస్థాపరమైన సహాయ సహకారాలు కావలసిన మేరకు వారికి అందడం లేదు. కర్షకులు మోసాలకు గురికాకుండా చేసిన చట్టాలువారిని రక్షించలేకపోతున్నాయి. రైతులమీద నిజంగా చిత్తశుద్ధి వుంటే రాజకీయ ప్రయోజనాలకోసం తాత్కాలిక పథకాలు సరే, వ్యవసాయ రంగాన్ని ఈ సంక్షోభం నుంచి గట్టెక్కించే శాశ్వత పథకాలకు రూపకల్పన చేయాలి. చట్టాలు చేయడమే కాదు, అవి ఏ మేరకు అమలవుతున్నాయో పరిశీలించాల్సిన అవసరం కూడా ఉంది.

శాస్త్ర పండితుడైనప్పటికీ లోకజ్ఞానం లేకుంటే మూర్ఖునితో సమానమే.



చాణక్యుడు

రాజకీయంగా రూపొందించే పథకాలు చాలా వరకు హాస్యాస్పదమైనవే.



శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు



### బలవుతున్న సామాన్యులు

ప్రభుత్వం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు వాటిని స్థాపించిన అధినేతలు సంక్షేమం పేరు చెప్పి శాశ్వత అధికారం కోసం ఎన్నికల్లో ఉచిత పథకాలకు శ్రీకారం చుట్టి ప్రభుత్వ ఏర్పాటుకి తమ బెర్తును ముందే ఖాయం చేసుకుంటున్నారు. అమాయక జనానికి పచ్చనోట్లను ఎరగా వేసి తమ సమీప ప్రత్యర్థిని ఓడించడానికి పరోక్షంగా రాజకీయ హత్యలకు పాల్పడుతున్నారు. ఒకవేళ ప్రజా బలంతో గెలిచిన అభ్యర్థులను అదే ప్రజాధనాన్నిఎరగావేసి, ఫిరాయింపులపేరుతో తమ పార్టీలో కలుపుకుని ప్రజాస్వామ్యాన్ని, అసెంబ్లీ, పార్లమెంట్ వేదికగా ఖూనీ చేస్తూ ఎన్నికలనుఅపహాస్యం చేస్తున్నారు.సామాన్యులు పన్నులు కట్టే బానిసలుగా మాత్రమే మిగిలిపోతున్నారు. ఇప్పటి ఎమ్మెల్యేలు, ఎంపిలు తాము ప్రజాప్రతినిధులమని ఎప్పుడో మరచిపోయారు. అడుగడుగునా రాజ్యాంగ ఉల్లంఘనలు. రాజకీయ ముసుగులో జరుగుతున్న ఆర్థిక ఉగ్రవాదం. ఇప్పటికైనా మేలుకోకపోతే కట్టుబానిసలుగా మిగిలిపోవాల్సిందే.

-ఆర్.బి.రెడ్డి, వెంపల్లి

### మౌలిక సదుపాయాలు ఏవి?

రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి అపారమైన వనరులు ఉన్నాయి. అయితే పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవానికి కనీస మౌలిక సదుపాయాలు లేకుండాచేసుకునే ఒప్పందాలు కార్యరూపందాల్చడంఅసాధ్యం. జిల్లాకో విమానాశ్రయం అని గత మూడు సంవత్సరాల నుంచి ఊరదగొడుతున్నారు. ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. రహదారుల పరిస్థితి దయనీయం. విద్యుత్ కోతలు ఇప్పటికే మొదలయ్యాయి. కొత్తగా పెట్టుబడులు పెట్టేవారు ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా మన రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉందా?

-ఎన్.కృష్ణా, కృష్ణాజిల్లా

### పొలాల బీడు దేనికి సంకేతం?

రాష్ట్రంలో రబీ సాగు విస్తీర్ణం 10 లక్షల ఎకరాలు తగ్గిందన్న వార్త వ్యవసాయ రంగం దుస్థితికి అద్దంపడుతున్నది. వర్షాలు సమృద్ధిగా పడినా పొలాలు బీడు పెడుతున్నారంటే పాలకులు వాస్తవ పరిస్థితి మదింపు చేసుకోవాలి. మరోవైపు ఊళ్లకు ఊళ్లే బతుకుతెరువు కోసం వలస బాటపడుతున్నాయి. రైతు సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి వారి సలహా, సూచనల మేరకు సత్వర నిర్ణయాలు తీసుకుని వ్యవసాయ రంగాన్ని గాడిన పెట్టాలి.రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత.

-జి.భారతిదేవి, ఏలూరుజిల్లా

### మైక్రో రుణాల ఉచ్చులో యువత

తెలుగురాష్ట్రాలలో సులభలోన్‌యాప్‌ల హవా యధేచ్ఛగా సాగుతోంది. తక్కువవడ్డీ,ఎలాంటి షూరిటీ అవసరం లేకుండా సులభతర విధానంలోక్షణాలలో రుణాల మంజూరు వంటి కారణాల వలన యువతసులభంగా ఈ యాప్‌ల ఉచ్చులో పడిపోతున్నారు.మొబైల్‌ల ద్వారాకనీసం నిబంధనలు, షరతులు చదవకుండా అంగీకారం తెలపడంతో యువత మరీ తొందరపాటు ప్రదర్శిస్తున్నారు.దీనికిఅలుసుగాచేసుకొని,రుణాలను మంజూరు చేశాక, అసలు వడ్డీ విధానాన్ని బయటకు తీసుకువచ్చి ఒక రూపాయికి నాలుగింతలు వసూలు చేస్తున్నారు. ఒకవేళ వడ్డీని సకాలంలో చెల్లించకపోతే ఫోన్లుచేసి అసభ్యకర విచక్షణారహిత సంభాషణలతో మనోవేదనకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం, మీడియా ఈ సులభతర రుణాల ఉచ్చులో పడవద్దని ఎంతగా ప్రచారంచేస్తున్నా, పాకెట్ మనీసులభంగా అందివస్తుండడంతో కనీసం తల్లిదండ్రులు, బంధువులసలహా కూడా తీసుకోకపోవడం వలన ఉచ్చులో పడిపోతున్నారు. బ్యాంకు అకౌంటు, ఆధార్ నెంబర్, పాన్‌కార్డు నెంబర్లు వంటి వ్యక్తిగత డేటా అంతా యాప్ల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి.

-సి.హెచ్.సాయిరుత్విక్, నల్గొండ

### బాల్య వివాహాలను అరికట్టాలి

బాలికలుఆరోగ్యంగా పెరిగినట్లయితే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారు. చిన్న వయసులో జరిగే వావాహాలు, గర్భదారణ వలన అనేక ఆరోగ్యసమస్యలు వస్తాయి. కాబట్టి అమ్మాయికి 18ఏళ్ల వరకు పెండ్లిచేయకుండా అంటే బాల్య వివాహాలు జరగకుండా చూడటం కూడా సమాజ బాధ్యత. ఇందుకోసం ప్రభుత్వంతోపాటు,స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, మేధావులు ఇతోధికంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-జి.అశోక్, కరీంనగర్‌జిల్లా

### కష్టాల్లో పాడి రైతులు!

రాష్ట్రవ్యాప్తంగా పశు సంవర్ధక శాఖలో ముప్పైవేల పోస్టులు భర్తీకావల్సి ఉంది.నాలుగు సంవత్సరాలుగా ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడంతో పశువులకు వైద్యం అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు పశువుల బీమా బకాయిలు రూ.200 కోట్లకు చేరుకున్నాయి. సహకార పాల డైరీలకు పాలు విక్రయించే పాడి రైతులకు లీటరుకు నాలుగు రూపాయల సబ్సిడీ ఇస్తామన్న హామీ అటకెక్కించారు. దాణా, గడ్డి ధరలు పెరిగి పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాడిరైతుల ప్రభుత్వం,పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# రక్షణ ఇవ్వని కౌలు చట్టాలు!

తెలంగాణలో రక్షిత కౌలుదారీచట్టం రాగానే సొంత సేద్యంపేరుతో భూస్వాము లు అత్యధికకౌలుదారులను చట్టాన్ని అడ్డుపెట్టుకుని భూముల నుండి తొలగించారు. ఆ తర్వాత కౌలు ఒప్పందాలే జరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కౌలు ఒప్పందాలు లేవు. అంతా ముజువాణి ఒప్పందాలే. గత్యంతరం లేనిపరిస్థితుల్లో భూస్వాములు షరతు లను కౌలుదారులకు అంగీకరించక తప్పదు. కాదంటే కౌలుభూమి దక్కదు. కౌలు ఒప్పందం లేకపోతే కౌలుదారు ఎటువంటి ప్రయో జనం ఉండదు.అందువలన కౌలుదారీ చట్టాలు అలంకార ప్రాయ మే. కౌలుదారీ చట్టాలు వచ్చిన తర్వాత కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది.

**బొల్లిముంత సాంబశివరావు**

కౌలు రైతుల సేద్యం నేడు తీవ్రమైన సంక్షోభంలో ఉంది. కౌలుదారునికి భూమిపై కౌలు హక్కు లేకపోవడం, పాలకులు అనుసరిస్తున్న విధానాలే అందుకు కారణం.కౌలు సేద్యానికి భూస్వామ్యవ్యవస్థకు ఉన్న అవినాభావ సంబంధమే కౌలు రైతుల సంక్షోభానికి కారణం. దేశ జనాభాలో అత్యధిక ప్రజలు వ్యవసాయ మీద ఆధారపడి గ్రామీణ ప్రాంతంలో నివసించడం, అత్యధిక మందికి సేద్యపు భూమిలేకపోవడం, కొద్దిమంది వ్యక్తుల ఆధీనంలో అత్యధిక భూమి ఉండటం,కూలి ద్వారా వచ్చే ఆదాయమే పేదలకు జీవనాధారం కావడం,ఆ ఆదాయం చాలక కుటుంబ పోషణ కోసం భూకామందుల వద్ద పేదలు భూమిని కౌలుకు తీసుకుని కౌలు రైతులుగా మారారు. బ్రిటిష్ వలస పాలనలోని రాజరిక వ్యవస్థలో సంస్థానాలు, జమీందార్లు, జాగీర్దారులు అనేక ప్రాంతాలపైన అధికారం పొంది వేలాదిఎకరాలపై హక్కు కలిగి ఉన్నారు. భూమి లేని గ్రామీణ పేదలు జమీందార్ల, బడా భూస్వాముల భూముల్లో వెట్టివాకిరి చేయాలి. పేద రైతులు కూడా ముందు భూస్వాముల భూముల సాగు చేసిన తర్వాత వారి భూముల సాగు చేసుకోవాలి. భూస్వాముల భూములు సాగు చేసినందుకు కొంత నాసిరకం భూమిని పేద రైతుకు ఇచ్చేవారు. ఆ భూమి సేద్యం చేయడానికి నిరుపేద రైతు ఎంత కష్టపడ్డా వచ్చే ఆదాయం గొర్రెతోక బెత్తెడు మాదిరి ఉండేది. కౌలు విధానం స్పష్టమైన రూపంతీసుకున్న తర్వాత నికర కౌలు చెల్లింపు అమల్లోకి వచ్చింది.పండిన పంటలో భూస్వామికి ఇచ్చే వాటా ముందుగానే నిర్ణయం జరిగేది. పండిన పంటతో నిమిత్తం లేకుండా ధాన్యరూపంలో ఎకరానికి ఇన్ని బస్తాలుగా కౌలును భూస్వాములు నిర్ణయించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక ప్రాంతాల్లో తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో డబ్బుల రూపంలో సేద్యానికి ముందే కౌలు చెల్లింపు విధానం వచ్చింది. కౌలు చెల్లింపులో వచ్చిన మార్పులు భూస్వాములకు లాభదాయకంగా ఉన్నాయి. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి అభివృద్ధి చెందడం, రైతు, కూలీ సంఘాల నిర్మాణాలు జరిగి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రారంభమైనాయి. పండించిన పంటలో రెండువంతుల హక్కు కోసం రైతాంగ ఉద్యమం, జమీందార్లకు సగం పంట ఇవ్వమని, మూడవ వంతు మాత్రమే ఇస్తామని బీహార్ రైతుల పోరాటం, కేరళలో కయ్యూరు రైతాంగ తిరుగుబాటు అందులో భాగమే. మరో మహత్తర రైతాంగ తిరుగుబాటు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. ఈ పోరాటం నైజాం నవాబు నిరంకుశ పాలనకు,జమీందార్ల, జమీందార్లకు వ్యతిరేకంగా వెట్టిచాకిరికి వ్యతిరేకంగా,భూమికోసం,విముక్తి కోసం గ్రామీణ పేదలందరూ సమిష్టిగా ఆయుధాలు చేతబట్టి నైజాం నవాబును గడగడలాడించి 10లక్షల ఎకరాల భూములు స్వాధీనం చేసుకుని తెలంగాణలో మూడవ వంతు భూభాగాన్ని విముక్తి చేసిన మహోన్నత పోరాటం. బ్రిటిష్ వలస పాలకుల నుండి అధికార మార్పిడి చేసుకున్న భారత పాలకులు రైతాంగ ఉద్యమాల ఫలితంగా కొన్ని చట్టాలు చేయక తప్పలేదు. భూ సంస్కరణల చట్టాలు, కౌలుదారీ చట్టాలు చేసే హక్కు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కల్పించింది.అనేక రాష్ట్రాల్లో కౌలుదారీ చట్టాలు చేయబడ్డాయి.1950 వరకు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో కౌలుదారీ చట్టమన్నది లేదు. భూస్వాములనుంచి ఎటువంటి రక్షణ లేక వారి దోపిడీకి గురవుతున్న కౌలుదారులు, తమకు రక్షణ కల్పించాలని చేసిన ఉద్యమాల ఫలితంగా తెలంగాణలో 1950లో కౌలుదారీ చట్టం వచ్చింది. ఈ చట్టం భూ పరిమితికి మించి ఉన్న భూస్వాముల భూములు తప్పఎవరూ భూములు కౌలుకు ఇవ్వరాదని పేర్కొంది. దీనిపై వ్యతిరేకతరావడంతో 1950 సంవత్సరంలోనే చట్టాన్ని సవరించి, సాధారణ, రక్షిత కౌలుదారులుగా విభజించింది. సాధారణ చట్టం అమలులోకి వచ్చిన మూడు సంవత్సరాల అనంతరం భూములు కౌలుకు ఇవ్వకూడదు. చట్టంలో తెలిపిన కుటుంబ కమతానికి మించి మూడు రెట్లు అధికంగా భూమి ఉన్న భూస్వాములు తమ భూములు కౌలుకు ఇచ్చుకోవచ్చు. కౌలు కాలం ఐదు సంవత్సరాలు. నియమాలను అనుసరించి మరలా కౌలును పునరుద్ధరించవచ్చు.



సొంత సేద్యానికి భూమిని భూస్వామి ఉంచుకోదలిస్తే కౌలుఒప్పందం రద్దు అవుతుంది. 1950 చట్టంలో నిర్ధారించిన కాలం నుండి ఆరు సంవత్సరాల పాటుకౌలుదారుగా భూమి సాగుచేసిన వ్యక్తి రక్షిత కౌలుదారుగా గుర్తింపు పొందుతాడు. ఆ కౌలుదారుడు భూమిని కొనుగోలు చేసుకోవడానికి హక్కు కలిగి ఉంటాడు. ఒప్పందం ప్రకారం కౌలు చెల్లించకపోతే ఒప్పందం రద్దుఅవుతుంది. ఈ చట్టం ద్వారా రక్షిత కౌలుదారులుగా నమోదు అయ్యే అత్యధిక మంది రైతులను సొంత సేద్యం పేరుతో భూముల నుండి భూస్వాములు తొలగించారు. ఆంధ్ర ప్రాంతంలో కౌలుదారీ విధానంపాలనా ఎపి కౌలు చట్టం1956 అనుసరించి సాగుతుంది.న్యాయమైన కౌలు, భూములకు, కౌలుదార్ల మధ్య ఉండాల్సిన సంబంధాలను ఈ చట్టంలో పేర్కొన్నారు. భూమిపై అనుభవ హక్కు కల్పించడం ద్వారా కౌలుదారులకు రక్షణ ఉందనే భావన కల్పించడం. యజమానికి చెల్లించవలసిన గరిష్ట కౌలును చెల్లించడం చట్టం లక్ష్యంగా ఉంది. చట్టం అమలులోకి వచ్చే నాటికి ఉన్నకౌలు ఒప్పందాలన్నీ కొనసాగుతాయని చట్టం చెబుతుంది.కౌలు ఒప్పందం ఆరు సంవత్సరాలు. గడువు ముగియగానే ఆ ఒప్పందం మరో ఆరుసంవత్సరాలు కొనసాగుతుంది. కౌలుదారు, ప్రభుత్వానికి, సహకార సంఘాలకు, భూ తనఖా బ్యాంకులతో సహా కౌలుభూమిని తనకాపెట్టుకోవచ్చు. లేదా తన ప్రయోజనాలు తెలుపుకుని లబ్ధిపొందవచ్చు. ఒప్పందం ప్రకారం కౌలు చెల్లించకపోయినా, ఇతరులకు సబ్ లీజ్‌కు ఇచ్చినా కౌలు ఒప్పందం రద్దు అవుతుంది. చట్టాలు చేసే ప్రభుత్వాలు వాటిని అమలు జరపడంలో పేర్కొన్న నిబంధనలే ప్రభుత్వాల చిత్తశుద్ధిని తెలియచేస్తుంది. తెలంగాణ, ఆంధ్రా కౌలుదారీ చట్టాల్లో పాలకులకు లోపించింది ఆ చిత్తశుద్ధే. చట్టంలో భూస్వాములు నష్టపోకుండా అనేక కంతులు కల్పించారు. తెలంగాణలో భూ పరిమితికి మించి భూములు ఉన్న భూస్వాములే భూమిని కౌలుకు ఇవ్వాలని, రెండు చట్టాల్లోనూ సొంత సేద్యం కోసం కౌలుదారు నుండి భూమిని తీసుకోవచ్చని,భూ యజమానితో కౌలు ఒప్పందం ఉండాలని అలా ఉంటేనే కౌలుదారు గుర్తింపు ఉంటుందని పేర్కొనడం జరిగింది. ఇది చట్టాలను నీరు గార్చటమే. తెలంగాణలో రక్షిత కౌలుదారీచట్టం రాగానే సొంత సేద్యంపేరుతో భూస్వాములు అత్యధికకౌలుదారులను చట్టాన్ని అడ్డుపెట్టుకుని భూముల నుండి తొలగించారు. ఆ తర్వాత కౌలు ఒప్పందాలే జరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కౌలు ఒప్పందాలు లేవు. అంతా ముజువాణి ఒప్పందాలే. గత్యంతరం లేనిపరిస్థితుల్లో భూస్వాములు షరతులను కౌలుదారులకు అంగీకరించక తప్పదు. కాదంటే కౌలుభూమి దక్కదు. కౌలు ఒప్పందం లేకపోతే కౌలుదారు ఎటువంటి ప్రయోజనం ఉండదు.అందువలన కౌలుదారీ చట్టాలు అలంకార ప్రాయమే. కౌలుదారీ చట్టాలు వచ్చిన తర్వాత కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది.కౌలు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. నేడు అత్యధిక ప్రాంతాల్లో డబ్బు కౌలు ముందుగానే చెల్లించే విధానం అమలులోకి వచ్చింది. ఇది ఎకరాకు రెండు పంటలకు కలిపి 30వేలకు చేరుకుంది. ధాన్య రూపంలో కౌలు కూడా 30 బస్తాలైంది. ఎరువుల, విత్తనాల, పురుగు మందుల ధరలు పెరగడంతో పాటు సేద్యపు ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. సంస్థాగత రుణాలు లభించక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయడం, పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవడంతో కౌలు రైతులు అప్పులపాలై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.రైతుల ఆత్మహత్యల్లో వీరే అత్యధికులు. 2019 మేలో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం 1956, 8-6-11 కౌలుదారీ చట్టాలను రద్దుచేసి 2019లోనే పంట సాగుదార్ల హక్కుల చట్టం చేసింది. ఈ చట్టంలోకూడా కౌలుదారు గుర్తింపునకు భూయజమాని ఆమోదం తప్పనిసరి. అప్పుడు మాత్రమే భూమి సాగుదారుగా కార్డు ఇవ్వబడుతుంది. ప్రతి సంవత్సరం కార్డు పొందాలి. భూమిపై కౌలు హక్కులు కౌలుదారుకు ఉండవు.నూటికి 98 శాతం రైతులు కౌలుకు ఇస్తున్నట్లు ఆమోదం తెలపడం లేదు. అందువలన ఈ చట్టం కూడా ఏమాత్రం కౌలు రైతులకు ప్రయోజనంగా లేదు. భూమిపై కౌలు హక్కులు పత్రంరాసి ఇవ్వడానికి రైతులు భయపడుతున్నారని ప్రభుత్వాలు చెబుతున్నాయి.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతుల అనుమానాలు తొలగించడం సాధ్యమే. బెంగాల్, కేరళలో కౌలు చట్టాలు ఎలా అమలు జరిగాయి. కౌలు హక్కులు ఎలా కల్పించబడ్డాయి. చట్టాలు అమలు చేయలేనప్పుడు ప్రభుత్వాలువాటిని చేయడం ఎందుకువాటి వలన ప్రయోజనం ఏముంది. దేశంలో లక్షలాది ఎకరాల సాగు యోగ్యమైన భూములను పేదలకు పంపిణీ చేయవచ్చు. పేద కుటుంబాలకు భూమి లభిస్తే కౌలు భూమి అవసరం ఉండదు. కాబట్టి భూ పంపిణీ ద్వారానే కౌలు రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ●

# అవినీతి, అక్రమాలకు అడ్డుకట్టవేయాలి


**తిరుమలశెట్టి సాంబశివరావు**

అధికారాన్ని అడ్డంపెట్టుకొని ప్రభుత్వనేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడితే ప్రజలు ఛీ కొడతారనీ వారు సుపరిపాలనకే జైకొడతారని తాజా కర్ణాటక ఎన్నికలు కూడా నిరూపించాయి. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వంటి వారు ఎన్నికల్లో 20సంవత్సరాలకుపైగా ఏకధాటిగా విజయం సాధించడానికి కారణం వారి నిరాడంబర, నిజాయితీ పాలనే గాని జనాకర్షక పథకాలు కాదు. రాష్ట్రంలో డిటిపి ప్రభుత్వం కూడా గతంలో అక్రమాలను, రౌడీయిజాన్ని నియంత్రించి క్రమశిక్షణ గల పార్టీగా పేరొందింది కనుకనే బషీర్ బాగ్ కాల్పుల ఘటనతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమై పోటీచేసినా కేవలం కొద్దిశాతం ఓట్ల తేడాతోనే ఓడిపోయింది. మరోవైపు సంక్షేమ పథకాలకే ప్రాధాన్యత ఇచ్చిన వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2009 శాసనసభ ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను భారీగా చీల్చిన కారణంగా అతికష్టం మీద గట్టెక్కింది. ఇక 2014 సంవత్సరం శాసనసభ ఎన్నికల్లో అనుభవజ్ఞుడు, పరిపాలనా దక్షుడని చంద్రబాబును మళ్లీ ప్రజలు గెలిపిస్తే ఈసారి ప్రజాకర్షక పథకాల వల్ల ప్రజలపై పెరుగుతున్న పన్నుల భారం, సమాజంలో పెరిగే అవినీతి, అక్రమాల గురించి ప్రజలను చైతన్యపరచకుండా గతంలో వలె పరిపాలనపై దృష్టి సారించకుండా తాను కూడా సంక్షేమ పథకాల మాయలో కుల కార్పొరేషన్‌లు,ఉద్యోగ, మైనారిటీ, వంటి వర్గాలకు ఎన్నో రాయితీలు ఇచ్చినా ప్రజలు ఓడించారు. వైయస్ ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ ప్రకటించినా వారికి ఎరువులు, గిట్టుబాటు ధరల వంటి ప్రధానమైన సమస్యలు తీరకపోగా, వారి ఆత్మహత్యలు ఇంకా పెరిగాయి. క్రాప్ హాలిడేతోపాటు కరెంట్ హాలిడే వచ్చి 2014 సంవత్సరంలో డిటిపి ప్రభుత్వం వచ్చేవరకు చంద్రబాబు చెప్పినట్లు ఒకదశలో విద్యుత్ వైర్లపై బట్టలు ఆరవేసుకునే స్థితి వచ్చింది. ఇప్పుడు విద్యుత్ ఛార్జీలేమో సామాన్యులకు షాక్ కొట్టే విధంగా పెరుగుతున్నాయి. ఏ ప్రభుత్వరాయితీలైనా ఉచిత పథకాలైనా ఎటువంటి ఆసరా,సంపద, సంపాదన లేనినిరుపేదలకే దక్కాలి. గతంలో పేదల పింఛను 200 రూపాయలున్నప్పుడు ఎంతో మంది తీసుకోవడం నామోషీగా భావించారు. ఇప్పుడు రెండువేల రూపాయల నుంచి మూడువే రూపాయలకు అంటూ పెంచుతుంటే కోటీశ్వరులు, లక్షల రూపాయలు సంపాదించే వారి తల్లిదండ్రులు కూడా ఎగబడుతున్నారు. మనదేశం ఐటి, ఆటో, రియల్ ఎస్టేట్ గాల అనూహ్య వృద్ధితో ఆర్థికంగా ఎదిగినా సామాజికంగా ఇంకా ఎదగలేదు. పెద్దలు తాముకష్టపడి పిల్లలను చదివిస్తే మొదట బాధపడినా పెరిగి ప్రయోజకులైన పిమ్మట తమపెద్ద గురించి నలుగురితో గొప్పగా చెప్పుకుంటారు కానీ అక్రమార్జనుల సంతానం చెప్పుకోలేరు.అలాగే ప్రజలుకూడా మొదట సణుక్కన్నా పరిపాలనలో మంచిమార్పు కనిపిస్తే తప్పక ఆదరిస్తారు. ఇక పన్నుపోట్లలో మనరాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. క్రమశిక్షణ లేని జాతిపునాది లేని భవనం వంటిది.ఎవరూ కోరని అనుచిత పథకాలవల్ల ఈమధ్య మనసమాజంలో అవినీతి, అక్రమాలు, ప్రజల్లో బాధ్యతారాహిత్యం,పాశ్చాత్య విలాససంస్కృతి, తాగుడు, గంజాయి వంటి దుర్వ్యసనాలు బాగా పెరిగి వాటికి బానిసలై తల్లిదండ్రులు, భార్యాబిడ్డలను కూడా కిరాతకంగాచంపే ఉన్మాద స్థితికి దిగజారిపోతున్నారు. ఈ పంచుడు పథకాలతో కొందరు అనుచిత లాభం పొందుతుంటే పెరిగిపోతున్న పన్నుల భారంతో ప్రజల నడ్డి విరుగుతుంది.మన రాష్ట్రంఒడిశా, బీహార్, త్రిపుర రాష్ట్రాల కంటే వెనుకబడిలేదు. కనుక మన నేతలుకూడా ఆదర్శంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ బహిరంగసభలు, పాదయాత్రలకు వచ్చే జనసమూహాలను చూసి ఉబ్బిపోయిఅనుచితమైన హామీల్వికుండా,ప్రజాకర్షక పథకాలవల్ల భారీగా పెరిగిన అదనపు పన్నుల భారం తగ్గిస్తామని, బీహార్, కేరళరాష్ట్రాల్లోవలె మద్యపానం,మత్తుపదార్థాలను సాధ్యమైనంత వరకు నియంత్రిస్తామని హామీలిస్తేఅవి సమాజం మొత్తానికి ప్రయోజనమే. ●

# తెలంగాణలో కీలకం కాబోతున్న 'బిసి' అజెండా!

**డాక్టర్ కందగట్ల శ్రవణ్‌కుమార్**

వచ్చే ఆరు నెలల్లో తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్షాల పార్టీలు ఇచ్చే వివిధ హామీల్లో వెనుకబడిన వర్గాలను (బిసి) ఆకట్టుకునే విధంగా, వారి ఓటు బ్యాంకుని పొందాలనే దిశగా పలు ప్రతిపాదనలు, డిక్లరేషన్ల పేరిట వారి హామీలను విడుదల చేస్తున్నాయి. కర్ణాటక ఎన్నికల్లో కుల సమీకరణాలే కాంగ్రెస్ విజయానికి కీలకం కావడంతో రాష్ట్రంలోనూ అదే తరహాలో ముందుకెళ్లాలని రాష్ట్రంలో అన్నిపార్టీలు ఆలోచనలు చేస్తున్నాయి. ఆ దిశగా రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలపై ఇప్పటికే కసరత్తును మొదలుపెట్టాయి. ఇందులో భాగంగా కుల సమీకరణాలపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టాయి. తెలంగాణ సమగ్రకుటుంబ సర్వే-2014 ప్రకారం, రాష్ట్ర జనాభా 3.63కోట్లు ఉండగా, అందులో సగానికిపైగా వెనుకబడిన తరగతుల వారేనని (బిసిలు) సర్వే తేల్చింది. మొత్తం బిసిల జనాభా 1,85,61,856 లక్షలు (51.08శాతం).ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 136బిసి కులాలుండగా తెలంగాణ రాష్ట్రంలో అవి 112కులాలకు తగ్గాయి.ఇంత పక్కాగా బిసిల జనాభా తేల్చటం ఇదే మొదటిసారిగా సర్వే తేలిపింది. తెలంగాణ జనాభాలో 52 శాతంపైగా వెనుకబడిన తరగతికి చెందిన వారు ఉన్నారు. వీరి ఓట్లే రాబోయే ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది. ఒకవైపు తెలంగాణలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు బిసిలు, ఎస్సీలు, ఎస్టీలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలే టార్గెట్‌గా వ్యూహాలను రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది. వాటి ఆధారంగా సర్కారుపై పోరాడుతూనే, ఆయా కులాల ఓటర్లను ఆకర్షించేందుకు ఎత్తుగడలు వేస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రధానంగా వెనుకబడిన వర్గాలను టార్గెట్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇక అధికార పార్టీ అయిన బిఆర్‌ఎస్ పాలనలో వివిధ కులవృత్తులను ఆదుకునే విధంగా పలు పథకాలను, విధానాలను అమలు చేస్తున్నామని, బిసిల ఓటుబ్యాంకు మద్దతు ఉందనే ధీమాలో ఉంది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో కులవృత్తులనే నమ్ముకొని జీవిస్తున్న వారికి రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన విధివిధానాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. గతంలో రైతు బీమాపథకం తరహాలో చేనేత, కల్లుగీత కార్మికులకు బీమా పథకాలను, గొర్రెల పెంపకం యూనిట్లకు నగదు బదలీ ప్రకటించింది. కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు పేర్కొంది. బిసి బంధు అమలు ప్రతిపాదనల దశలోనే ఉంది. కేంద్రంలో బిసి ప్రధానమంత్రిని చేసిన బిజెపి రానున్న ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని బిసి కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పిస్తామని, విదేశాల్లో చదివే బిసి విద్యార్థులకు స్టాచురేషన్ పద్ధతిలో ఆర్థిక సాయం అందిస్తామని,




నామినేటెడ్ పదవుల్లోనూ బిసిలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఎన్నికల్లో గెలిచి రాలేని కులాలకు పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని బిసి డిక్లరేషన్ పేరిట ఒకపబ్లిక్ మీటింగ్‌లో అనధికారికంగా చెప్పారు. ఇక కాంగ్రెస్ కర్ణాటకలో బిసికులాల జనాభాను లెక్కిస్తామని, 50శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చాలా సభల్లో ప్రకటించడం వంటివి పార్టీ గెలుపునకు దోహదంచేశాయి. కర్ణాటకలో ఎస్సీ,ఎస్టీలనూ ఆ పార్టీ కలుపుకొని ముందుకెళ్లింది. ఇప్పుడు తెలంగాణలోనూ ఈ ఫార్ములాపైనే పార్టీ కాంగ్రెస్ దృష్టి పెట్టినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో ఒకవర్గానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారంటూ కొందరు నేతలు అసంతృప్తితోఉన్నారు. ఇతర సామాజిక వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. రాష్ట్ర నాయకత్వంతోపాటు జాతీయ నేతలూ దీనిపై దృష్టి సారించినట్లు తెలుస్తున్నది. పార్టీలో బిసిలు, ఎస్సీలు, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్తున్నారు. కర్ణాటక ఎన్నికల్లో మైనారిటీ ఓట్లతోపాటు జనాభాలో 17శాతానికిపైగా ఉన్న బిసిలైన లింగాయత్‌ల ఓట్లుకూడాకాంగ్రెస్‌కు మళ్లడం ఆపార్టీకి కలిసి వచ్చింది. తెలంగాణలో కూడా ఇక్కడి బిసిలను ఆకర్షించేలా అలాంటి ఫార్ములానే ఫాలో అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో అన్నివర్గాల వారిని ఆకర్షించేలా గత యేడాది రైతు డిక్లరేషన్, ఇటీవల యూత్ డిక్లరేషన్ కూడా ప్రకటించింది.ఇప్పుడు ఇదేతరహాలో వివిధ కులాలవారీగా డిక్లరేషన్లు ప్రకటించే పనిలోఉంది. ప్రస్తుతం తెలంగాణ శాసనసభలో బిసి ఎమ్మెల్యేలు 21మంది మాత్రమే ఉన్నారు.జనాభా దామాషా ప్రకారం 65 మంది ఎమ్మెల్యేలు ఉండాలని మొదటి నుండి వెనుకబడిన వర్గాల వాదన. కొన్ని కులాలకు సంబంధించిన కులాల ప్రాతినిధ్యం శాసనసభలో లేకపోవడం, వారిని అధికార,విపక్షాలు కూడా నిర్లక్ష్యం చేయడం ప్రస్తుత రాజకీ యాలలో అన్ని పార్టీలకు నష్టమే. వెనుకబడిన వర్గాల్లో ఆర్థికలేమి, రాజకీయ సాధికారత లేకపోవడం, ప్రధానంగా బిసిల్లో ఐక్యత లేకపోవడమే అనే వాదనలు ఉన్నాయి. అలాగే బిసి వర్గాల్లో ఒకరికి టికెట్ ఇస్తే మిగతా వారు సహకరించరని భావన కూడా ఉంది. ఏదిఏమైనా వచ్చే తెలంగాణ ఎన్నికల్లో బిసి ఎజెండానే కీలకం కానుంది. ఎందుకంటే వారి జనాభా అధికం. బిసిలను ఆకర్షించి వారిఓట్లను పొందాలని అన్ని పార్టీలు చూస్తున్న మొత్తం అసెంబ్లీ సీట్లలో సగం వెనుకబడిన వర్గాలకు ఇచ్చి, అత్యధిక వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం వహించేలా ఉండాలని, బిసి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే వెనుకబడిన వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికై రచించే విధానాలు, రాజకీయ సాధికారత పొందే విధంగా ఇచ్చే హామీలు, దళితబంధు లాంటి పథకం బిసిలకు కూడా వర్తింపు లాంటి అంశాలు మాత్రమే వచ్చే ఎన్నికల్లో పలు పార్టీల గెలుపునకు కారణాలు అవుతాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. తెలంగాణలో ప్రస్తుతం అన్ని పార్టీలు కులాల వారీగా, వివిధ వర్గాల వారీగా పలు డిక్లరేషన్లు ప్రతిపాదిస్తున్నప్పటికీ ప్రజలు ఎవరిని అధికారంలో డిక్లేర్ చేస్తారో అనే అయోమయం అన్నిపార్టీల్లో ఉంది. ●

# పడవమునిగి నలుగురు మృతి
## యుపిలోని బల్లియా జిల్లాలో దుర్ఘటన

**బల్లియా(యుపి), మే 22:** ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లాలో ఒక పడవి మునిగిపోవడంతో కనీసం నలుగురు నదిలో కొట్టుకునిపోయారు. పడవలో మొత్తం 30 మంది ప్రయాణిస్తున్నారు.ఎక్కువ మంది మహిళలు చిన్నారులే ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియాజిల్లా పరిధిలోని గంగానదిలో ఈదుర్ఘటన చోటుచేసుకుంది. అనేక కుటుంబాలు మాల్దేపూర్‌ఘాట్‌వద్దకు చేరుకుని అక్కడ పవిత్రకార్యక్రమం ముండన్ అంటేవారి పిల్లలకు కేశఖండన చేయిస్తున్నారు. అందుకోసమే వారు పడవలో బయలుదేరినట్లు సమాచారం. పరిమితికి మించి ఓవర్‌లోడ్‌చేయడంవల్లనే ఈ పడవ మునిగిందని అంచనా. జిల్లా మేజిస్ట్రేట్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ పడవ ఇంజన్ పనిచేయకపోవడంవల్లనే ఈప్రమాదం జరిగిందని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పడవ యజమాని పరారీలో ఉన్నాడని, ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తుజరిపిస్తామని తెలిపారు. స్థానికు లసాయంతోనే రక్షణ చర్యలుచేపట్టారు. స్థానికంగా ఉన్న పడవల యజమానులు, సిబ్బంది కూడా ఈ రక్షణ చర్యల్లో పాల్గొంటూ ప్రభుత్వ సిబ్బందికి సహకరించారు.

# గజమాలలు వద్దు పుస్తకాలు తెండి
## ఆడంబరాలకు దూరమంటున్న కర్ణాటక కొత్త సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు, మే 22:** డికె శివకుమార్‌తో ఢీకొట్టి ఎట్టకేలకు కర్నాటక ముఖ్యమంత్రి అయిన సిద్ధరామయ్య సంచలన నిర్ణయాలు తీసుకోవడంతో బెంగళూరు ప్రజలు ఫుల్ హ్యాపీ అయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సిద్ధరామయ్యను అభినందించడానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు సిఎంను సన్మానించడానికి పోటీ పడుతున్నారు. గజమాలలు, శాలువలు, బహుమతులు తీసుకుని సిఎం సిద్ధరామయ్యను సన్మానించడానికి ఆయన ఇంటికి క్యూకడుతున్నారు. ఇక బహిరంగ సభలు, సమావేశాలు, పలు కార్యక్రమాలకు సిఎం సిద్ధరామయ్య హాజరు అయితే ఆయన్ను ఘనంగా సన్మానించి ఆయన దగ్గర మంచి మార్కులు కొట్టేయాలని, రాజకీయంగా లబ్ధిపొందాలని నాయకులు ప్లాన్ చేస్తున్నారు. ఇలాంటి సమయంలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ఇక ముందు తనకు పూలమాలలు వేసి శాలువలతో సత్కరించడానికి ప్రయత్నించకూడదని, అయితే మీ అభిమానం, ప్రేమానురాగాలు తనకు నిత్యం అండగా ఉండాలని అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మనవి చేశారు. అనవసరంగా డబ్బులు ఖర్చు చేయడం తనకు ఇష్టం లేదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంటున్నారు. బహిరంగ సభలకు తాను హాజరైన సమయంలో కూడా గజమాలలు, శాలువలతో తనకు సన్మానం చేయకూడదని, అక్కడ కూడా తనకు పుస్తకాలు బహుమతిగా ఇచ్చి అభిమానం చాటుకుంటే చాలని కర్నాటక సిఎం సిద్ధరామయ్యట్వీట్ చేశారు. సిఎం సిద్ధరామయ్య తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు సామాన్య ప్రజలు కూడా అభినందిస్తున్నారు. సిఎం సిద్ధరామయ్య హంగామాలకు దూరంగా ఉండాలని నిర్ణయించడం చాలా గ్రేట్ అని నెటిజన్లు అంటున్నారు. సిద్ధరామయ్య ఆయన బెంగళూరులో సంచరించడానికి పోలీసు అధికారులు జీరో ట్రాఫిక్ సౌలభ్యం అందుబాటులోకి తీసుకువచ్చారు. మామూలుగా సిఎంలు సంచరించడానికి బెంగళూరులో జీరో ట్రాఫిక్ అమలు చేస్తున్నారు. అయితే తనకు జీరో ట్రాఫిక్ సదుపాయం వద్దు అని సిఎం సిద్ధరామయ్య అంటున్నారు. బెంగళూరులో ట్రాఫిక్‌తో నిత్యం ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పుడున్న ట్రాఫిక్ సమస్యలకు తోడు తాను జీరో ట్రాఫిక్‌లో తిరిగితే ప్రజలకు ఇంకా సమస్యలు ఎదురవుతాయని, అలా కాకుండా మామూలుగానే తాను సంచరిస్తానని బెంగళూరు నగర పోలీస్ కమీషనర్ ప్రతాప్ రెడ్డికి సిఎం సిద్ధరామయ్య లేఖ రాశారు. బెంగళూరులో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, ప్రైవేట్ కంపెనీల ఉద్యోగులు సిఎం సిద్ధరామయ్య నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నమ్మిన వాళ్లే సాయం చేయలేదు: ప్రధాని నరేంద్ర మోడీ



**పోర్ట్ మోరెస్బీ, మే 22:** అభివృద్ధి చెందిన దేశాలపై ప్రధాని నరేంద్ర మోడీ తన అసంతృప్తిని వ్యక్తంచేశారు. తాను నమ్మకం ఉంచిన దేశాలు అవసరకాలంలో అండగా నిలవలేదని వ్యాఖ్యానించారు. సోమవారం పపువా న్యూగునియా పర్యటనలో ఉన్న ఆయన ఇండియా-పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్ మూడవ సదస్సులో మాట్లాడుతూ ఈ విధంగా స్పందించారు.

గ్లోబల్ సౌత్‌పై కొవిడ్ ప్రభావం తీవ్రంగా పడింది. వాతావరణ మార్పులు, ఆకలి, పేదరికం, వైద్యపరమైన సమస్యలు ఉండనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఇంధనం, ఆహారం, ఎరువులు, ఔషధాల సరఫరా వ్యవస్థ దెబ్బతింది. ఆ ప్రభావాన్ని మనమంతా అనుభవిస్తున్నాం. ఇంకా కొత్త సమస్యలు వస్తూనే ఉన్నాయన్నారు.

# లై డిటెక్టర్ టెస్ట్‌కు నేను సిద్ధమే, కానీ వాళ్లిద్దరు కూడా చేయించుకోవాలి
## ఇండియన్ రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్



**న్యూఢిల్లీ, మే 22:** భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. మహిళా రెజ్లర్లపై ఆయన వేధింపులకు పాల్పడ్డారని పలువురు రెజ్లర్లు ఆరోపించారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వారు ధర్నా కూడా చేశారు. ఈ నేపథ్యంలో బ్రిజ్‌భూషణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని బ్రిజ్ భూషణ్ అన్నారు. నార్కోటెస్ట్ కానీ, పాలీగ్రాఫ్ టెస్ట్‌కానీ, లైడిటెక్టర్ కానీ, ఏ టెస్టుకైనా తాను సిద్ధమేనని చెప్పారు. అయితే తనతో పాటు రెజ్లర్లు వినేశ్ ఫొగట్, భజరంగ్ పూనియాలు కూడా టెస్ట్ చేయించుకోవాలని కండిషన్ పెట్టారు. టెస్ట్ చేయించుకోవడానికి వాళ్లిద్దరూ సిద్ధమయితే మీడియా ముఖంగా ఆ విషయాన్ని వెల్లడించాలని అప్పుడు తాను కూడా టెస్ట్ చేయించుకుంటానని చెప్పారు. మరోవైపు రెజ్లర్లకు నానాటికీ మద్దతు పెరుగుతోంది. హర్యానా రైతులు కూడా వీరికి సంఘీభావం ప్రకటించారు. నార్కో పరీక్షల విషయంలో రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లు వెల్లడించారు. తాను నార్కో అనాలిసిస్ పరీక్షలకు సిద్ధమే కానీ సాక్షి మాలిక్, వినేశ్‌ఫొగాట్, బజరంగ్ పునియాలకు సైతం పరీక్షలు చేయాలని బ్రిజ్ భూషణ్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆందోళనకు నాయకత్వం వహిస్తోన్న వినేశ్ ఫొగట్ స్పందిస్తూ కేవలం తాను మాత్రమే కాకుండా బ్రిజ్ భూషణ్‌పై లైంగిక్ వేధింపుల ఫిర్యాదు చేసిన మహిళా రెజ్లర్లందరూ నార్కో పరీక్షలకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. అంతేకాదు, పరీక్షలను ప్రత్యక్ష ప్రసారం చేస్తే అతడి దుర్మార్గాలు దేశం మొత్తం తెలుస్తాయని అన్నారు. వినేష్ మాత్రమే కాదు, ఫిర్యాదు చేసిన అమ్మాయిలందరూ నార్కో పరీక్ష చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అది లైవ్‌లో జరగాలని బ్రిజ్‌భూషణ్‌కు చెప్పాలనుకుంటున్నాను, దీనిని ప్రత్యక్ష ప్రసారం జరగాలి. తద్వారా ఆడపిల్లలపై అతని క్రూరత్వం గురించి దేశం మొత్తం చూస్తుంది అని వినేష్ పేర్కొన్నారు. అతడు కేవలం ఇద్దరు ముగ్గురినే నార్కో పరీక్షలు చేయించుకోమని అడుగుతున్నాడు. ఫిర్యాదు చేసిన ఏడుగురూ పరీక్షలు చేయించుకుంటారు. మేము సిద్ధమే అని వినేష్ సవాల్ విసిరారు. వినేశ్ ఫొగట్, సాక్షిమాలిక్‌లతో పాటు మరికొంతమంది మహిళా రెజ్లర్లు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసూనత ఢిల్లీలోని జంగర్‌మంతర్‌వద్ద గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. వారికి మద్దతుగా బజరంగ్ పునియా వంటి పురుష రెజ్లర్లు ఆందోళనలో పాల్గొంటున్నారు. ఇదే సమయంలో రెజ్లర్ల ఆందోళనకు రైతు సంఘం సంయుక్త కిసాన్ మోర్చా మద్దతు తెలిపింది. మరోవైపు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహిళా రెజ్లర్ల ఫిర్యాదుతో బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అటు, మహిళా రెజ్లర్ల ఆరోపణలను బ్రిజ్ భూషణ్ ఖండించారు. ఉద్దేశపూర్వకంగానే తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎదురుదాడి చేస్తున్నారు.

# భారీ వర్షానికి బెంగళూరులో మరో ఇద్దరు మృతి



**బెంగళూరు, మే 22:** చిన్న వానకు చివురుటాకులా వణికిపోయే బెంగళూరులో కుండపోత వర్షం భీభత్సం సృష్టించింది. అండర్‌పాస్‌లు, నాలాలు, మాన్‌హోల్స్ ఇవే కాకుండా మనుషులను మింగేస్తోంది ఈ భారీ వర్షం. సోమవారం మరో ఇద్దరు మృతి చెందడం కలకలం రేపుతోంది. ఇదే వర్షాలకు ఆదివారం తెలుగు అమ్మాయి మృతి చెందగా, సోమవారం మరో యువకుడు అదే వర్షానికి బలి అయ్యాడు. భారీ వర్షంతో వరద నీటికి కొట్టుకుపోయాడు. ఆదివారం కొట్టుకుపోయిన యువకుడు సోమవారం శవమై తేలాడు. ఇక బెంగళూరు మహానగరంలో కురిసిన కుండపోత వర్షం ఓ తెలుగు కుటుంబాన్ని అంతులేని విషాదంలోకి నెట్టింది. ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తోన్న భాను రేఖ అనే తెలుగు యువతి నీటమునిగిన కారులో చిక్కుకుపోయి చనిపోయింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5లక్షల నష్టపరిహారం ప్రకటించారు. బాధితులు కృష్ణా జిల్లాకు చెందిన తేలప్రోలు వాసులు. ఓ వారం రోజులు వేసవి సెలవులకు బెంగళూరుకి వచ్చిన ఈ కుటుంబం క్యాబ్ బుక్ చేసుకొంది. అదే ఆ కుటుంబానికి మృత్యుశకటంగా మారింది.

# బిబిసికి ఢిల్లీ హైకోర్టు సమన్లు జారీ
## భారత్‌ను కించపరిచిన డాక్యుమెంటరీ వ్యవహారం

**న్యూఢిల్లీ, మే 22:** బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి)కి ఢిల్లీ హైకోర్టు సోమవారం సమన్లు జారీ చేసింది. బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీలో భారతదేశం, దేశంలోని న్యాయవ్యవస్థ, ప్రధానమంత్రి మోడీ విరుచుకపడ్డారని, అలాగే దేశ పేరు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లిందంటూ దాఖలైన పరువునష్టం దావా మేరకు బిబిసికి ఢిల్లీ హైకోర్టు సమన్లు పంపింది. గుజరాత్‌కు చెందిన ఎన్‌జిఒ దాఖలు చేసిన పిటిషన్ మేరకు బ్రిటన్‌లోని బిబిసి కేంద్ర కార్యాలయంతోపాటు భారత్‌లోని దాని ఆ సంస్థ విభాగానికి కూడా స్పందన కోరుతూ జస్టిస్ సచిన్‌దత్తా నోటీసులు జారీ చేసింది. కాగా, 'ఇండియా: ది మోడీ క్వశ్చన్' పేరుతో రెండు భాగాల డాక్యుమెంటరీని బ్రిటన్‌లో ఉన్న బిబిసి కేంద్ర కార్యాలయం విడుదల చేసిందని దేశంలోని బిబిసి స్థానిక కార్యాలయం విజ్ఞప్తి చేసింది. పరువునష్టం దావా దాఖలు చేసిన గుజరాత్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ తరపున సీనియర్ అడ్వొకేట్ హరీశ్‌సాల్వే కోర్టులో తన వాదనలు వినిపిస్తూ.. బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీ యావత్తూ భారత్‌తోపాటు దేశంలో న్యాయవ్యవస్థతో మొత్తం వ్యవస్థనే కించపరిచేలా, పరువు తీసేలా ఉందని అన్నారు. అంతేకాకుండా ఈ డాక్యుమెంటరీలో ప్రధానికి వ్యతిరేకంగా ప్రేరేపన తెచ్చేలా ఉందని హరీశ్‌సాల్వే వాదనలు వినిపించారు. బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీలో దేశం పరువు ప్రతిష్ఠలపై దుమ్మెత్తి పోశారని ఆయన వాదించారు. ఈ కేసులో ప్రతివాదులందరినీ ప్రతిస్పందన కోరుతూ సమన్లు జారీ చేసినట్లు ఢిల్లీ హైకోర్టు పేర్కొన్నది. తదుపరి విచారణను సెప్టెంబరు 15కు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా.. అంతకుముందు బిబిసికి, వికీమీడియా ఫౌండేషన్, బ్రిటన్‌కు చెందిన డిజిటల్ లైబ్రరీకి హైకోర్టు సమన్లు జారీ చేసింది. 'ఇండియా – ది మోడీ క్వశ్చన్' బిబిసి ఎపిసోడ్ ప్రసారాన్ని ఆయా సంస్థలు శాశ్వతంగా నిలిపివేయాలని కోరుతూ బిజెపి నాయకుడు బినయ్‌కుమార్‌సింగ్ పిటిషన్ వేశారు. జార్ఖండ్‌లోని బిజెపి కార్యవర్గ కమిటీ సభ్యుడు కుమార్ దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు.. బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీ సిరీస్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి, బిజెపిలను లక్ష్యంగా చేసుకుని వాటి పరువు తీసింది. బిబిసి, వికీపీడియా తరపున కోర్టుకు హాజరైన న్యాయవాది కోర్టు అదనపు జిల్లా జడి రుచికా సింగ్లాకు తన వాదనలు వినిపిస్తూ ఎటువంటి దావా కాపీలు అందలేదన్నారు



# 2000 నోట్ల మార్పిడి విధానంపై ఢిల్లీ హైకోర్టులో పిల్!'

**న్యూఢిల్లీ, మే 22:** రెండువేల రూపాయల కరెన్సీనోట్ల మార్పిడిపై ఢిల్లీ హైకోర్టులో సోమవారం ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. బ్యాంకుల్లో ఎలాంటి రిక్విజిషన్ స్లిప్పులు భర్తీచేయకుండా, గుర్తింపు కార్డులు లేకుండా బ్యాంకునోట్లను అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ పిటిషన్‌ను దాఖలుచేసారు. న్యాయవాది అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ ఆర్‌బిఐ, ఎస్‌బిఐలు తీసుకున్న నిర్ణయాలు ఏకపక్షంగాను, సహేతుకంగా లేవని, రాజ్యాంగంలోని 14వ అధికరణాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. రెండువేల కరెన్సీనోట్ల రూపంలో భారీ మొత్తాలు వేర్పాడువాదులు, ఉగ్రవాదులు, మావోయిస్టులు, డ్రగ్ స్మగ్లర్లు, మైనింగ్ మాఫియా, అవినీతి ప్రముఖులవద్ద పోగయి ఉన్నాయని ఈకరెన్సీని ముందు లాకర్లలో భద్రపరుచుకున్నారని తెలిపారు. ఎక్కువ విలువలున్న కరెన్సీ రూపంలోనే అవినీతికి ఎక్కువ ఆస్కారం ఉందని, ఉగ్రవాదం, నక్సలిజం, వేర్పాటువాదం, విప్లవవాదం, జూదం, స్మగ్లింగ్, మనీలాండరింగ్; కిడ్నాపింగ్, సొమ్ములు డిమాండ్‌చేయడం, లంచాలు, వరకట్నం వంటి వాటికి ఇవే వేదికలు అవుతాయని ఆర్‌బిఐ, ఎస్‌బిఐ రెండె ఊడా ఈ బ్యాంకు నోట్లను కేవలం వారి బ్యాంకుఖాతాల్లో జమ అయ్యేటట్లు చూడాలని అన్నారు.

# కిలో మీటర్ వెనక్కి నడిచిన రైలు



**తిరువనంతపురం, మే 22:** కేరళలో విచిత్ర ఘటన చోటు చేసుకుంది. స్టేషన్‌లో ఆగాల్సిన రైలు ఆగకుండా ముందుకెళ్లింది. కొంత దూరం వెళ్లిన తర్వాత విషయం తెలుసుకున్న లోకోపైలట్ దాదాపు కిలోమీటర్ వరకు రైలును వెనక్కి నడిపి ప్రయాణికులకు దింపాడు. ఈ వింత సంఘటన అలప్పుజ జిల్లాలో సోమవారం ఉదయం 7.45 గంటలకు చోటు చేసుకుంది. షోరనూర్ నుంచి వేనాడ్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు మావెలిక్కర, చెంగన్నూర్ మధ్యనున్న చెరియానాడ్ రైల్వే స్టేషన్‌లో ఆగాల్సి ఉంది. కానీ రైలు ఆపకుండా ముందుకు వెళ్లిపోయింది. వెంటనే అటు స్టేషన్‌లో రైలు ఎక్కాల్సినవాళ్లు, ఇటు రైలు నుంచి దిగాల్సిన ప్రయాణికులు ఆందోళన చెందారు. కాసేపటికి లోకో పైలట్‌కు వెనక స్టేషన్‌లో ప్రయాణికులు ఉన్న విషయం గుర్తొచ్చింది. దీంతో రైలును వెనక్కి నడిపాడు. 700 మీటర్లు రైలును వెనక్కిపోనిచ్చి స్టేషన్‌లో ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. కాగా ప్రయాణికులు ఇబ్బందిపడినట్లు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రైల్వే అధికారులు తెలిపారు. అయినా రైలు సరైన సమయంలో గమ్యస్థానానికి చేరుకుందని వెల్లడించారు. అయితే చేర్యానాడ్ స్టేషన్‌లో సిగ్నల్ లేదా స్టేషన్ మాస్టర్ లేకపోవడంతో రైలు ఆగకుండా వెళ్లిపోయి ఉందని, ఇది లోకో పైలట్‌ని తప్పిదంగా అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అతని నుంచి వివరణ కోరనున్నాట్లు పేర్కొన్నారు. స్టేషన్‌లో ట్రైన్ ఆపకపోవడానికి కారణం ఏంటనే విషయంపై విచారిస్తామని చెప్పారు.

# ధారావి స్లమ్ నుంచి బ్రాండ్ అంబాసిడర్‌గా మలీషా

**ముంబయి:** ఆసియాలోనే అతిపెద్ద నోటిఫైడ్ మురికివాడగా పేర్కొంటున్న ధారావి స్లమ్‌నుంచి 14 ఏళ్ల బాలిక ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లగ్జరీ బ్యూటీ బ్రాండ్ ఫారెస్ట్ ఎస్సెన్షియల్స్ సంస్థ కొత్తగా ప్రారంభించిన ది యువతి కలెక్షన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైంది. స్లమ్‌ఏరియాలో ఉండే మలీషా యుపుడు యువతి కలెక్షన్‌ను ముందుండి నడిపించనున్నది. ఇది యువశక్తిని పెంపొందించే లక్ష్యంతోమొదలుపెడుతున్న ఒక సామాజిక కార్యక్రమంగా కంపెనీ ప్రకటించింది. ప్రతిభ ఉంటే చాలు అవకాశాలు వెదుక్కొంటూ వస్తాయనడానికి మలీషా ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. గత ఏప్రిల్‌లోనే మలీషాను తమ సంస్థలోకి స్వాగతం పలుకుతూ ఓ అందమైన వీడియోను కంపెనీ షేర్‌చేసింది. బికాజ్ యువర్ డ్రీమ్స్ మ్యాటర్ అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్‌మీడియాలో వైరల్ అయింది బ్రాండ్‌స్టోర్‌లోకి వెళ్లి అక్కడ ప్రదర్శనకు ఉంచిన తన ఫోటోలను చూస్తూ ఆనందంతో మురిసిపోతుంది.



ఈ విడియోకు ఐదు మిలియన్ల వ్యూస్, నాలుగు లక్షలకుపైగా కామెంట్లు వచ్చాయి. ఈ అంబాసిడర్‌పదవి తనలాంటి వారికి దక్కిన అరుదైన గౌరవంగా మలీషా వెల్లడించింది. భవిష్యత్తులో మోడల్‌గా రాణిస్తానని, చదువును ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయనంటూ చెప్పింది.

# ఒక్కరోజులో కరోనా కేసులు 472, మృతులు ఆరుగురు
## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,49,86,934

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే22:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 472 కేసులు నమోదయ్యాయి. మృతి ఆరుగురు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,86,934కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,47,472మంది కోలుకోగా 7623మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,31,839 చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.80 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.18 శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,68,889కి చేరగా,80,19,855 మంది వరకు కోలుకున్నారు. 1,48,549 మంది ప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 69,05,053కి చేరింది. అందులో 68,30,388మంది కోలుకున్నారు. 71,916మంది మరణించారు.

కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,88,109కి చేరింది. అందులో 40,47,490మంది కోలుకున్నారు. 40,355మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య 36,10,404కి చేరింది.అందులో 35,72,225మంది కోలుకున్నారు. 38,079మంది మరణించారు.

# శ్రీనగర్‌లో జి-20 సన్నాహక సదస్సు



శ్రీనగర్, మే 22: ప్రతిష్టాత్మక సన్నాహక సదస్సుకు జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్ వేదిక కానుంది. జి-20 దేశాలకు సంబంధించి టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశంకు శ్రీనగర్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఇందుకోసం భారీగా భద్రతా ఏర్పాట్లు జరిగాయి. 2019 ఆగస్టులో కేంద్రం జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసిన తర్వాత జరుగుతున్న తొలి అంతర్జాతీయ సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అంతర్జాతీయ సదస్సు సన్నాహక సమావేశం జరుగుతున్నందున శ్రీనగర్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఎటు చూసినా మిరిమిట్లు గొలిపే కలర్‌ఫుల్ లైట్స్‌తో శ్రీనగర్ చాలా అందంగా కనిపిస్తోంది. అంతేకాకుండా నగరాన్ని మొత్తం చక్కగా అలంకరించారు. షేర్-ఈ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ జీ-20 సన్నాహక సదస్సు జరుగుతుండడంతో అక్కడికి చేరుకునే మార్గమంతా చాలా అందంగా తీర్చిదిద్దారు. దేశవ్యాప్తంగా 118 నగరాల్లో జీ-20 సన్నాహక సదస్సులు విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు చీఫ్ కోఆర్డినేటర్ హార్షవర్ధన్ షింగా. టూరిజంపై జరిగిన సమావేశాల్లో మిగతా రెండు సమావేశాలతో పోలిస్తే శ్రీగనర్ సమావేశంలో పాల్గొనేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపినట్లు హార్షవర్ధన్ చెప్పారు. జీ-20 సన్నాహక సదస్సుకు సభ్య దేశాల నుంచి 60 మంది అతిథులు పాల్గొంటున్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు సింగపూర్ నుంచి వస్తున్నారు. అంతేకాకుండా శ్రీనగర్ సమావేశంలో పాల్గొనేందుకు ప్రత్యేక ఆహ్వానితులు కూడా వస్తున్నారు. జీ-20 సన్నాహక సదస్సును శ్రీనగర్‌లో నిర్వహించడాన్ని చైనా వ్యతిరేకించగా, సౌదీ అరేబియా ఈ కార్యక్రమానికి రిజిస్టర్ చేసుకోలేదు. టర్కీ శ్రీనగర్ సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. వివాదాస్పద ప్రాంతాల్లో ఎక్కడ నిర్వహించినా అక్కడ చైనా పాల్గొనకూడదని నిర్ణయించుకున్నట్లు ఆ దేశ విదేశాంగ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ చెప్పారు. ఇందుకు భారత్ కౌంటరిస్తూ తమ భూభాగంలో ఎక్కడైనా సమావేశాలు నిర్వహించుకునే హక్కు స్వేచ్ఛ తమకున్నాయని పేర్కొంది. ఇక భద్రతాపరంగా శ్రీనగర్‌లో గట్టి ఏర్పాట్లు చేశారు. మెరైన్ కమాండోలు, ఎన్ఎస్‌జి కమాండోలను భద్రత కోసం కేంద్రం ఏర్పాటు చేసింది. యాంటీ డ్రోన్ యూనిట్లు నిత్యం నిఘా పెడుతున్నాయి. ఆర్మీ నుంచి వేలాదిగా ట్రూప్స్‌ను దింపాయి. సిఆర్‌పిఎఫ్, సహస్ర సీమా బల్, జమ్మూకశ్మీర్ పోలీసులు కూడా గస్తీలో ఉన్నారు.

# నోట్ల మార్పిడి నల్లధనం దాచుకున్నవారికి రెడ్‌కార్పెట్: పి.చిదంబరం

**న్యూఢిల్లీ, మే 22:** ఆర్థిక వ్యవస్థ నుంచి రూ.2వేల నోట్లను ఉపసంహరిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చేసిన ఆకస్మిక ప్రకటనపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఈ చర్యను మరో డీమానిటైజేషన్‌గా అభివర్ణిస్తూ కేంద్రం పై విమర్శలు గుప్పించాయి.



తాజాగా దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం స్పందిస్తూ, ఈ నోట్ల మార్పిడితో నల్లధనం దాచుకున్నవారికి రెడ్‌కార్పెట్ వేసినట్లే అని మండిపడ్డారు. అసలు రూ.2వేల నోటును తీసుకురావడమే ఓ తెలివితక్కువ చర్య అని అన్నారు. ఎలాంటి పత్రాలు నింపకుండా, ఎలాంటి గుర్తింపుకార్డులు చూపకుండా నేరుగా తమ శాఖల్లోకి వెళ్లి రూ.2వేల నోట్లను మార్చుకోవచ్చని బ్యాంకులు స్పష్టంగా చెబుతున్నాయి. అంటే నల్లధనాన్ని వెలికితీసేందుకే ఈ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు బిజెపి చేస్తున్న వాదన తప్పనే కదా! సామాన్య ప్రజల వద్ద రూ.2 వేల నోట్లు లేవు. 2016లో ఈ నోట్లను ప్రవేశపెట్టిన కొద్దికాలంలోనే ప్రజలు వాటిని ఉపయోగించడం మానేశారు. రోజువారీ అవసరాలకు వారికి ఈ నోట్లు పనికిరావు. అప్పుడు వీటిని ఎవరు వినియోగిస్తున్నారు? ఎవరు దాచిపెట్టుకున్నారు? సమాధానం మీకు తెలుసు. కేవలం నల్లధనాన్ని దాచుకునే వారి సౌలభ్యం కోసం మాత్రమే ఈ రూ.2వేల నోటు ఉపయోగపడింది. ఇప్పుడు బ్యాంకుల నిర్ణయంతో నల్లధనం కలిగిన వారు తమ నోట్లను మార్చుకునేందుకు రెడ్‌కార్పొట్ వేసి ఆహ్వానం పలుకుతున్నారు. నల్లధనాన్ని సమూలంగా వెలికితీస్తామన్న కేంద్రం లక్ష్యం వెనుక ఇంకేదో ఉంది. రూ.2వేల నోటును తీసుకొస్తూ 2016లో తీసుకున్న నిర్ణయమే తెలివితక్కువ చర్య. కనీసం ఏడేళ్ల తర్వాతనైనా ఆ మూర్ఖపు చర్యను వెనక్కి తీసుకున్నందుకు సంతోషం అంటూ కేంద్ర ప్రభుత్వంపై చిదంబరం విమర్శలు గుప్పించారు.

# తన చిన్ననాటి గురువు ఆశీస్సులు పొందిన ఉపరాష్ట్రపతి
## కేరళకు వెళ్లి ప్రత్యేకంగా కలిసిన ధన్‌ఖడ్ కుటుంబం



**తిరువనంతపురం, మే 22:** తనకు చదువుచెప్పిన చిన్ననాటిటీచర్‌ను కలుస ుకుంటానని చేసిన వాగ్దానాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్‌ధంకడ్ నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం కేరళలో నివసిస్తున్న ఆమెను కలిసి ఆమె ఆశీస్సులు పొందారు. రాజస్థాన్‌లోని చితోర్‌ఘర్ సైనిక్‌స్కూలులో చదివిన ధంకడ్‌కు రత్నానాయర్ టీచర్‌గా పనిచేసారు. తొమ్మిదినెలలపాటు టీచర్లు, స్టూడెంట్లు కలిసి మెలిసి ఉండేవారని, వారిమధ్య గురుశిష్యులబంధం మరింతగా ఉండేదని నాయర్ ఆనాటి అనుభవాలు నెమరువేసుకున్నారు. ధంకడ్ స్కూలులో ఫస్ట్‌బెంచ్‌లోనే కూర్చుని మొత్తం చదువుపైనే దృష్టిపెట్టేవాడని, మంచి క్రీడాకారుడు కూడా అని చదువుతోపాటే క్రీడల్లోకూడా రాణించాడని రత్నానాయర్ అభినందించారు. జగదీప్ తండ్రి కూడా తల్లితండ్రులతో నిర్వహించే సమావేశాలకు తప్పకుండా హాజరయ్యేవాడని, తన ఇద్దరుకుమారుల చదువుపై ఆరాతీసేవారన్నారు. ఇపుడు జగదీప్‌తోపాటు ఆయన సోదరుడు సురేష్‌ధంకడ్‌కూడా రత్నానాయర్‌ను కలిసి ఆశీస్సులుపొందారు. కొబ్బరి నీటిని ముందుగా ఇచ్చి అనంతరం ఇంట్లోచేసిన ఇడ్లీ, అరటిచిప్స్‌తో ధన్‌కడ్ కుటుంబ సభ్యులకు ఉపాహారం అందించారు. తానుబోధించిన విద్యార్థి ఇపుడు దేశంలోనే అత్యున్నతస్థాయి రెండవ రాజ్యాంగపదవిలో ఉండటం గర్వకారణమని, ఇంతకంటే గురుదక్షిణ ఏముంటుందని రత్నానాయర్ సంతోషించారు. ఈకార్యక్రమంలో కేరళ అసెంబ్లీ స్పీకర్ ఎఎన్‌షమ్‌సీర్‌కూడా ఉన్నారు. 1951 మే 18వ తేదీన వ్యవసాయకుటుంబంలో జన్మించిన ధన్‌కడ్ రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాకు చెందినవారు. సైనిక్‌స్కూలు విద్యాభ్యాసం తర్వాత ఫిజిక్స్‌లో డిగ్రీచేసి రాజస్థాన్ వర్సిటీనుంచి ఎల్‌ఎల్‌బి పట్టాతీసుకున్నారు. రాష్ట్రంలో అగ్రశ్రేణి న్యాయవాదుల్లో ఒకరుగా నిలిచారు. 2019లో పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా నియమితులయిన ధన్‌కడ్ తర్వాత జులై 17వ తేదీ రాజీనామాచేసారు. ఎన్‌డిఎ అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్ వేసి ఎన్నికయ్యారు.

# ప్రపంచదేశాల్లో 68.90 కోట్లకుచేరిన వైరస్ బాధితులు
## 68.80 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, మే 22:** ప్రపంచదేశాల్లో కరోనా మహమ్మారి వైరస్ మళ్లీ కనిపిస్తోంది. చిన్నచిన్నదేశాల్లో అయితే మరింతగా కలవరం వ్యక్తం అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 68.90 కోట్లమందికి కరోనాసోకి 68.80 లక్షలమందిచనిపోయారు. మరో 38,293 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 66.14 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.07 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.92 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 20.59 లక్షలమందిచనిపోయారు. మరో 5863 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.52 కోట్లకుపైగా ఉంటే మరో 19.91 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో 12.66 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 16.32 లక్షలమంది చనిపోయారు. మరో 6255 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.25 కోట్లకుపైగా నమోదుకాగా మరో 25.19 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.73 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వారిలో 15.46 లక్షలమంది చనిపోయారు. మరో 15,418 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.10 కోట్లకుపైగా ఉంటే మరో 1.47 కోట్లమందిఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.86 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 13.55 లక్షలమందిచనిపోయారు. మరో 10,123 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది.

# మణిపూర్‌లో మరోసారి టెన్షన్ - రంగంలోకి దిగిన ఆర్మీ, మళ్లీ కర్ఫ్యూ



**ఇంఫాల్, మే 22:** ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. ఇప్పుడిప్పుడే ప్రశాంతంగా మారుతున్న వేళ మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకోవడం తీనరవ ఆందోళన కలిగిస్తోంది. మెయితీ, కుకీ వర్గాల మధ్య జరుగుతున్న ఈ ఘర్షణలను అదుపు చేసేందుకు మరోసారి ఆర్మీ, పారామిలిటరీ బలగాలు రంగంలోకి దిగాయి. రాజధాని ఇంఫాల్‌లోని న్యూచెకాన్ ప్రాంతంలోఉన్న లోకల్ మార్కెట్ స్థలం విషయంలో తాజాగా వివాదం చెలరేగింది. దీంతో ఇరు వర్గాలు మరోసారి బాహాబాహీకి దిగాయి. ఆందోళనకారులు పలు ఇళ్లకు నిప్పంటించారు. విషయం తెలుసుకున్న అధికారులు భద్రతా బలగాలను భారీగా మోహరించాయి. పరిస్థితి తీవ్రతరం కాకుండా కర్ఫ్యూ విధించారు. కర్ఫ్యూను సడలించగా దాన్ని రద్దు చేశారు. మణిపూర్‌లోని ఇంఫాల్ లోయ ప్రాంతంలో రాష్ట్రంలో 10 శాతం భూభాగంలో 90 శాతం మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ మెయితీ వర్గం వారు అత్యధికంగా నివసిస్తారు. రాష్ట్రంలోని 60 మంది ఎమ్మెల్యేల్లో 40 సీట్లు అక్కడి నుంచే ఉండటంతో రాజకీయంగానూ వారికి బలమైన పట్టు ఉంటుంది. ఇక మిగిలిన కొండ ప్రాంతాల్లో కుకీ, నాగాతో పాటు 30 రకాల ఆదివాసి తెగలున్నాయి. మెయితీలకు కొండ ప్రాంతాల్లో భూములు కొనేందుకు అనుమతి లేదు, కాని కొండ ప్రాంతాల్లో ఉన్నవారు లోయలో భూములు కొనడానికి అనుమతి ఇచ్చారు. మెయితీలు రిజర్వేషన్లకోసం పోరాడుతుండగా వారికి ఇవ్వవద్దని గిరిజన తెగలైన నాగా, కుకీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మెయితీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న అంశాన్ని పరిశీలించేందుకు కేంద్రానికి లేఖ రాయాలని మణిపూర్ హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో ఘర్షణలు మొదలయ్యాయి.

## తెలంగాణకు కేంద్రం అన్ని విధాలుగా సహకారం

### బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ

**హైదరాబాద్ మే 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలో లేకపోయినా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా సహకరిస్తుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రం తమ ఖాతాల్లో వేసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించకుండా తమ వంతు ఇవ్వాల్సి న నిధులను కూడా కేటాయించడం లేదన్నారు. రైతులకు తీవ్రంగా అన్యాయం చేస్తుందన్నారు. ప్రతి 40 కిలోల బ్యాగ్‌కు మూడు కిలోల తరుగు తీస్తూ, రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ప్రతిరోజు 18 గంటలకు అహర్నిశలు పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడిని తెలంగాణ ప్రజలు, బిజెపి శాఖ తరుపున అభినందలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎగిరే జెండా కాషాయ జెండా ఎగురవేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రజలకు తెలియజేయాలన్నారు.

## టిపిసిసి విస్తృత స్థాయి సమావేశంలో మూడు తీర్మానాలు ఆమోదించాం

### ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్ మే 22, ప్రభాతవార్త:** టిపిసిసి విస్తృత సమావేశంలో మూడు తీర్మానాలకు ఆమోదం తెలిపినట్లు ఏఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ వెల్లడించారు. టిపిసిసి విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత్ జోడో యాత్ర ఫలితాలను కర్ణాటక ఫలితాల రూపంలో చూశామన్నారు. చారిత్రక తీర్పు ఇచ్చిన కర్ణాటక ప్రజలకు టిపిసిసి అభినందిస్తూ తీర్మానం చేసిందన్నారు. తెలంగాణలో 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారని కెసిఆర్ ఒప్పుకున్నారన్నారు. కెసిఆర్ ప్రభుత్వాన్ని 30శాతం కమిషన్ ప్రభుత్వం అని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానం చేశామన్నారు. కర్ణాటలో 40శాతం కమిషన్ల ప్రభుత్వాన్ని దింపేసాం, ఇక తెలంగాణలోని 30శాతం కమిషన్ల ప్రభుత్వాన్ని దింపేస్తామన్నారు జూన్ 18న రాజీవ్‌గాంధీ కాంపిటీషన్ ఉంటుందన్నారు. యువత పెద్ద ఎత్తున పాల్గొనాలి కోరుతున్నామన్నారు. అడ్వాన్స్ కాంపెనింగ్, సామాజిక న్యాయం, సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని తీర్మానం చేశామన్నారు. మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీని గ్రామగ్రామానికి తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. దశాబ్దిదగా అనే పేరుతో ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. దశాద్ద కాలంలో శతాబ్దికి సరిపోయేందుకు సంపద కొల్లగొట్టారన్నారు. జూన్ 2న సోనియాగాంధీకి దన్యవాదాలు చెప్పే కార్యక్రమాలు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు.

## నాలా పనులను వేగవంతంగా పూర్తిచేయాలి

### ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోండి: మేయర్ గద్వాల విజయలక్ష్మి

**హైదరాబాద్ మే 22, ప్రభాతవార్త:** నగరంలో అసంపూర్తిగా ఉన్న నాలా పనులను వేగవంతంగా పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం గుగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ప్రతిరోజు మేయర్ ఆఫీసుకు వస్తున్న ఫిర్యాదులపై జోనల్ కమిషనర్/ సిఇ ఎస్ఎన్‌డిపిలతో సీమక్షించారు. వర్షాకాలంలో ఎన్ఎస్‌డిపి కింద నాలా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జోనల్ కమిషనర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. నల్లకుంట పద్మకాలనీలో మూసి నాలా రిటైనింగ్ వాల్ కూలిపోవడం ఘటనను సమీక్షించిన మేయర్ పది రోజుల్లో పనులు పూర్తిచేయాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పద్మాకాలనీ, వెజిటేబుల్ మార్కెట్, పాత రామాలయం, ఫివర్ ఆసుపత్రి నుంచి నాలా ప్రవహిస్తుందన్నారు. నాగమయ్యకుంట నుంచి పద్మకాలనీ వద్ద ఏర్పాటు చేసిన రిటైనింగ్ వాల్ ప్రతి సంవత్సరం వరదలతో దెబ్బతింటుది. ఈ దెబ్బతిన్న వాల్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం డీ సిల్టింగ్ అనంతరం పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాలా పనులను అధికారులతో ప్రతి రోజు సమీక్షి చేస్తూ నిర్దేశిత సమయానికి ముందే పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నల్లకుంట పద్మకాలనీలో జరుగుతున్న నాలా పనులపై మేయర్‌కు వివరించారు. ఎస్‌ఎన్‌డిపి కింద నల్ల కుంట పద్మకాలనీలో 880 మీటర్ల నాలా వెడల్పులో రెండు స్ట్రెచ్‌లో నిర్మిస్తున్నామన్నారు. ఇందులో మొదటి పద్మకాలనీ గురుదత్త స్కూల్ వద్ద 190 మీటర్ల పొడవు నాలాకు 71 మీటర్లు పూర్తి కాగా 119 మీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రెండవది హెరిటేజ్ నుంచి లెప్రసీ హాస్పిటల్ వరకు 690 మీటర్ల నాలా వెడల్పుకు 370 మీటర్లు పూర్తిగా కాగా 320 పురోగతితో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను వివరించారు. ఇక నుంచి ప్రతి రోజు ఎస్ఎన్‌డిపి పనులు, ఫిర్యాదులపై గుగుల్ మీట్, కాన్ఫరెన్సు నిర్వహిస్తామన్నారు.

## దోపిడీ చేస్తున్న మిల్లులపై చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ రైతు ఐక్యవేదిక డిమాండ్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో తరుగు పేరిట రైతులను దోపిడీ చేస్తున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తప్పు, తాలూ పేరుతో తరుగు విధిస్తూ రైతులను మోసం చేస్తున్నాయన్నారు. ఈ మేరకు ఐక్యవేదిక అధ్యక్షులు ఎస్ నర్సా రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడుతూ తాలు పేరుతో క్వింటాలుకు 5 నుండి 7 కిలోల వరకూ రైస్ మిల్లర్లు తరుగు తీయడం దారుణమన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను ఇష్టానుసారం దోచుకుం టున్నారని ఆరోపించారు. అక్రమాలను అడ్డుకోవాల్సి న అధికారులు, ప్రజా ప్రతి నిధులు మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు నష్టం చేకూరుస్తున్నారని వ్యాఖ్యానించారు.

## సర్కార్‌కు గుదిబండగా కార్పొరేషన్లు

### ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అప్పులు

### నిలిచిపోయిన కార్యకలాపాలు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** తెలంగాణలో కార్పొరేషన్లు రాష్ట్ర సర్కార్‌కు గుదిబండగా తయారయ్యాయి. రాష్ట్ర అవసరాల కోసం కార్పొరేషన్ల ద్వారా తీసుకొచ్చిన అప్పులు రోజు రోజుకూ భారమవుతూన్నాయి. బహిరంగ మార్కెట్‌లో బాండ్ల వేలం ద్వారా అప్పులు చేసేందుకు కేంద్రం విధించిన ఆంక్షల నేపథ్యంలో ఈ కార్పొరేషన్ల పరిస్థితి అయోమయంగా తయారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో పాటు, కార్పొరేషన్ల పేరుతో బడ్జెట్ వెలుపల అప్పులు చేసే అవకాశం లేక ఇప్పుడు వీటి కార్యాకలాపాలు దాదాపు నిలిచిపోయాయి. ఎఫ్‌ఆర్‌బిఎంకు సంబంధం లేకుండా ఉంటుందని బడ్జెట్ వెలుపల నుండి అదనంగా అప్పులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వివిధ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో రైతు బంధు, సాగు నీటి ప్రాజెక్టులతోపాటు, ఇతర అవసరాలకు అప్పులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్, హౌసింగ్ కార్పొరేషన్, తెలంగాణ వాటర్ గ్రిడ్ కార్పొరేషన్, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల కారొ ్పరేషన్, కాళేశ్వరం కార్పొరేషన్ తదితర కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. గత ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల ద్వారా 94 వేల కోట్ల రూపాయల మేర అప్పులు సేకరించారు. ఈ కార్పొరేషన్ల ద్వారా చేసిన అప్పులకు రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీ ఉంటూ అప్పులు తీసుకుంది. వాటిలో కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా 24 వేల కోట్ల రూపాయలు, మిషన్ భగీరథ, వాటర్ గ్రిడ్ కార్పొరేషన్ కోసం 20 వేల కోట్ల రూపాయలు, దేవాదుల కార్పొరేషన్ నుండి 20 వేల కోట్ల రూపాయలు, హౌసింగ్ కార్పొరేషన్‌కు 10 వేల కోట్ల రూపాయలు, పాలమూరు, రంగారెడ్డి కార్పొరేషన్ ద్వారా 10 వేల కోట్ల రూపాయల మేర అప్పులు చేసింది. ఇప్పుడా అప్పులన్నీ దాదాపు లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా చేరినట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. కార్పొరేషన్ల ద్వారా కొత్త అప్పులు చేసే అవకాశం లేకపోగా, పాత అప్పుల కిస్తీలు, వాటికి వడ్డీలను చెల్లించాల్సి ఉండ టంతోపాటు, ఇదే సమయంలో వాటికి పని లేక నిర్వీర్యంగా ఉన్న నేపథ్యంలో అవే పెద్ద భారంగా తయారై ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

## ఎన్నికల ఏర్పాట్ల కోసం పోలీసు శాఖ ముందస్తు కసరత్తులు

### ఎస్‌పిలు, కమిషనర్లతో డిజిపి పునశ్చరణ కార్యక్రమం



రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్ల కోసం ఎస్‌పిలు, కమిషనర్లతో జరిగిన డిజిపి పునశ్చరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిజిపి అంజనీకుమార్. చిత్రంలో శాంతి భద్రతల చీఫ్ సంజయ్ కుమార్‌జైన్, నిఘా విభాగం అధిపతి అనిల్ కుమార్ తదితరులు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో ఐదారు నెలలో సాధారణ ఎన్నికలు వుండడంతో ఇందుకోసం పోలీసు శాఖ ముందస్తు ఏర్పాట్లు చేబట్టింది. ఇందు లో భాగంగా డిజిపి అంజనీ కుమార్ సోమవారం నాడు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లతో ఎన్నికలకు సంబంధించిన పునశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీసులకు ప్రతీసారి కొత్త సవాళ్లు ఎదురవుతుంటాయని అన్నారు. రాష్ట్రంలో ఐదారు నెలలో సా ధారణ ఎన్నికలు జరగనుండడంతో ఎన్నికల నియమావళి అమలు, దీనికి సంబంధించి పాత కేసుల వంటి అంశాలను ముందుగానే అందరు తెలుసుకుని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎన్నికలు జరిగేందుకు ఐదారు నెలల వ్యవధివున్నా జూన్, జూలై నెలలో అమలు చేయాల్సి న ప్రణాళికను రెడీ చేయాలని ఆయ న కోరారు. ఎన్నికల నియమావళి, సిబ్బంది తరలింపుకు సంబంధించిన ఏర్పాట్లు, కేంద్ర బలగాలతో సమన్వయం చేసుకునే విషయంలో ముందుగానే స్పష్టత కలిగి వు ండాలని ఎస్‌పిలు, కమిషనర్లను డిజిపి కోరారు. ప్రస్తుతం చాలాచోట్ల ఎస్‌పిలు, కమిషనర్లు కొత్తవారు వున్నందున గతంలో ఎన్నికల నిర్వహణలో అనుభవం వున్న పో లీసుల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. కాగా ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం తరపున పరిశీలకులుగా వెళ్లిన అద నపు డిజి సౌమ్యా మిశ్రా, డిఐజి అవినాష్ మొహంతిలు అక్కడి ఎన్నికల నిర్వహణలో తమ అనుభవాలను వివరించారు. ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్రతో పా టు పోలింగ్ రోజున చేబట్టాల్సి న చర్యలు, భద్రతాపరంగా తీసుకోవాల్సి న ఏర్పాట్లు ఎలా వుండాలనే దానిపై వారు వివరించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో చేబ ట్టాల్సి న ప్రత్యేక చర్యలను సౌమ్యా మిశ్రా ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ రోజున చేబట్టిల్సి న చర్యలు, అనంతరం కౌంటింగ్ కేంద్రాలకు ఈవిఎంల తరలింపు, ఓట్ల లెక్కింపు రోజున చేయాల్సి న బందోబస్తు గురించి కూడా ఆమె వివరించారు. నిఘా విభాగం అధిపతి అనిల్‌కుమార్ మాట్లాడు తూ ఎన్నికల నాటికి ఆయా ప్రాంతాలలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరిని బదిలీ చేయాల్సి వుంటుందని, ఇం దుకు సంబంధించిన ఏర్పాట్లు ముందుగానే చేయాలని సూచించారు. సిఐడి చీఫ్ మహేష్ భగవత్ మాట్లాడుతూ ప్రతీ పోలీసు స్టేషన్‌లో ఒక గైడ్ వుండాలని, ఈ గైడ్ కేంద్ర బలగాలను స మన్వయం చేసుకునే వి ధంగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌పిఎ డైరక్టర్ సందీప్ శాండిల్యా, శాంతి భద్రతల చీఫ్ సంజయ్ కుమార్ జైన్, టిఎస్ఎస్‌పి చీఫ్ స్వాతి లక్రా, నిఘా విభాగం డిఐజి కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో గెలిచాం.. తెలంగాణలోనూ గెలుస్తాం

### పార్టీలో క్రమశిక్షణ ముఖ్యం

### టిపిసిసి విస్తృతస్థాయి సమావేశంలో

### రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** కర్ణాటక ఎన్నికలలో కష్టపడి గెలిచామని, తెలంగాణలోనూ గెలుస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. సోమవారం టిపిసిసి విస్తృతస్థాయి సమావేశం గాంధీభవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేతో పాటు టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, షబ్బీర్ అలీ, సంపత్‌కుమార్, మధుయాష్కి, అంజన్‌కుమార్ యాదవ్, రోహిత్‌చౌదరి, నదీమ్ జావిద్, మహేష్‌కుమార్‌గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు ఠాక్రేమాట్లాడుతూ పార్టీని నష్టపరిచే విధంగా ఎవరూ చేసినా తీసుకుంటున్నామన్నారు. పార్టీలో క్రమశిక్షణ ఉండాలన్నారు. పొరపాటున కూడా పార్టీ డ్యామేజ్ అయ్యే పనులు ఎవరూ చేయకూడదన్నారు. కర్ణాటలో కష్టపడి గెలిచామని, తెలంగాణలో కూడా గెలుస్తామన్నారు. కెసిఆర్ కాంగ్రెస్‌కి మాత్రమే వ్యతిరేకంగా ఉన్నాడన్నారు. బిజెపితో ఫ్రెండ్లీగా ఉన్నాడని అన్నారు. కెసిఆర్, బిజెపి తెరచాటు స్నేహానికి ప్రజలకి వివరించారన్నారు. రాష్ట్రంలోని సమస్యలపై అన్ని స్థాయిల్లో పోరాట కార్యక్రమాలు ఉండాలన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఎన్నికు దగ్గరపడుతున్నాయని, ఎన్నికలు దగ్గరపడుతున్నాయని, ఎన్నికలకు అందరూ సిద్దంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం కల్పించాలన్నారు. పార్టీ పదవుల్లో ఉండి పనిచేయని వాళ్లపై చర్యలు తీసుకుంటాం. బాధ్యత ఇచ్చిన తరువాత పని చేయలేకపోతే చెప్పేయండి. బాధ్యతలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పనిచేయని వారిని పక్కన పెట్టేద్దాం కష్టపడి వారికి టికెట్లు వస్తాయన్నారు. సర్వేల ఆధారంగా టికెట్లు వస్తాయన్నారు. పరిచయాలు ఉన్నంత మాత్రాన టికెట్లు రావు అన్నారు.

## డిజిపితో మేజర్ జనరల్ రాకేష్‌మనోచా భేటీ

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** డిజిని అంజనీకుమార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా మిలటరీ విభాగం మేజర్ జనరల్ రాకేష్ మనోచా సోమవారం భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఇరువురు అధికారులు పలు అంశాలపై చర్చించారు, ఈ సందర్భంగా కరోనా సమయంలో హైదరాబాద్ పోలీసులు సాధించిన విజయాలు, హైదరాబాద్ పోలీసు చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని డిజిపి అంజనీ కుమార్, మేజర్ జనరల్ మనోచాకు బహుకరించారు.

## ఎంవి భాగ్యరెడ్డికి నివాళులు అర్పించిన కమిషనర్ లోకేశ్‌కుమార్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** సంఘ సంస్కర్త ఎంవి భాగ్యరెడ్డివర్మ 135వ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిహెచ్ఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అటరాని కులాల ఉద్దరణ, దేవదాసి, జోగిని వంటి దురాచారాలను నిర్మూలనకు విశేష కృషి చేశారన్నారు. హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలు స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవిడిఎం డైరక్టర్ ప్రకాశ్‌రెడ్డి, అదనపు డైరక్టర్‌లు ప్రియాంక ఆలా, సరోజ, కృష్ణ, విజయలక్ష్మి, జయరాజ్ కెనడీ, పంకజ, డా.పద్మజ, సరోజాని దేవి, వెంకటేశ్వర్లు, రమణ, జీవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

### జిహెచ్ఎంసిలో అమలవుతున్న పథకాల అధ్యయానికి

## ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు శిక్షణ నిమిత్తం జిహెచ్ఎంసిలో జరుగుతున్న వివిధ పథకాల అమలు తీరును జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వివిధ జిల్లాలో ట్రైనీ అసిస్టెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న 2021 బ్యాచ్ ఐఎఎస్ అధికారులు ఈనెల 22, 23 తేదీలలో రెండు రోజుల ఉపాటు జిహెచ్ఎంసిలో అమలవుతున్న పథకాలను అధ్యయనం చేయడానికి వచ్చారు. రెండో క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేయనున్నారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శానిటేషన్, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, యుబిడి, హరితహారం, కమ్యునిటీ డెవలప్‌మెంట్, ఐటి రెవెన్యూ, టాక్స్, స్పోర్ట్, ఎస్ఆర్‌డిపి, సిఆర్ఎంసి, టౌన్‌ప్లానింగ్, టిడిఆర్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డిఆర్ఎఫ్ అమలు తీరును ఆయా హెచ్ఓడిలు వివరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్‌లు లేవనెత్తి పలు సందేహాలకు కమిషనర్ నివృత్తి చేశారు. ట్రైని ఐఏఎస్ అధికారులు రాధిక గుప్త, శ్రీజ, ఫైజాన్ అహ్మద్, గౌతమి, పర్మర్ పింకేష్‌కుమార్, లలిత్‌కుమార్, లెనిన్ వత్సల్ టోప్పో, శివేంద్రప్రతాప్‌లు పాల్గొన్నారు. వీరితో జిహెచ్ంఎసి అధికారులు ఈవిడిఎం డైరక్టర్ ప్రకాశ్‌రెడ్డి, అదనపు డైరక్టర్‌లు ప్రియాంక ఆలా, సరోజ, కృష్ణ, విజయలక్ష్మి, జయరాజ్ కెనడీ, సిసిపి దేవేందర్‌రెడ్డి, సిఈ దేవానంద్, జోనల్ కమిషనర్ పంకజ, సురేష్‌కుమార్, ఎస్‌సి విద్యాసాగర్, యుసిడి ప్రాజెక్టు డైరక్టర్ సౌజన్య, జెసిలు మంగతాయారు, సంధ్యలు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లతో మంత్రి గంగుల కమలాకర్ చర్చలు సఫలం



### సమ్మె విరమిస్తున్న ప్రకటన

### 22 సమస్యలపై 20 పరిష్కారానికి సానుకూలం

### గౌరవ వేతనం, కమీషన్ పెంపు సిఎం దృష్టికి తీసుకెళ్తాం

**హైదరాబాద్ మే 22, ప్రభాతవార్త:** పేద ప్రజలకు నిత్యావసర సరుకులను సకాలంలో అందించవలసిన కనీస బాధ్యత, కర్తవ్యం తెలంగాణ ప్రభుత్వానికి ఎంతైతే ఉందో రేషన్ డీలర్లపై అంతే బాధ్యత ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పేద ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడం ఒక సామాజిక బాధ్యత అనే విషయాన్ని డీలర్లు మరవద్దని ఈ బాధ్యతను విస్మరించి రేషన్ బియ్యం పంపిణీకి ఆటకం కలిగించేలా రేషన్‌డీలర్లు సమ్మెకు పిలుపునివ్వడం బాధకరం అన్నారు. వచ్చేనెల 5వ తేది నుంచి రేషన్ డీలర్లు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సచివాలయంలో మంత్రి తెలంగాణ రేషన్ డీలర్ల ఐక్యకారాచరణ కమిటీతో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు వినయ్‌భాస్కర్, పద్మాదేవేందర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, జెఏసి చైర్మన్ నాయికోటి రాజు, వైఎస్ చైర్మన్ రమేష్‌బాబు, కన్వినర్ దుమ్మాటి రవీందర్, కో కన్వినర్ గడ్డం మల్లిఖార్జున్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జెఏసిసి ఇచ్చిన 22 డిమాండ్‌లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్దంగ ఖఉందన్నారు. మొత్తం 22 సమస్యలపై 20 సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నామన్నారు. ఇందుకు సంబంధించి వారం రోజుల్లో ఉత్తర్వులను జారీ చేస్తామన్నారు. గౌరవ వేతనం, కమిషన్ పెంపు, ఈ రెండు సమస్యలను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు.

**సమ్మె విరమిస్తున్నాం**

మంత్రి హామి మేరకు సమ్మెను విరమిస్తున్న మంత్రి సమక్షంలో జెఏసి ప్రతినిధులు ప్రకటించారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌పై నమ్మకం ఉందని, ముఖ్యమంత్రి తమ సమస్యలను పరిష్కరిస్తారన్న నమ్మకంతో సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

## సెల్‌ఫోన్ చోరీలు, మిస్సింగ్ కేసుల విచారణలో సిఐడి కొత్త ఒరవడి

### సిఇఐఆర్ పోర్టల్‌తో నెల రోజుల వ్యవధిలో 1,016 ఫోన్లు బాధితులకు అందజేత

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** సెల్‌ఫోన్‌ల చోరీలు, మిస్సింగ్ కేసుల విచారణలో, బాధితులకు న్యాయం చేకూర్చడంలో సిఐడి కొత్త ఒరవడిని సృష్టించింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహకారంతో దేశ వ్యాప్తంగా ఏర్పాటైన సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సిఈఐఆర్)ను వాడి నెల రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా 1016 సెల్‌ఫోన్ చోరీల మిస్టరీని చేధించడంతో వాటిని బాధితులకు అందచేసింది. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి చీఫ్ మహేష్ భగవత్ సోమవారం మీడియా కు వెల్లడించారు. సెల్‌ఫోన్ చోరీలు, మిస్సింగ్ కేసులను తీవ్రంగా పరిగణించిన కేంద్రం ఈ తరహా కేసులను వేగంగా పరిష్కరించేందుకు సిఈఐఆర్‌ను ఇటీవలే ప్రారంభి ంచడం తెలిసిందే. తెలంగాణ వరకు వస్తే ఈ పోర్టల్ గత ఏప్రిల్ నెల 13వ తేదీన ప్రారంభం కాగా దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 31 పోలీసు యూనిట్లలోని 780 పోలీసు స్టేషన్లకు సిఈఐఆర్ యూజర్ ఐడిలను ఏప్రిల్ 18వ తేదీన అందజేశారు. ఈ సందర్భంగా అన్ని పోలీసు స్టేషన్లలో ఎంపిక చేసిన వారికి దీని అమలుకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. కాగా సిఈఐఆర్ పోర్టల్‌కు రాష్ట్ర వ్యాప్త నోడల్ అధికారిగా సిఐడి చీఫ్ మహేష్ భగవత్ వ్యవహరిస్తున్నారు. కాగా సిఈఐఆర్ పోర్టల్ అమలు తెలంగాణలో మొద ట పైలట్ ప్రాజెక్టు నెల రోజుల ముందే చేబట్టారు. వాస్తవంగా ఈ పోర్టల్ ఈ నెల 17వ తేదీన దేశ వ్యాప్తంగా అధికారికంగా ప్రారంభమయ్యి ంది. కాగా తెలంగాణ వరకు వస్తే గత ఏప్రిల్ నెల 20వ తేదీ నుంచి మే నెల 22వ తేదీ వరకు సిఈఐఆర్ పోర్టల్ అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 16011 సెల్ ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ అయినట్లు గుర్తించారు. ఇందులో గుర్తించేందుకు అవకాశం వున్నవి 4226గా తేలింది. ఇదే సమయంలో 1016 ఫోన్లను ఆయా ప్రాంతాల లో స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. మొత్తం మీద సిఈఐఆర్ పోర్టల్ అమలులో భాగంగా సెల్‌ఫోన్ చోరీ లేదా మిస్సింగ్ కేసుల పరిష్కారం 24.05 శా తంగా వుంది. మొత్తం సెల్‌ఫోన్ రికవరిలో సైబరాబాద్‌లో 149 వుండగా, వరంగల్‌లో 91, కామారెడ్డిలో 79 వున్నాయి. కాగా సిఈఐఆర్ పోర్టల్ రాష్ట్రంలో సమర్థవ ంతంగా అమలులో సెక్యూరిటీ డిడిజి కె.రాజశేఖర్, డైరక్టర్ మురళీకృష్ణ, అదనపు డైరక్టర్ రాఘవరెడ్డి, సైబర్ క్రైం ఎస్‌పి లావణ్య జాధవ్ కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలో సిఈఐఆర్ పోర్టల్ పక్కాగా అమలవుతున్నందుకు డిజిపి అంజనీ కుమార్ సిఐడి బృందాన్ని అభినందించారు.

## జిఓ 111 ఎత్తివేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

### కెసిఆర్‌ను కలిసిన ఎంపి రంజిత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి గుదిబండగా మారిన జీవో 111ను పూర్తిగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సోమవారం సచివాలయంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో 111 జీవో పరిధిలోని 84 గ్రామాల ప్రజాప్రతినిధులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సిఎం కెసిఆర్ 111 జీవోను ఎత్తివేసి, మాట నిలుపుకొన్నారని వారంతా సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కెఎస్ రత్నం, గుణేష్‌గుప్తా, శివారెడ్డిలతో పాటు 111 జీవో పరిధిలోని గ్రామాల మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గత మూడు దశాబ్దాల పాటు చేవెళ్ల ప్రాంత ప్రజల అభివృద్ధికి గుదిబండగా ఉన్న 111 జీవో ఎత్తి వెయ్యడం హర్షణీయమని రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. 111 జీవో ఎత్తి వెయ్యడంతో చేవెళ్ల,రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న దాదాపు 84 గ్రామాల ప్రజలకు అనేక రకాలుగా లబ్ధి పొందనున్నట్లు ఆయన వెల్లడించారు.

## లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కోసం పోరాడుతా

### వైఎస్సార్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

### ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా



మహాధర్నాలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

**షాద్‌నగర్, మే 22, ప్రభాతవార్త :** వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా షాద్‌నగర్ ప్రాంత ప్రజలకు మాట ఇస్తున్నా... లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కోసం తమ పార్టీ తరుపున ఎన్ని పోరాటాలైన చేస్తామని, ప్రజలకు అండగా ఉంటామని వైఎస్సార్‌టిపి అధినేత్రి వైఎస్ షర్మిల హామీ ఇచ్చారు. రైతుల కష్టాలు తెలిసిన దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలమూరు రైతుల బాగు కోసం పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు చేపట్టాలని ఆకాక్షించారన్నారు. తెలంగాణ వచ్చాక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కేవలం రాజకీయ స్వలాభం కోసం, కమీషన్ల కోసం పనిచేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సోమవారం ప్రధాన ప్రతిపక్షాలు, పాలమూరు అధ్యయన వేదిక, ప్రజా, కుల సంఘాల ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నాకు హాజరైన వైఎస్సార్‌టీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ షర్మిలమ్మకు ఘన స్వాగతం పలికారు. అనంతరం షాద్‌నగర్ పట్టణ ముఖ్యకూడలిలో ఉన్న వైఎస్సార్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమా నికి ప్రొఫెసర్ హారగోపాల్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్, వైఎస్సార్‌టీపీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎం.డి.ఇబ్రహీం, సీపీఎం, సీపీఐ నాయకులు, బీఎస్పీ నాయకులు, ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, ప్రజా,కుల సంఘాల ముఖ్యనాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టిపి అధినేత్రి వైఎస్ షర్మిల ప్రసంగిస్తూ... పోరాడి తెచ్చుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అప్పుల రాష్ట్రంగా తయారైందని మండిపడ్డారు.

గత ఎన్నికల్లో ఓట్ల లబ్ధి కోసం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను కుర్చివేసుకొని నిర్మించి తీరుతామని హామీలు గుప్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఏమయ్యారని ఆమె ప్రశ్నించారు. ప్రాజెక్టులను రీడిజైన్ల పేరుతో కమీషన్లు సిఎం వెనుకేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. నీళ్ల నిధులు నియమాకాల కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ వాటిని పూర్తిగా విస్మరించారన్నారు.

ప్రొఫెసర్ హారగోపాల్ మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇక్కడి ప్రాంత ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి అయిన తరువాత వాటిని పూర్తిగా విస్మరించారని అన్నారు. తాను ఇక్కడి మొగిలిగిద్ద వాసినేనని ఇక్కడ తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఉందని ఆయన అన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ... స్థానిక ప్రజాప్రతినిధులకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై ఎలాంటి చిత్తశుద్ధిలేదని అన్నారు. కేవలం ప్రతిపక్షాలకు ప్రజా సంఘాలకు మాత్రమే ఇక్కడి ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉందని అందుకే రిజర్వార్ గురించి పోరాటాలు చేస్తున్నామని అన్నారు. ప్రతిపక్షాలు ఏకమై విమర్శిస్తుంటే అధికార పార్టీ నాయకులకు ఏం మాట్లాడాలో తెలియక అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, వైఎస్సార్టీపీ, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, ప్రజా, కుల సంఘాల నాయకులు, పాలమూరు అద్యాయన వేదిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల వంటకాలతో 14 దేశాధినేతలకు ప్రధానిమోడీ విందు

**పోర్ట్ మార్స్‌బీ (పపువాన్యూగినియా):** పపువా న్యూగినియా రాజధానిలో జరిగిన 14 ద్వీపదేశాల ఫిపిక్‌సదస్సులో పాల్గొన్న ప్రధానిమోదీ తన మొట్టమొదటిసారిగా సందర్భంగా 14 దేశాధినేతలకు విందు ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన మిల్లెట్స్ ఇయర్‌ను పరిగణనలోనికి తీసుకుని భారతీయ సాంప్రదాయ వంటకాలతో నోరూరించేవిధంగా ప్రధాన వంటకాలను విందులో నేతలకు అందించారు. పోర్ట్‌మార్స్‌బీలోని మోదీ బస కోసం ఏర్పాటుచేసిన అపెక్ హౌస్‌లోనే ఈ విందును ఏర్పాటుచేసారు. గుజరాత్‌లో ప్రసిద్ధి చెందిన వంటకం ఖాండ్వీ, మిల్లెట్‌ప్రో, వెజిటబుల్ కొల్హాపురి, దాల్ పంచ్మేల్, రాగిగట్టా కూర, మిల్లెట్ బిర్యానీలను తయారుచేసారు. మసాలా చాస్ (క్రీమ్‌తో ఉన్న పెరుగు, భారతీయ సుగంధ ద్రవ్యాలతోచేసిన సమ్మర్‌డ్రింక్), పాన్ కుల్ఫీ, మాల్పువా, రబ్డీలతోపాటు పలు వంటకాలను అతిథులకు వడ్డించారు. వీటితోపాటు మసాలా టీ, గ్రీన్‌టీ, మింట్‌టీలను కూడా అందించారు. భారత్ పసిఫిక్ ఐలాండ్స్ కూటమిలో భారత్‌తోపాటు 14 పసిఫిక్‌దేశాలున్నాయి. 2014లో తన ఫిజీ పర్యటన సందర్భంగా ఈ కూటమిని మోడీ ఏర్పాటు చేసారు. ఈ కూటమిలో కుక్ ఐలాండ్స్, ఫిజీ, కిరిబాటి, రిపబ్లిక్ ఆఫ్ మార్షల్ఐలాండ్స్, మైక్రోనేసియా, నౌరు, నియూ, పలావ్, పపువాన్యూగినియా, సమోవా, సోలొమన్ ఐలాండ్స్, టోంగా, తువాలు, వనువాటు దేశాలున్నాయి. విందులో పాల్గొన్న నేతలకు పాన్‌పసాలను కూడా అందించడం భారతీయ సాంప్రదాయాలకు నిదర్శనంగా నిలిచింది. పపువాన్యూగినియాకు మొట్టమొదటి సారిగా ప్రధానిమోదీ వచ్చారు. ఈ సందర్భంగానే ప్రధాని జేమ్స్ మారాపే మోడీకి ఎయిర్‌పోర్టులో పాదాభివందనంచేసి ఆశీస్సులు పొందారు. ఎంతో ఆదరంతో మోడీ గినీ ప్రధాని ఆలింగనం చేసుని అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఫిపిక్‌సదస్సులో పాల్గొని 14దేశాల ఆర్థిక స్థితిగతులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సమిష్టిపరస్పర సహకారం అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు.

**ప్రభాతవార్త ప్రతినిధి, ఖమ్మం:** కాంట్రాక్టు పనులలో అక్రమాల ద్వారా పాపపు సొమ్ము కూడబెట్టుకున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక ఉగ్రవాదిగా మారి రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నాడని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దుయ్యబట్టారు. పొంగులేటి డబ్బులు ఖమ్మం జిల్లా ప్రజల ఎడమ కాలితో సమానమని అన్నారు. నిన్న ఖమ్మంలో జరిగిన పొంగులేటి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రిపై బచ్చాగాని నిలబెట్టైనాను గెలిపిస్తానని శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలపై సోమవారం మంత్రి ఘాటుగా స్పందించారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ సందర్భంగా పొంగులేటి వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. తనపై ఒక బచ్చాగాణ్ని నిలబెట్టి గెలిపిస్తానని చేసిన సవాల్‌పై భగ్గుమన్నారు. రాజకీయాల్లో నువ్వే ఒక బచ్చావు.. 60 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ కుటుంబం నుంచి వచ్చాను. పీడిత, తాడిత ప్రజల కోసం కొట్లాడినవాళ్లం. నా తండ్రి ఎన్నో ఉద్యమాలు నడిపారు. మరి నీ చరిత్ర ఏమిటని నిగ్గదీశారు. 2016లో టీఆర్ఎస్ పార్టీలోకి రాకముందు నీ ఆడిట్ రిపోర్ట్ బయట పెట్టు. ఇప్పుడు రిపోర్టు పెట్టు వేల కోట్లు ఎలా సంపాదించావు. కేసీఆర్, కేటీఆర్ చలవతోనే కదా? పార్చునర్ కారులో తిరిగిననీవు నేడు ఫెరారీ, ఆడి కార్లలో తిరుగుతున్నావు. నిన్ను

# పొంగులేటి ఆర్థిక ఉగ్రవాది

- కాంగ్రెస్ పంచన చేరడానికే ఈ కారుకూతలు
- పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై మంత్రి పువ్వాడ ధ్వజం

వదిలి పెట్టం అంటూ వార్నింగ్ ఇచ్చారు. నిన్ను తరిమి కొట్టే రోజు ఎంతో దూరం లేదు అని తన దైన శైలిలో పొంగులేటిపై పువ్వాడ తన ఉగ్రరూపం చూపించారు. అడ్డగోలుగా అడ్డదారిలో డబ్బు సంపాదించిన నువ్వు ఆ డబ్బు ఉంది కదా అని విర్ర వీగుతున్నావు. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కినట్లు, కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీసిన చందంగా మాట్లాడటం మానుకోవాలని మంత్రి అజయ్ పొంగులేటికి హితవు పలికారు. ఖమ్మం చుట్టు ఉన్న గుట్టల మట్టి కాజేస్తున్నావని అబద్దపు ఆరోపణలు చేస్తున్నావు. ఆ గుట్టల మట్టి నేషనల్ హైవే కోసం తీసుకుని పోతున్నారు. అభివృద్ధిలో భాగంగానే అది జరుగుతుంది. దానికి నాకు సంబంధం లేదు. ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా చేస్తున్న పనులను వక్రీకరించి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. మట్టి క్లియర్ అయిన తర్వాత ఆ భూములను పేదలకు పంచుతామని పేర్కొన్నారు. డిసెంబర్ నెలాఖరు వరకు పోలీసుల ఎస్కార్ట్‌తో ముందు వెనుక వాహనాలతో తిరిగిన నువ్వు పోలీసులను విమర్శిస్తావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018 ఎన్నికల్లో నీ మనుషులు అనుకున్న వారికి ఐదుగురికి టికెట్స్ ఇస్తే గెలిపించలేక పోయావు. పైగా వైరాలో పార్టీ అధికార అభ్యర్ధి మదన్‌లాల్‌ను ఓడించి అక్కడ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తిని గెలిపించావు. మధిరలో లింగాల కమల్‌రాజ్‌ను గెలిపించలేకపోయావు. అయినప్పటికీ నీలో మార్పు రాలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాతా మధుకు వ్యతిరేకంగా పనిచేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్ధులకు వ్యతిరేకంగా ఉన్న అభ్యర్థులకు వ్యతిరేకంగా డబ్బులు ఇచ్చావు. ఇందుకు సాపోరావు, మేయర్, కమర్తపు మురళిలు సాక్షం. నీ డబ్బులు అమ్ముడుపోయే నాయకులు ఇక్కడ లేరు. నలుగురికి డబ్బులు ఇచ్చి సభలు పెట్టి అదే గొప్పగా ఫీలవుతున్నావు. సభ పెట్టితే ఖాళీ కుర్చీలను చూసి ఆ ప్రస్టేషన్‌లో నన్ను తిడుతున్నావు. ఏ రాజకీయ పార్టీలకు పోవాలో తెలియన ప్రస్టేషన్‌లో ఉన్న వ్యక్తివి అని పొంగులేటిపై ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ అభ్యర్థులను ఇదే పార్టీలో ఉండి ఓడించిన ఘనమైన చరిత్ర నీదని గుర్తు చేశారు. 2018లో నువ్వు చేసిన పిచ్చి పనికి 2019లో నీకు సీటు రాకుండా చేసింది. ఇప్పుడేమో పోదుస్తా, కురుస్తా అంటున్నావు. నీవు కాంగ్రెస్‌లోకి పోతున్నావు, అక్కడ కూడా ఇదే కొనసాగిస్తే నీ పని అయిపోవడం ఖాయమని గుప్పిస్తున్నాడే సెటైర్లు వేశారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, బచ్చు విజయ్‌కుమార్, కమర్తపు మురళి, కర్నాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మురళీధరరావును మాదరి భాగ్యరెడ్డివర్మ జీవితసాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న గౌరీశంకర్ తదితర ఉత్సవ కమిటీ కార్యవర్గం

## దళిత సంఘాల నిరసనల మధ్య భాగ్యరెడ్డివర్మ 135వ జయంతి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, ఆది-హిందూ సోషల్ సర్వీస్‌లీగ్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సోమవారం రాత్రి జరిగిన భాగ్యరెడ్డివర్మ 135వ జయంతి దళిత సంఘాల నిరసన మధ్య రసాభాసగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వపరంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆహ్వానపత్రంలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి కెసిఆర్ మొదలుకొని వివిధ అతిథుల స్థాయిలో ఎంతోమంది రాష్ట్ర, కేంద్రమంత్రుల పేర్లు ఉన్నా ఏ ఒక్కరూ హాజరు కాకపోవడం నిరసనకు దారితీసింది. భాగ్యరెడ్డివర్మ పేరుతో ప్రతిష్ఠాత్మకంగా అందజేసే అవార్డుల ప్రదానోత్సవ ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతరత్రా నాయకులెవ్వరూ హాజరు కాకపోవడం దళితులను అవమానపరిచినట్లేనని వారు ఆందోళన వ్యక్తపరిచారు. ఇది భాగ్యరెడ్డి వర్మ జయంతి సభకాదు ఆత్మఘోష సభగా అభివర్ణిస్తూ దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తూ నిరసన ఆవేదన వ్యక్తపరిచారు. చివరిగా ఈ సమావేశానికి తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను పొగుడుతుండడంతో వారు ఆయన ప్రసంగాన్ని అడ్డుకొని అసలు దళితులకు ఏమేమి చేసారని ప్రశ్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే గౌరీశంకర్ తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించేశారు. అనంతరం గౌరీశంకర్, జయంతి నిర్వహణ కమిటీ కార్యవర్గ సభ్యులు ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు జి.మురళీధరరావుకు మాదరి భాగ్యరెడ్డివర్మ జీవిత సాఫల్య పురస్కారం-2023ను ప్రదానం చేశారు.



## కెపిహెచ్‌బిలో కొత్త వైబ్రంట్ సమ్మర్ స్ప్రింగ్ నెక్సస్ మాల్ 2

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** హైదరాబాద్ కెపిహెచ్‌బిలోని సాండ్ నెక్సస్ మాల్ 2లో కొత్త వైబ్రంట్ సమ్మర్ స్ప్రింగ్ సేకరణలు చోటు చేసుకున్నాయి. ఈ గ్రాండ్ లాండ్‌లో హైదరాబాద్ సిపి వి ఆనంద్ భార్య లలితా ఆనంద్ తో పాటు, రిపబ్లిక్ ఆఫ్ టర్కీ కాన్సులేట్ జనరల్, టీవీ ఆర్టిస్ట్‌లు, టాప్ మెడల్స్ పాల్గొన్నారు.

సాండ్ షోరూంలో మన కళాత్మక వారసత్వాన్ని ప్రతిబింబించే లగ్జరీ రోజువారీ దుస్తులు అందుబాటులో ఉంచారు. సాండ్ లక్ష్యం ప్రాచీన సంప్రదాయాలతో ప్రేక్షకుల ఇంద్రియాలను పట్టుకోవడమే నని సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, హైదరాబాద్‌లో స్టోర్ ప్రారంభించిన తర్వాత కెబిహెచ్‌బి నెక్సస్ మాల్ 2వ అంతస్తులో ఏర్పాటు చేసిన సాండ్ షోరూం 26వ స్టోర్ అని యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా స్టోర్ యజమానులు ప్రవీణ్‌గుప్తా, జ్యోతి గుప్తా మాట్లాడుతూ డిజైనర్ మహిళల దుస్తులు కోసం వన్ స్టాప్ గమ్యస్థానం అన్నారు. ఈ స్టోర్‌లో కుర్తా సెట్లు, తునిక్స్, దుస్తులు, చీరలు, లెహెంగాస్ వంటి అనేక రకాల సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు.

# తొమ్మిదేళ్లలో 20 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు

### వైద్యశాఖలోనే 22,263 పోస్టుల భర్తీ: మంత్రి హరీశ్‌రావు

### అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామకపత్రాల అందజేత

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మే 22, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వాలు తెలంగాణలో 60ఏళ్ల కాలంలో 3 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం 9ఏళ్లలో 20 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకున్నామని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీష్‌రావు అన్నారు. కాలేజీలు ఏర్పాటు చేయడంతో పాటు కేవలం వైద్య ఆరోగ్య శాఖలోనే గత 9ఏళ్లలో 22,263పోస్టులను భర్తీ చేసుకున్నామని, మరో 9,222పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి హరీష్‌రావు నియామక పత్రాలను అందజేసి ప్రసంగించారు. పేద ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులుగా చేరుతున్న వారిని అభినందించారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ పెద్దమొత్తంలో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించారన్నారు. ఆసుపత్రుల ఏర్పాటుతో పాటు వైదు ్యలు, నర్సులు ఇతర సిబ్బందిని భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే టీచింగ్ ఆసుపత్రుల్లో సేవలు అందించేందుకు 34 రంగాల్లో 1,061మందికి ఒకేసారి పోస్టింగ్ ఇస్తున్నామని, ఇది వైద్య విద్యలో దేశంలోనే రికార్డు అని అన్నారు.

కేవలం 5నెలల వ్యవధిలోనే అత్యంత పారదర్శకంగా నియామక ప్రక్రియ పూర్తి చేసి, నియామకపత్రాలను అంద జేస్తున్న ట్లు తెలిపారు. వైద్యశాఖలోని ఏడు విభాగాల్లో పనిచేస్తున్న 1,331మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించిన ముఖ్యమంత్రి కెసిఆర్ ఏన్నోఏళ్ల వారి కళను సాకారం చేశారన్నారు. ఒక్కో వైద్య విద్యార్థి మీద ప్రభుత్వం కోటి రూపాయల వరకు ఖర్చు చేస్తుందని, దానిని వైద్య సేవల ద్వారా సమాజానికి తిరిగి ఇవ్వాలని సూచించారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ఖరీదైన వైద్యం సైతం పేదలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. గతేడాది 8 మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి కెసిఆర్ ఒకేసారి ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసిన హరీష్‌రావు, 2014కు ముందు తెలంగాణలో మొత్తం మెడికల్ కాలేజీలు 20 ఉంటే నేడు వాటి సంఖ్య 55కు చేరిందన్నారు. వరంగల్ హెల్త్ సిటీని ఈ ఏడాదే ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.



అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామకపత్రాలను అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు తదితరులు

## దశాబ్ది ఉత్సవాల లోగోను ఆవిష్కరించిన సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో రాష్ట్ర సాధన నుంచి నేటి దాకా పదేండ్లకు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానాన్ని,తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా ప్రభుత్వం రూపొందించిన లోగోను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ మోడల్‌గా దేశ ప్రజలు ఆదరిస్తున్న రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కాళేశ్వరం వంటి సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్, వ్యవసాయం,మిషన్ భగీరథ, సాంస్కృతిక,యాదాద్రి వంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలను,మెట్రో రైలు,టీ-హబ్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం చిహ్నాలను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు లోగోలో పొందుపరిచారు. వీటితో పాటు తెలంగాణ తల్లి,బతుకమ్మ, బోనాలు,పాలపిట్ట,అమరవీరుల స్మారకంతో కూడిన తెలంగాణ అస్తిత్వ చిహ్నాలతో తెలంగాణ ఖ్యాతి మరింత ఇనుమడించేలా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల లోగో రూపుదిద్దుకుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, పాడి కౌశిక్‌రెడ్డి,ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, సిఎం ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్,ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సిఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌ను బిజెపిలో చేర్చుకోవడం కష్టమే

### బిజెపి నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వచ్చినా బిజెపిలో చేర్చుకోవడం కష్టమేనని బిజెపి నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి బిజెపిలోకి వస్తానంటే ఆలోచించాల్సిందేనని, ఆయనపై ఉన్న కేసులు చెక్ చేయాల్సిందే అన్నారు. క్లీన్ ఇమేజ్ ఉన్న వాళ్లను మాత్రమే బిజెపి చేర్చుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ వలసవాదని, ఆయన లాంటి వాళ్లని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడం హాస్యాస్పదం అన్నారు. రేవంత్‌రెడ్డి కొత్త బిచ్చగాడు అన్నారు. ఒక లక్ష్యం కోసం బిజెపిలో చేరినట్లు, పార్టీని వీడే ప్రసక్తి లేదన్నారు. కొత్తగా చేరిన వారికి కూడా అవకాశాఇస్తే బిజెపి మరింత బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వంలో ఉన్న అవినీతిపరులపై కఠినంగా వ్యవహరించాలని, ఆధారాలు కావాలంటే తామిస్తామన్నారు. కెసిఆర్ కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గరు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

## శరత్‌బాబు మృతికి సిఎం కెసిఆర్ సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** టాలీవుడ్ సీనియర్ నటుడు శరత్‌బాబు మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సంతాపం వ్యక్తం చేశారు. శరత్‌బాబు ఐదు దశాబ్దాలుగా తెలుగు, తమిళ,కన్నడ,మలయాళ,హిందీ భాషల్లో 220కి పైగా చిత్రాల్లో నటించారని పేర్కొన్నారు. ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని సిఎం అన్నారు. శరత్‌బాబు కుటుంబ సభ్యులకు సిఎం కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.శరత్‌బాబు మృతిపై తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యావద్ సంతాపం తెలిపారు. సీనియర్ నటుడు శరత్‌బాబు మరణం బాధాకరమని పేర్కొన్నారు. ఏ పాత్ర అయినా తన నటనతో ప్రేక్షకులను మెప్పించిన నటుడు శరత్‌బాబు అని అభివర్ణించారు.

# మృత్యుంజయునికి కోటి దండాలు

### స్వామి అమ్మవార్లకు నిత్యోత్సవం

**శ్రీకాళహస్తి,మే22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిట లాడింది. శ్రీకాళహ స్తీశ్వరాలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురు దక్షిణామూర్తి. కుడివైపు చూస్తే మృత్యుంజయస్వామి ప్రతిష్టిత లింగం దర్శనమిస్తుంది. ఎడమవైపు నిత్యకళ్యాణోత్సవం దర్శనమిస్తుంది. ఇక సోమవారం ఆలయంలో నిత్యోత్సవం ప్రత్యేక ఆకర్షణ. భక్తులకు పండగే పండగ అన్నట్లు ఉంటుంది.ముఖ్యంగా సోమవారం ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తులు అభిషేకాల్లో పాల్గొనటానికి' పరు గులు తీస్తుంటారు.ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.దాంతో శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వ హించారు. కాగా ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓవైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహు కేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మ వార్లకు నిత్యకళ్యాణం, మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.

**మృత్యుంజయస్వామికి ప్రత్యేకాలంకారాలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారంప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహిం చటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు.


# రాజకీయాల నుంచి రిటైరవుతున్నా..

### ఎపి మాజీ మంత్రి పేర్నినాని

**విజయవాడ, మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** క్రియాశీలక రాజకీయాల నుంచి రిటైర్ అవుతున్నానని ఏపీ మాజీ మంత్రి,మచిలీపట్టణం ఎమ్మెల్యే వెంకట్రామయ్య(నాని) వ్యంగ్య వ్యాఖ్యానం చేసారు. సీఎం జగన్ సమక్షంలోనే నాని ఒక వ్యక్తి చేసిన కామెంటుకు బదులుగా సెటైరికల్‌గా అన్నారు..బందరు పోర్టుకు సీఎం జగన్ తపసిపూడిలో శంకుస్థాపన చేసారు.అనంతరం నగరంలోని జిల్లా పరిషత్ కూడలి సమీపంలోని మైదానంలో జరిగిన బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొన్నారు.ఈ సభలో నాని మాట్లాడుతూ బందరు భవిష్యత్తు రూపురేఖలు ఇక మారిపోతాయన్నారు,బందరు అభివృద్ధికి సీఎం జగన్ ఇస్తున్న సహకారం మరువలేనిదన్నారు.నగరంలో వైద్యకళాశాల వస్తుందని ఎవరైనా ఊహించారా ? అన్నారు.2021లో మంజూరు చేయడమే కాకుండా 2023లో పూర్తి స్థాయిలో కళశాల ప్రారంభమవుతుందన్నారు.ఇదంతా నాకే కలగా ఉందన్నారు.సుమారు 64 ఎకరాల్లో రూ.550కోట్లతో మెడికల్ కళాశాలను మంజూరు చేసారన్నారు.ఇప్పటి వరకు ఇక్కడి ప్రభుత్వ కార్యాలయాలను బెజవాడకే తరించుకుని పోయారన్నారు.పాత కలెక్టరేట్ కార్యాలయం తప్పితే ఏవీ లేకుండా చేశారు.ఆఖరికి సమావేశాలు కుడా బెజవాడలోనే నిర్వహించేవారు.దీంతో మచిలీపట్టణం తన ఉనికి కోల్పోయిందన్నారు.ఈ దశలో మచిలీపట్టణంకు పోర్టు,మెడికల్ కాలేజీ ఇచ్చి పూర్వవైభవాన్ని సీఎం జగన్ తీసుకుని వచ్చారన్నారు.వయస్సులో జగన్ చిన్నవాడయ్యాడని, లేకుంటే పాదాభివందనవ చేసేవాడినన్నారు.ఈ సందర్భంలోనే నాని ఎండ వస్తుండది,వాన వస్తుంది,వేడిగాలులు వీస్తున్నాయి, ప్రజలు ఇబ్బందులు పడున్నారని సీఎం జగన్ బాధపడుతున్నారనా న్నరు.నువ్వ స్టేజీ మీద నుంచి కొందరు అంటున్నారన్నారు.ఈ పరిస్దితి తనకు అర్దమైందని, మరో సారి సీఎం జగన్‌తో సమావేశం అవుతానో లేదో నాకే తెలియదని,అందుకే మాట్లాడుతున్నానని,తప్పదు బాధ భరించాల్సిందేనని నాని చలోక్తిగా మాటాడారు.దాంతో అంటే రాజకీయాలు వదిలేస్తున్నారా ? అంటూ ఒకరు వ్యాఖ్యానించగా నాని కుడా వ్యంగ్యంగా మాట్లాడారు.నాని తన రాజకీయ భవితవ్యం గురించి వ్యంగ్యంగా మాట్లాడినా ఆయన వచ్చే ఎన్నికల బరిలో ఉండరనే ప్రచారం జరుగుతుంది.రాజకీయాలను వైదొలగక పోయిన తన కుమారుడిని వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా నిలపాలనే ఆలోచనతో ఉన్నట్లు ఇప్పటికే నియోజకవర్గంలో కథనాలు విస్తృతంగా వ్యాప్తిలో ఉన్నాయి.నాని రిటైర్‌మెంట్‌పై సెటరికల్‌గా మాట్లాడినా రాజకీయాల్లో ఇప్పుడది వాడివేడి చర్చగా మారింది.సభలో నాని సీఎం జగన్ దృష్టిలో పెట్టిన అంశాలపై ఆయన స్పందించారు. మెడికల్ కళాశాల వద్ద రూ.25 కోట్లుతో ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి, రూ.3కోట్లుతో ఆరు కమ్యూనిటి హాల్ నిర్మాణానికి అంబేద్కర్ భవన అభివృద్ధికి రూ.5కోట్లు కేటాయింపుకు సీఎం జగన్ సభాపూర్వకంగా ఆమోదం తెలిపారు. మరో 12 గ్రామాలకు సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేయిస్తామని,ఇళ్ళ స్దలాల పట్టాలు ఇస్తామని తెలిపారు.

## హెచ్చుతగ్గుల్లో పత్తి ధరలు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** మార్కెట్‌లో పత్తి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ప్రస్తుతం తగ్గడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. బస్తాల్లో తెచ్చిన పత్తికి తక్కువ ధర పలుకుతుండగా, విడి పత్తికి మాత్రం ఒకింత పెరుగుదలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు గరిష్టంగా 6,800 రూపాయల వరకూ, కనిష్టంగా 5 వేల రూపాయలు పలుకుతోంది. ఇక మోడల్ ధర 6 వేల రూపాయల వరకూ కొనుగోళ్లు జరుగుతున్నాయి. బస్తాల్లో వచ్చిన పత్తికి గరిష్ట ధర 6,800 రూపాయలు, కనిష్టంగా 4,900 రూపాయలు, మోడల్ ధర 6 వేల రూపాయలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రెండు రోజుల్లో బస్తాల్లో వచ్చిన పత్తి ధర గరిష్ట ధరలో 100 రూపాయలు తగ్గగా, మోడల్‌లో మాత్రం 6 వేల రూపాయలకు తగ్గుదల నమోదైంది.



## కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి సేవలో ఎపి మంత్రి పెద్దిరెడ్డి

**తిరుమల,మే 22ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం ఉదయం తిరుపతిలోని కంచిమఠంలో విడిది చేసిన కంచిపీఠాధిపతి విజయేంద్రసరస్వతిని దర్శించుకున్నారు. మర్యాదపూర్వకంగా స్వామివారిని కలిసి పుష్పఫలాలనుబహూకరించారు.స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఈ కార్యక్రమం లో చిత్తూరు ఎంపి రెడ్డప్ప, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఉన్నారు.

# లక్షల కోట్ల కుంభకోణం

≫టనం లాంటిందన్నారు. హిరోషిమా నాగసాకిలాగా హైదరాబాద్ తయారు చేస్తున్నారన్నారు. జిఓ.111 రద్దు వెనుక సోమేష్‌కుమార్, అరవింద్‌కుమార్, కెసిఆర్, కెటిఆర్ దుష్టచతుష్టం పాత్ర ఉందన్నారు. సోమేష్‌కుమార్, అరవింద్‌కుమార్ ఈ విధ్వంసానికి కారణం అన్నారు. హైదరాబాద్‌లో చెరువులు అన్ని మాయం అయ్యాయని, నీళ్లు ఉన్న దగ్గరికి వెళ్లి ఇల్లు కడుతున్నారన్నారు. జిఓ పరిధిని పరిరక్షించేందుకు సోమేష్‌కుమార్ నేతృత్వంలో నియమించిన కమిటీనే ఇప్పుడు ఆ జిఓను రద్దు చేయమని నివేదిక ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఈమొత్తం వ్యవహారంపై కాంగ్రెస్‌పార్టీ తరుపున నిజనిర్ధారణ కమిటీ వేస్తామన్నారు. ఈ కమిటి జీఓ 111 పరిధిలోని గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, పర్యావరణ వేత్తలతో చర్చించి ఒక సమగ్రమైన నివేదికను ఇస్తుందన్నారు. దాని ఆధారంగా జిఓ 111 రద్దు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.

111 జిఓను కేవలం జంట నగాలకు సంబంధించిన మంచి నీటి సరఫరాకు సంబంధించిన చిన్న అంశంగా మాత్రమే చూపే ప్రకయత్నం కెసిఆర్ చూస్తున్నారన్నారు. కెసిఆర్ మాఫియా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడంటూ మండిపడ్డారు. ధనదాహం కోసమే 111 జిఓ రద్దు చేసి జంటనగరాలపై బాంబు వేశాడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సిఎం కెసిఆర్, ఆయన బినామీల కోసమే 111 జిఓను రద్దు చేశారన్నారు.

కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన భూ లావాదేవీలను బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. పిజెఆర్ పోరాటం వల్లనే కృష్ణా జలాలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. కాంగ్రెస్ హయాంలో గోదావరి జలాలు వచ్చాయన్నారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను విధ్వంసం చేస్తారా అంటూ ప్రశ్నించారు. గతంలోనే రూపాయి ఖర్చు లేకుండా పైపులైన్లు వేశామని, ఇప్పుడు పైపుల కంపెనీల దగ్గర కమిషన్ల కోసమే కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. జిఓనెంబరు.111 రద్దు చేసే ముందుకు దానికి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవాలన్నారు. సిఎం కెసిఆర్‌కు రాజకీయ విలువలు లేవని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ అధికారంలోకి ఉన్నప్పుడు కెసిఆర్ పార్టీ కోసం స్థలం కేటాయిస్తే, కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీకి ఆఫీసు అవసరం లేదంటూ గత ప్రభుత్వం కేటాయించిన భూమిని రద్దు చేశారన్నారు.

కోకాటపేలో రూ.600కోట్ల విలువైన స్థలాన్ని రూ.40కోట్లకే ఇనిస్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్సీ, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ పేరుతో తమ పార్టీ కార్యాలయం కోసం కెసిఆర్ కేటాయించారన్నారు. టిఆర్‌ఎస్‌కు గతంలో రాజశేఖరరెడ్డి హయాంలో బంజారాహిల్స్‌లో భూమిని కేటాయించారన్నారు. అదిసరిపోదు అన్నట్లుగా హైదరాబాద్‌లో మరొక ఎకరం స్థలం కొట్టేసిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో మోడి కెసిఆర్ స్థలాన్ని కేటాయించి నజరానా ఇచ్చారన్నారు. దీంతో పాటు 33 జిల్లాలో పార్టీ కార్యాలయాలు ఉన్నాయన్నారు. 50 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీకి సొంత కార్యాలయం లేదని, గాంంధీభవన్‌లో అద్దెకు ఉంటుందన్నారు.

పక్కనే ఉన్న 5100 స్థలాన్ని హౌజింగ్ బోర్డు కేటాయిస్తే డబ్బులు సైతం కట్టామన్నారు. కానీ స్థానికంగా ఉన్న బస్తీ వాసులు ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఈ భూమికి కోసం కేటాయించిన డబ్బులు మీ వద్దనే ఉన్నాయన్నారు. మా పార్టీ రావాల్సిన భూమి ఇవ్వకుండా నవ్వు 11 ఎకరాలు నీ పార్టీకి కేటాయించుకోవడం దుర్మార్గం అన్నారు. భూమి కోసం చెల్లించిన మా డబ్బులు ప్రభుత్వం వద్దనే ఉన్నాయన్నారు. మా పార్టీ కార్యాలయానికి ప్రత్యామ్యాయ స్థలం ఇవ్వాలని సిఎస్‌ను కలిసి కోరతామన్నారు. భీంరావ్ వాడ భూమిని పేదలకు పంచితే తమకు అభ్యంతరం లేదన్నారు.

# భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధిగా జి-20 సమ్మిట్‌కు గ్లోబల్‌స్టార్

2023లో భారత సినీ పరిశ్రమలో తనదైనమార్క్‌ను క్రియేట్ చేసి అంతర్జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకున్నస్టార్ హీరో రామ్‌చరణ్ మరోసారి భారత్‌కు గర్వకారణంగా నిలిచారు.. ఆర్‌ఆర్ఆర్‌లో అద్భుతమైన నటను కనబర్చి అందరి మెప్పు పొంది ప్రశంసలందుకున్నారాయన.. శ్రీనగర్‌లో జరుగుతున్న జి–20 సమ్మిట్–టూరిజమ్ వర్కింగ్ గ్రూప్ మీటింగ్‌కు భారత సినీ పరిశ్రమ తరపున ఆయన ప్రతినిధిగా హాజరయాయరు. తను పాత్ర ఎంత గొప్పదో ఆయనకు తెలుసు.. ఆయన తన స్వానుభావాలను వివరించారు. అంతేకాకుండా ప్రపంచంలోసినీ చిత్రీకరణకు సంబంధించిన





ప్రాంతాల్లో మన దేశ సామర్థ్యం గురించి గొప్పగా తెలిపారు..భారతదేశంలోని గొప్ప సాంస్కృతిక వైవిధ్యం, సుందరమైన ప్రదేశాలు, ఖర్చు, సినిమా ప్రభావం, అత్యాధునిక సాంకేతికతో పాటు ఇది చలన చిత్ర నిర్మాణానికి అనువైన ప్రదేశంగా ఎలా మారిందనే విషయాలను చెర్రీ బలంగా విన్పించారు.. ఫిల్మ్ టూరిజమ్ గురించి ఆయన మాట్లాడుతూ జి20లోని సభ్యదేశాల మన దేశంలో చురుకైన భాగస్వామ్యం వహిం చాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా గొప్ప సంస్కృతి, ఆధ్యా త్మికలతో మిళితమైన దేశ గొప్పతనాన్ని, సినీరంగం తరపున తెలియజేసే అవకాశం రావటం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మంచి కంటెంట్‌తో ఎంతోవిలువైన జీవిత పాఠాలుగా అందించే గొప్పదనం మన ఇండియన్ సినిమాల్లో ఉన్నాయని అన్నారు.కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాట్లాడారు.

## 'టైగర్ నాగేశ్వరరావు' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయనున్న వెంకటేష్



రవితేజ హీరోగా వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా చిత్రం టైగర్ నాగేశ్వరరావు, అభిషేక్‌అగర్వాల్ ఆర్ట్స్, నిర్మాత అభిషేక్ అగర్వాల్ భారీస్థాయిలో నిర్మిస్తు న్నారు.. మే 24న ఈచిత్రం ఫస్ట్‌లుక్ విడుదల కానుంది.. ఐదు భాషలకు చెందిన అయిదుగురు సూపర్‌స్టార్లు ఈచిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయనున్నారు.. తెలుగు వెర్షన్‌కు సంబంధించిన పోస్టర్‌ను వెంకటేష్ చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. ఈచిత్రంలో రవితేజ మునుపెన్నడూ లేని విధంగా మాస్,రగ్డ్ లుక్‌లోకన్పించనున్నారు. 1970 నేపథ్యంలో సూవర్టుపురంలోని గజదొగ జీవిత చరిత్ర ఆధారంగా ఈచిత్రం రూపొందుతోంది.. రవితేజ సరసన నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 30న ప్రపంచ వ్యాప్తంగా ఈచిత్రం విడుదల కానుంది.

## యూత్‌కు కనెక్ట్ అయ్యేలా 'మేమ్ ఫేమస్'

లహరి ఫిల్మ్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్న మరో ఆసక్తికరమైన చిత్రం 'మేం ఫేమస్'.. దీనికి దర్శకత్వం వహించటంతోపాటు సుమంత్ ప్రభాస్ ప్రధానపాత్రలోనటించారు.. మణి ఏగుర్ల,మౌర్య చౌదరి, సార్య, సిరి రాసి ఇతరప్రముఖ తారాగణంగా నటిస్తున్నారు. సుమత్ ప్రభాస్ స్వయంగా రచన, దర్శకత్వం వహించారు.. అనురాగ్‌రెడ్డి,.శరత్ చంద్రు, మనోహరన్ కలిసి నిర్మించారు.. ఈసినిమా ఈనెల26న విడుదల కానుంది..ఈసందర్భంగా మేకర్స్ మీడియాతో మాట్లాడారు. వారిమాటల్లోనే. తెలుగు రాష్ట్రాల్లో గీతా ఆర్ట్స్, ఓవర్సీస్‌లో సరిగమ సినిమాస్ విడుదల చేస్తున్నాయి..మా బ్యానర్లలో కొత్తవారితో సినిమాలు నిర్మిస్తాం.. యూత్, ఫ్యామిలీలు చూసేలా



సినిమాలు తీసుకురావటామే మా లక్ష్యం. ఆవిధంగాకొత్తవారు మాబ్యానర్‌ను తమను తాను ప్రారంభించుకోవటానికి తగినవేదికగా మా బ్యానర్ఉంటుంది.. కొత్తవారితోనే కొత్తప్రయత్నాలు చేయాలని మేం నమ్ముతున్నాం.ఎందుకంటే మేం మొదట్లో అలాగే వచ్చాం... కొత్తవారితో పనిచేసినపుడు వైబ్ పూర్తిగా కొత్తగా ఉంటుంది.. ఈచిత్రంలో దాదాపు 50 మంది ఆర్టిస్టులు, టెక్నీషియన్లను పరిచయం చేశాం.. ఇది సరైన యూత్‌ఫుల్‌ఎంటర్‌టైనర్ అని చెప్పగలం.. ఎందుకటే 23ఏళ్ల యువకుడు 23 ఏళ్ల యువకుడిగా నటిస్తున్నాడు. అందుకే నటీనటుల ఎంపిక ప్రక్రియకు సమయం పట్టింది.. ఇది ముగ్గురు యువకుల కథ.. వారి ప్రయాణం ఎలా ఉంటుందో ఈసినిమా చెబుతుంది.. ఈసినిమా చూసినపుడు యువకులు చాలా వాటికి రిలేట్ అవుతారు.. కల్యాణ్ నాయక్‌సంగీతం , బిజిఎం అద్భుతంగా ఉంటాయి.. ఈచిత్రం ప్రమోషన్స్ చాలా ప్రత్యేకంగాఉంటాయి.. ఈసినిమా ట్రెండ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది.

## 'నేను స్టూడెంట్ సార్' ట్రైలర్

బెల్లంకొండ గణేష్ తన కెరీర్ ఆరంభం నుంచి మంచి కథలు ఎంపిక చేసుకుంటున్న సంగతి తెలిసిందే.ఆయనరెండోసినిమా నేను స్టూడెంట్ సార్.. రాఖీ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తు న్నారు. ఎస్వీ2 ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నాంది సతీష్‌వర్మ నిర్మించారు. ఈచిత్రంనవల కాన్సెప్ట్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.. కాగా ఈసినిమా ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు..దర్శకుడు ఒక ఆసక్తికరమైన కథతో ముందుకు వచ్చారు. కథనంలోమలుపులతో నిర్మించారు.. గణేష్ తన పాత్రను అవలీలగా పోషించారు. సముద్రఖని ప్రతినాయకుడిగా కన్పించారు.. ఇందులో అవంతిక దాసాని హీరోయిన్‌గా నటించింది.. మహతి స్వరసాగర్ సంగీతం అందిస్తున్నారు.. జూన్ 2న ఈచిత్రాన్ని విడుదలచేయనున్నట్టు మేకర్స్ తెలిపారు.



# తెలుగు, తమిళ చిత్రాల్లో విలక్షణ నటుడు శరత్‌బాబు

టాలీవుడ్ సీనియర్ నటుడు శరత్‌బాబు(73) సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందారు.. గతనెల రోజులకుపైగా ఆయన ఇక్కడి ఎఎంజి వైద్యశాలలోచికిత్స పొందుతూ ఆరోగ్యం మరింత క్షీణించి కన్నుమూశారు.. ఆయన మృతిపట్ల సినీరంగ ప్రముఖులు, అభిమానులు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. 1951 జూలై31న ఆయన జన్మించారు.ఆయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస.,. హీరోగా, విలన్‌గా, సహాయ నటుడిగా అనేకపాత్రలను పోషించిన శరత్‌బాబు దాదాపు 300 పైగా సినిమాల్లో నటించారు. 1973లో 'రామరాజ్యం' చిత్రం ద్వారా ఆయన తెలుగు తెరకు పరిచయం అయ్యారు. శరత్‌బాబు అసలు పేరు సత్యనారాయణ దీక్షితులు. రామ విజేతా వాళ్లు (కె.ప్రభాకర్, కె.బాబూరావు) ఈయన్ని సినీరంగానికి పరిచయం చేస్తూ ఈయన పేరును శరత్‌బాబుగా మార్చారు. తెలుగుతోపాటు తమిళ, కన్నడ భాషల్లోకూడ ఆయన నటించారు.చివరిసారిగా ఆయన పవన్ కల్యాణ్ చిత్రం 'వకీల్‌సాబ్'లో నటించారు. అంతేకాదు త్వరలో విడుదల కాబోతున్న సీనియర్ నటుడు నరేష్‌మూవీ 'మళ్లీపెళ్లి' చిత్రంలోకీలకపాత్రలో నటించారు. హీరోగా శరత్‌బాబు తొలిచిత్రం 1973లో విడుదలైన 'రామ రాజ్యం'. తర్వాత 'కన్నెవయసు' చిత్రంలో నటించారు.. ఆ తర్వాత సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో 'పంతులమ్మ', 'అమెరికా అమ్మాయి' చిత్రాల్లో నటించి మెప్పించారు. ఆ తర్వాత తెలుగులో బాలచందర్ దర్శకత్వంలో విడుదలైన 'చిలకమ్మ చెప్పింది' చేశారు. ఇదిలా ఉండగా బుల్లితెర తెలుగు ప్రేక్షకులకు ఆయన సుపరిచితుడు.. 'అంతరంగాలు', 'ఎండ మావులు'తదితర సీరియల్స్‌లో ఆయన నటించారు.. శరత్‌బాబు సినిమాల్లో నిలదొక్కుకోవటానికి ప్రయత్నిస్తున్న రోజుల్లో అప్పటికే తెలుగు సినీరంగంలోసుస్థిరమైన నటి రమాప్రభను ప్రేమించి



పెళ్లిచేసుకున్నారు.శరత్‌బాబుకంటే నాలుగేళ్లు పెద్ద ఆమె. వీరి వివాహం 14 ఏళ్ల తర్వాత విడాకులతో విడిపోయారు..

**శరత్‌బాబు నటించిన పలు చిత్రాలు:** కన్నెవయసు (1973), రామ రాజ్యం (1973), నోము (1974). అభిమానవతి, అమెరికా అమ్మాయి(1976), బంగారు మనిషి (1976), మంచికి మరోపేరు (1976), వింత ఇల్లు సంతగోల (1976), కన్యకుమారి(1977), చిలకమ్మ చెప్పింది, జీవిత నౌక, పల్లెసీమ, పంతులమ్మ, మరో చరిత్ర, రామకృష్ణులు, ఊర్వశీ నీవే నా ప్రేయసి, ఇది కథ కాదు, గుప్పెడు మనసు, తాయారమ్మ బంగారయ్య, శృంగార రాముడు, మూడు ముళ్ల బంధం,రచయిత్రి, 47 రోజులు, ఇంద్రుడు–చంద్రుడు, తొలికోడి కూసింది. బాలనాగమ్మ, రాధాకల్యాణం, సీతాకోక చిలుక, ఏకలవ్య, సితార, స్వాతి, అన్వే షణ, కాష్మోరా, స్రవంతి, ఉదయం, గౌతమి, చిన్నారి దేవత, చైతన్యరథం, సంకీర్త, సంసారం ఒక చదరంగం, కాంచనసీత, నా మొగుడు నాకే సొంతం, నీరాజనం, ఆపద్బాం దవుడు, హలోబ్రదర్, మగధీర, అస్త్రం, ఎంత మంచివాడవురా, మళ్లీ పెళ్లి వంటివి ఉన్నాయి.

**అందుకున్న పురస్కారాలు:** 1981, 1988, 1989 సంవత్సరాల్లో మూడు పర్యాయాలు ఉత్తమ సహాయనటుడిగా నంది పురస్కారాలు అందు కున్నారు. తొలిసారిగా 'సీతాకోక చిలుక', రెండోసారి 'ఓభార్య కథ', మూడవసారి 'నీరాజనం' సినిమాల్లో ఆయన నటనకు ఈ పురస్కారాలు లభించాయి.




శరత్‌బాబు సినిమాల్లో నిలదొక్కుకోవటానికి ప్రయత్నిస్తున్న రోజుల్లో అప్పటికే తెలుగు సినీరంగంలో సుస్థిరమైన నటి రమాప్రభను ప్రేమించి పెళ్లిచేసుకున్నారు.




## దుబాయ్‌లో టిఎఫ్‌సిసి నంది అవార్డుల ఆహ్వాన పత్రిక రిలీజ్

తెలుగు రాష్ట్రప్రభుత్వాల సహకారంతోతెలంగాణ ఫిలిం ఛాంబర్‌ఆఫ్‌కామర్సు ఆధ్వర్యంలో 13 మంది జ్యూరీ సభ్యుల సమక్షంలో టిఎఫ్‌సిసి నంది అవార్డుల సౌత్‌ఇండియా 2023 వేడుకలు ఆగస్టు 12న దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించేందుకు ఏర్పాటు సాగుతున్నాయి.. ఇన్విటేషన్ బ్రోచర్‌ను హైదరాబాద్‌లోవిడుదల చేశారు..ఫిల్మ్ ఛాంబర్‌లోజరిగినకార్యక్రమానికి రైటర్



మిట్టపల్లి సురేందర్, పల్లెలక్ష్మణ్‌గౌడ్, జ్యోతిరెడ్డి, హీరోయిన్ భవ్యశ్రీ, కోటేశ్వరరావు, రాధాకృష్ణ, బి.శ్రీనివాస్‌గౌడ , రాజ్, ప్రేమ్, శ్రీశైలం , వాహిద్, నిర్మాత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.. ఈసందర్భంగా టిఎఫ్‌సిసి చైర్మన్ డాక్టర్ .ప్రతాని రామకృష్ణగౌడ మాట్లాడారు. దాదాపు 6,7 సంవత్సరాల తర్వాత రెండు ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమం చేస్తున్నందుకు చాలా సంతో షంగా ఉందన్నారు.. ఆగస్టు 12 దుబాయ్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి సినీ,రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు.నటుడు ఆలీ, ప్రసన్నకుమార్, టిఎఫ్‌సిసి వైస్‌చైర్మన్ లయన్స్ క్లబ్ గవర్నర్ కోటేశ్వరరావు,జ్యోతిరెడ్డి తదితరులు మాట్లాడారు.

## హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా 'మెన్‌టూ'

నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్షచెముడు, సుదర్శన్,తదితరులు నటించిన చిత్రం మెన్ టూ.. లాన్‌థ్రెన్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై శ్రీకాంత్ జి.రెడ్డి దర్శకత్వంలో మౌరయ సిద్ధవరం ఈచిత్రానిననిర్మిస్తున్నారు. ఈచిత్రాన్ని మే26న విడుదల చేయనున్నారు.. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను యంగ్ హీరో విశ్వక్‌సేన్, సందీప్ కిషన్ విడుదల చేశారు.. ట్రైలర్‌ను పరిశీలిస్తే ఫెమి నిజమ్ కొటేషన్‌తో స్టార్ట్ అయ్యింది.. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం అనే పాయింట్‌మీద డిస్కషన్ జరగటాన్ని చూపించారు. ఆడవాళ్లు లేని చోటనే మగవాళ్లు హ్యాపీగా ఉంటారనే విషయాన్ని బ్రహ్మాజీ వివరించారు. మగవాళ్లు తమ జీవితాల్లో ఆడవారి వల్ల పడే బాధలను ఎంటర్‌టైనింగ్ యాంగిల్‌లో వివరించేప్రయత్నం చేశారు. ఇలాంటి సమస్యలనుమగవాళ్లుఎలా హ్యాండిల్ చేస్తారనే దాన్ని కూడ చూపించారు.



## లైఫ్‌లో ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుండాలి: నరేష్

సీనియర్ నరేష్ తాజా చిత్రం 'మళ్లీ పెళ్లి'..ఈచిత్రం యూనిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.. ఈచిత్రంలో పవిత్ర లోకేష్ హీరోయిన్‌గా నటించిది. మెగా మేకర్ ఎమ్మెస్‌రాజు రచన, దర్శకత్వం వహించారు. విజయకృష్ణా మూవీస్ బ్యానర్‌పై నరేష్ స్వయంగా నిర్మించారు. మే 26న ఈచిత్రం విడుదల కానుంది.. ఈచిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను తాజాగా నిర్వహించారు.. ఈసందర్భంగా నటనలో యాభై ఏళ్లు పూర్తిచేసుకున్న సీనియర్‌నటి జయమసుధను ఘనంగా సత్కరిం చారు.. ఈసందర్భంగా ఈచిత్రం బిగ్ టికెట్‌ను జయసుధ ఆవిష్కరించారు.. అలాగే నటుడిగా యాభై ఏళ్లు పూర్తిచేసుకున్న నరేష్‌ను ఎమ్మెస్‌రాజుఆధ్వర్యంలోఘనంగా సత్కరించారు. అనంతరం నరేష్ మాట్లాడారు.. నా బ్యాంకు ఖాతాలో రూ.5వేలు లేని రోజులు నాకు గుర్తు అన్నారు. నా ప్రాణ మిత్రుడు విజయ్ నాకు తోడుగా ఉన్నాడని అన్నారు. 9వ ఏట పండంటి కాపురం చిత్రంతో అనుకోకుండా నా నటన ప్రారంభమైందన్నారు. గుమ్మడి, జయసుధగారితోకలిసి పయనమే ఇపుడు




50వేట హెల్దీగా నటుడిగా కొనసాగుతున్నానని అన్పిస్తోందన్నారు.. ఫస్టాఫ్ బాగుంటే సెకండాఫ్ బాగుంటుందని, అదే ఈసినిమా అన్నారు. కృష్ణ, విజయనిర్మలగారు నాకు ధైర్యాన్ని నేర్పారన్నారు.. నాగురువు జంధ్యాలగారుమంచి మిత్రులు అని, ఆయన సినిమాలతో అన్నీహిట్లు కొడుతూనే వచ్చానని అన్నారు. నాకు నచ్చింది నేను చేస్తాను.,. మా అమ్మగుడికి వెళ్లి అమ్మకళ్లలో చూస్తాను అన్నారు. నాకు ఆలోచన వస్తుంది అదే చేస్తానని అన్నారు. రాజకీయాల్లోకి వెళ్లానని, సేవా కార్యక్రమాలు చేశానని అన్నారు. నన్నుమెచ్చిన దర్శక, నిర్మాతలు మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారన్నారు. పది మందికి మంచి చేయాలని అదే జీవితం అన్నారు. పవిత్ర లోకేష్, ఎమ్మెస్ రాజు, సీనియర్‌నటి అన్న పూర్ణ, అనంత్ శ్రీరామ్, సంగీత దర్శకుడు బొబ్బిలి సురేష్, దర్శకుడు,నటుడు వెంకటేష్ మహా, రోషన్, అన్నన్య, నటుడు రవివర్మ,జడ్జి మాధవరావు, వనిత విజయ్‌కుమార్ మాట్లాడారు.

## 'తుమ్మలపల్లి'కి 'సినీ విరాట్' ప్రదానం

ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణకు వంశీ ఇంటర్నేషనల్ సంస్థ 'సినీ విరాట్' బిరుదు ప్రదానం చేసింది..2004లో నిర్మాణ రంగంలోకి ప్రవేశించిన ఆయన భీమవరం టాకీస్ బ్యానర్‌పై ఇప్పటికి 101 సినిమాలు అందించి రికార్డు క్రియేట్ చేశారు. ఈబిరుదును ఆయనకు అందజేశారు.. విశ్రాంత సిబిఐ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, సుమన్, రేలంగి నరసింహారావు,నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల్ల పసన్నకుమార్, వంశీ రామరాజు పాల్గొన్నారు.



## పాన్‌ఇండియా రిలీజ్‌కు రెడీ

తన సూపర్ హీరో మూవీ మిన్నల్ మురళితో దేశవ్యాప్తంగా పాపులర్ అయిన మలయాళ నటుడు టోవినో థామస్ తన మొదటి పాన్‌ఇండియా చ్రిరం విడుదలకు సిద్ధంగా ఉన్నారు.. జితిన్‌లాల్ దర్శకత్వం వహించారు. అజయంతే రండం మోషణం (ఎఆర్‌ఎం') టీజర్ తాజాగా అన్ని సౌత్ భాషలతో పాటు హిందీలో విడుదలైంది... పాన్‌ఇండియా అప్పీల్‌కు అనుగుణగా, ఎఆర్‌ఎం టీజర్ సోషల్ మీడియా లో గ్రాండ్ లాంచ్ అయ్యింది.. మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వస్తున్న ఈ పాన్ ఇండియన్ ఫిల్మ్‌కోసం ఇండియన్ సూపర్‌స్టార్స్ హృతిక్ రోషన్, నాని,లోకేష్ కనగరాజ్, ఆర్య, రక్షిత్‌శెట్టి, పృధ్వీరాజ్ సుకుమారన్ కలిసి వచ్చారు. హిందీ టీజర్‌ను హృతిక్ రోషన్ లాంచ్ చేశారు. తెలుగులోనాని, విడుదల చేశారు. మ్యాజిక్ ఫ్రేమ్స్,యుజిఎం ప్రొడక్షన్స్‌పై డాక్టర్‌జకరియా థామస్, లిస్టిన్‌స్టీఫెన్ నిర్మించారు.టోవినోతోపాటు కృతిశెట్టి, ఐశ్వర్య రాజేష్, ప్రధానపాత్రలు పోషించారు. ఈచిత్రం త్వరలోమల్టీ లాంగ్వేజెస్‌లో విడుదల కానుంది.



## సిద్ధార్థ 'టక్కర్'

సిద్ధార్థ్ తాజా చిత్రం టక్కర్.. ఈచిత్రానికి కార్తీక్ జి.క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు..పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజే విశ్వమోహన్ ఈ చిత్రాన్ని అభిషేక్‌అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ హీరోయిన్‌గా నటిస్తోంది.. ఈచిత్రం జూన్ 9న తెలుగు, తమిళ రాష్ట్రాల్లో భారీస్థాయిలో విడుదలకానుంది.. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. రొమాన్స్, కామెడీ,యాక్షన్ సంగమంగా రూపొందిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేసింది.. సుప్రీమ్‌హీరో సాయిధరమ్ తేజ సోషల్‌మీడియా వేదికగా ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన టీంకు ఆల్‌దిబెస్ట్ విషెస్ తెలిపారు. సిద్ధార్థ్ కెరీర్‌లో గుర్తిండిపోయేలా ఈ చిత్రం ఉంటుందని యూనిట్ నమ్మకంగా పేర్కొంది.. అభిమన్యుసింగ్, యోగిబాబు, మునీశ్ కాంత్ తదితరులు నటిస్తున్నారు.



# వేసవిలో పాపాయి సంరక్షణ ఇలా!



మండే ఎండలకు పెద్దవాళ్లే తట్టుకోలేకపోతున్నారు. ఇక పసిపిల్లలు సంగతి చెప్పనవసరం లేదు.ఎండ వేడికి, వడగాలులకు చిన్న పిల్లలు తాళలేరు. పైగా ఈ కాలంలో వీటితో పాటు వడదెబ్బ, చెమటకాయలు, విరేచనాలు, వాంతులు.. ఇలా రకరకాల ఆరోగ్య సమస్యలు కూడా చిన్నారుల్ని వేధిస్తుంటాయి. వీటన్నింటి నుంచి పసిపిల్లల్ని సంరక్షించడం తల్లులకు కత్తి మీద సాము వంటిదే. అయితే ఎండాకాంలో ఎదరయ్యే ఈ వేడి తీవ్రత నుంచి బుజ్జాయిల్ని కాపాడుకోవడానికి కొన్ని మార్గాలున్నాయి. మరి అవేంటో తెలుసుకుందాం..

**చెమట నుంచి...** ఈ కాలంలో వేధించే ఆరోగ్య సమస్యల్లో అతి ప్రధానమైంది చెమట. దీనివల్ల పిల్లల్లో చెమటకాయలు, దద్దుర్లు.. వంటి చర్మ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మెడ, చంకల కింది భాగంలో చెమట పేరుకుపోవడం వల్ల ఆ ప్రాంతాల్లో ఈ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి స్నానం చేయించే క్రమంలో ఆయా భాగాల్లో మరింత శుభ్రంగా కడగడం ముఖ్యం. ఆ తర్వాత మెత్తని కాటన్ వస్త్రంతో పొడిగా తుడవడం మర్చిపోకూడదు. లేదంటే ఆ భాగాల్లో తడి అలాగే ఉండిపోయి, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లుకు దారి తీయచ్చు.



**ఈ నూనెలు....** వేసవి కాలంలో పిల్లలకు రోజూ ఉదయం, సాయంత్రం.. రెండుసార్లు స్నానం చేయించడం తప్పనిసరి. అలాగే స్నానానికి ఉపయోగించే గోరువెచ్చని నీటిలో కొన్ని చుక్కల వేప నూనె లేదా నీలగిరి తైలం.. వేయడం మంచిది. ఈ సహజసిద్ధమైన నూనెలు పాపాయి చర్మంపై ఉండే క్రిములను నాశనం చేయడంతో పాటు చర్మానికి ఎలాంటి ఇన్ఫెక్షన్లు సోకకుండా కాపాడతాయి.

**వదులుగా...** బుజ్జాయిలకు ఎండాకాలంలో వదులుగా ఉండే మెత్తని కాటన్ దుస్తులు వేయడం మంచిది. ఎందుకంటే ఇవి చర్మం నుంచి వెలువడే చెమటను సులభంగా పీల్చుకోవడంతోపాటు చర్మానికి గాలి తగిలేలా చేస్తాయి. తద్వారా చెమటకాయలు రాకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే పాపాయిని బయటికి తీసుకెళ్లినప్పుడు తలకి టోపీ, చేతులు, కాళ్లు కవరయ్యేలా ఉండే పొడవాటి కాటన్ దుస్తుల్ని వేయడం తప్పనిసరి.

**నిర్ణీత సమయాల్లో...** వేసవిలో ఎన్ని నీళ్లు తాగినా దాహమే వేస్తుంటుంది. పిల్లలకు కూడా అంతే.. ఆర్నెళ్ల లోపు వయసున్న పిల్లలు తల్లిపాలపై ఆధారపడతారు కాబట్టి ప్రత్యేకంగా నీళ్లు తాగించాల్సి పనిలేదు. అయితే పిల్లలకు సరిపడినన్ని పాలు పట్టడం మాత్రం మర్చిపోవద్దు. నిర్ణీత సమయానికి అనుగుణంగా పాపాయికి పాలివ్వాలి.



**చల్లటి ప్రదేశంలో....** పిల్లల్ని ఉంచే ప్రదేశం మరీ వేడిగా కాకుండా. మరీ చల్లగా కాకుండా ఉండేలా చూసుకోవడం మంచిది. ఎందుకంటే ఈ రెండిట్లో దేనికీ పిల్లలు తట్టుకోలేరు. కాబట్టి ఇంట్లోని వేడి గాలి బయటికి పోయేలా సాయంత్రం పూట కాసేపు కిటికీలు, తలుపులు తెరచి ఉంచడం మంచిది. ❑

# కాటుక కన్ను దాటుతోంటే..



- కడిగిన ముఖానికి మాయిశ్చరైజర్ రాసేప్పుడు కళ్ల క్రింది ప్రాంతాన్ని వదిలేయండి. తర్వాత ఒక టిష్యూతో కళ్ల చుట్టూ నూనెలు లేకుండా అద్దాలి. ఇయర్ బడ్ లేదా దూదితో కాటుక రాసే ప్రాంతాన్ని నెమ్మదిగా తుడిచి, అప్పుడు కాటుక రాస్తే సరి.
- స్మడ్జ్ ఫ్రీ రకాలు మార్కెట్‌లో బోలెడు. అవీ పని చేయడం లేదని వాపోయే అమ్మాయిలే ఎక్కువ. కనుల కింది భాగంలో కాంపాక్ట్ పౌడర్‌ని అద్దాక కాటుక రాసి చూడండి. ఫలితం ఉంటుంది.
- కాటుక అద్దే ముందు ప్రైమర్‌ను కళ్ల చుట్టూ రాయండి. కాటుక కరిగే సమస్య చాలావరకూ ఆగిపోతుంది.
- కాటుక ఎక్కువగా కనుమూలల్లోనే కరుగుతుంది. కాబట్టి, మూలల్లో పలుచగా. మధ్యలో మందంగా ఉండేలా రాయండి. లుక్ బాగుంటుంది. కళ్ల నిండా అవుతుందన్న సమస్య ఉండదు. ❑

# మానవసేవే మాధవ పూజ



మేము భక్తి మార్గంలో ఉన్నాము., పూజలు–పునస్కారాలు, నోములు–వ్రతాలు, హారతులు–అర్చనలు చేస్తుంటాము. అందుకే భగవంతుడు మా భక్తికి మెచ్చి మాకు ఆయురారోగ్యాలు, సుఖ, సంపదలను ప్రసాదించాడు అని కొందరు అంటారు. నిజమే, అలాంటి భక్తి భావాన్ని పెంచి ప్రజలను మంచి పనులను చేయటానికి ప్రోత్సహిస్తున్నారు. కొంత మంది పెద్దలు. అయితే మరొకవైపు ఏ పూజలూ చేయని, అసలు ఆ భగవంతుని ఉనికినే నమ్మని కొంత మంది ప్రముఖులూ మన కళ్లముందే ఉన్నారు. వారికీ ఆయురారోగ్యాలూ సుఖ సంపదలు బాగానే ఉన్నట్టు తెలుస్తుంది. మరి పూజలకు, పునస్కారాలకు మెచ్చే దేవుడు ఆయురారోగ్యాలను, సుఖ, సంపదలను ప్రసాదిస్తాడని ఎలా బుజువు అవుతుంది? మన పూజలకు, స్తోత్రాలకు దేవుడు ఉబ్బిపోతాడా? పొంగిపోయి మనకు అన్నీ ఇస్తాడా?

వ్రాత వెంటగాని వరమీడు దైవంబు, చేతకొలదిగాని వ్రాత కాదు, వ్రాత కజుడుకర్త, చేతకుందా కర్త విశ్వదాభిరామ వినుర వేమ.

ఏ మతమూకాదనని కర్మ సిద్ధాంతముంది ఈ చిన్న పద్యంలో మనం మంచి చేస్తేమంచి ఫలితాన్ని, చెడు చేస్తే చెడు ఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుంది. పెట్టిన దినములలోపల నట్టడవులకైన వచ్చు. నానార్థములున్, పెట్టని దినముల కనకపు గట్టెక్కిన నేమి లేదు కదరా సుమతీ. మనం ఎవరికైన దానమిచ్చి ఉంటే సుఖ, సంపదలు అబ్బుతాయి. రోగులకు, వృద్ధులకు సేవచేసింటే ఆయురారోగ్యాలు లభిస్తాయి. అంతేగానీ పూజలకు లొంగి దైవం వాటిని ప్రసాదించదు. భక్తులు పరోక్షంగా, నస్తికులు ప్రత్యక్షంగా చేసే పరోపకార పనుల ఫలితంగా సుఖ, సంపదలు, ఆయురారోగ్యాలు లభిస్తాయి. కర్మ సిద్ధాంతం దాన్నే సమర్థిస్తుంది. కాబట్టి మానవసేవ, మాధవపూజ వేరే కాదని, మానవసేవే మాధవపూజ అని గ్రహించి తదను గుణంగా జీవిద్దాం. లోకం బాగుపడుతుంది.

- రాచమడుగు శ్రీనివాసులు

ఆధ్యాత్మికం

# చెట్ల బెరడుతో ఆభరణాలు..



కాదేదీ కళకనర్హం అన్నట్లు.. ప్రకృతిలో లభించే ప్రతి వస్తువునూ మన జీవనశైలికి అనుగుణంగా, ఉపయుక్తంగా మలుస్తున్నారు. ఈ కాలపు డిజైనర్లు. ముంబయికి చెందిన సుప్రియా శిర్సాత్ సతమ్ కూడా ఇందుకు మినహాయిపు కాదు. కళలు చేతి వృత్తుల కళాకారుల కుటుంబంలో పుట్టిపెరిగిన ఆమె. కళల్ని స్వయంగా ఒంటబట్టించుకుంది. మరోవైపు పర్యావరణమంటే ఆమెకు ఎనలేని ప్రేమ. ఈ రెండు ఆసక్తుల్ని ముడిపెట్టి ఓ ఆభరణాల బ్రాండ్‌ను ప్రారంభించిందామె. ఇందుకు విమానయాన రంగంలో తాను చేస్తున్న ఉద్యోగాన్ని సైతం వదులుకుందామె. ఆధునాతన స్టైల్స్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, పర్యావరణహితంగా ఆమె తయారుచేస్తోన్న ట్రెండీ జ్యూయలరీ ఎంతోమంది ఫ్యాషన్ ప్రియుల మనసు దోచుకుంటున్నాయి. అంతేకాదు. పెటా ఇండియా నుంచి ఇటీవలే 'వీగన్ ఫ్యాషన్ అవార్డు-2022' సైతం తెచ్చిపెట్టాయి. మరి, ఆ యువ డిజైనర్ వ్యాపార ప్రయాణం గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం..

ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చదివిన సుప్రియ. మార్కెటింగ్ విభాగంలో ఎంబిఎ పూర్తిచేసింది. చదువు పూర్తయ్యాక జెట్ ఎయిర్‌వేస్ విమానయాన సంస్థలో మొబైల్ కామర్స్ హెడ్‌గా పనిచేసిన ఆమె తన కెరీర్‌లో వ్యాపార రంగంలోనే స్థిర పడాలనుకుంది. అయితే తాను పెరిగి పెద్దయ్యే క్రమంలో తన తల్లిదండ్రులు చేసే దుస్తుల వ్యాపారం చూసి. తానూ ఈ రంగంలోకి రావాలనుకున్నానంటోంది.

**అమ్మానాన్నల స్ఫూర్తితో....** అమ్మానాన్నలు దుస్తుల రీసైక్లింగ్ వ్యాపారం చేసేవారు. వీటితో విభిన్న డిజైనర్ దుస్తుల్ని రూపొందించేవారు. అరుదైన క్రాఫ్ట్స్ తయారుచేసేవారు. ఇలా పర్యావరణహితం కోరి వారు చేసే పని నన్ను ఎంతగనో ప్రభావితం చేసింది. ఈ క్రమంలో నాకూ పర్యావరణంపై మక్కువ పెరిగింది. కళలపై అభిరుచి ఏర్పడింది. అందుకే ఎదిగే క్రమంలో నేను ఎంచుకునే దుస్తులు, ఆహారం, సౌందర్యోత్పత్తులు.. ఇలా ప్రతిదీ ఎకో–ఫ్రెండ్లీగానే ఉండేలా జాగ్రత్తపడేదాన్ని. ఇక విమాన యాన సంస్థలో పనిచేస్తున్నప్పుడు పర్యావరణానికి హాని కలిగించే గ్రీన్‌హౌస్ వాయువులపై ఓ చిన్న పాటి అధ్యయనం చేశా. ఈ క్రమంలో విమానాల కంటే ఫ్యాషన్ పరిశ్రమ వల్లే పర్యావరణానికి ఎక్కువ హాని కలుగుతుందన్న విషయం అర్థమైంది. దీన్ని తగ్గించాలన్న ఉద్దేశంతోనే పర్యావరణహిత ఆభరణా లు తయారుచేయాలని ఆలోచన చేశా. ఇదే ఒక సంస్థకు బీజం వేసింది. చెట్ల బెరడును రీసైక్లింగ్ చేసే వివిధ రకాల ఆభరణాలు తయారుచేయడమే మా బ్రాండ్ ముఖ్యోద్దేశం అంటూ చెప్పుకొచ్చింది సుప్రియ.



**స్టైల్స్‌లో రాజీపడకుండా ..** సంప్రదాయబద్ధమైన ఆభరణాల కంటే స్టైలిష్‌గా, ట్రెండీగా ఉండే జ్యూయలరీకే ఓటేస్తున్నారు. ఈ కాలపు అమ్మాయిలు అందుకే తాను రూపొందించే ఆభరణాల విషయంలోనూ ఇదే సూత్రాన్ని పాటిస్తున్నానంటోంది సుప్రియ. 'ఆభరణాల తయారీ కోసం రీసైక్లింగ్ చేసిన కార్క్ ఓక్. అరటి చెట్ల బెరడును ఉపయోగిస్తున్నాం. ఇది చాలా మృదువుగా ఉంటుంది. పైగా దీనిపై సహజసిద్ధంగా ఉండే గీతలు నగకు సహజత్వాన్ని అందిస్తాయి.ప్రస్తుతం వీటితో మెడ ఆభరణాలు, గాజులు, హ్యాండ్ బ్యాగ్స్ కూడా మా వద్ద లభిస్తున్నాయి. అలా ఆయా మెటీరియల్‌తో మేము తయారుచేసే ఆభరణాలు, ఇతర యాక్సెసరీస్ ఈ కాలపు అమ్మాయిలకు నచ్చేలా ఆధునిక స్టైల్స్‌లో ఉండేలా జాగ్రత్తపడుతున్నాం. మా బ్రాండ్ ఎక్కువమంది వినియోదారుల్ని ఆకట్టుకోవడానికి ఇదే ముఖ్య కారణం. ఇక మా ఉత్పత్తులు పలువురు బాలీవుడ్ సెలబ్రిటీల మనసు దోచుకున్నాయి కూడా! అంటోంది మంబయి డిజైనర్.

**నమ్మకమే నడిపిస్తుంది...** ప్రస్తుతం మహిళలకు విభిన్న ఆభరణాలు, వస్తువులు తయారుచేయడమే కాదు. పురుషులు పిల్లల కోసం ఈ చెట్ల బెరడుతో రూపొందించిన పలు ఉత్పత్తుల్ని అందుబాటులో ఉంచారు సుప్రియ. వీగన్ ఫ్యాషన్ బ్రాండ్‌గాపేరు పొందిన తన సంస్థ ద్వారా ఉత్పత్తి చేసే వస్తువులను ప్యాక్ చేయడానికి కూడా.. రీసైక్లింగ్ చేసిన అందమైన ప్రింటెడ్ పేపర్ బ్యాగ్స్‌ని ఉపాయెగిస్తున్నారామె. జీర వేస్ట్ నినాదంతో పూర్తి పర్యావరణహితంగా తయారవుతోన్న తన ఉత్పత్తులకు పెటా ఇండియా నుంచి వీగన్ సర్టిఫికేషన్ లభించింది. అలాగే ఇటీవలే 'వీగస్ ఫ్యాషన్ అవార్డు' కూడా అందుకుంది సుప్రియ.

'నా ఆలోచనలెప్పుడూ ఆభరణాల డిజైనింగ్ చుట్టూనే తిరుగుతుంటాయి. ఈ ప్రకృతిలో నా కంటపడే ఆకులు, లతలు, మేఘాలు, ఇలా ప్రతిదీ స్ఫూర్తిగా తీసుకొని డిజైన్ స్కెచ్ వేస్తాను. మా వద్ద ఉండే నిపుణులైన చేతి వృత్తి కళాకారులు వాటికి అందమైన రూపమిస్తారు. అంటోన్న ఈ ముంబయి డిజైనర్.. మన నమ్మకమే మనల్ని లక్ష్యం వైపు నడిపిస్తుందని స్వీయానుభవంతో చెబుతున్నారు. అంతేకాదు. ఇలా తన పనితనంతో పర్యావరణంపై మక్కువను చాటడమే కాదు రీసైక్లింగ్‌పై అందరిలో అవగాహన పెంచడానికి పలు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు సుప్రియ. ❑

**చెలి చిట్కా**



వేపాకులు ఎండబెట్టి కాల్చండి. ఆ బూడిదను మొక్కలపై చల్లండి. ఇలా వారానికోసారి చేస్తే మొక్కలకు కీటకాల బెడద ఉండదు. ❑

ఎండలు మండిపోతున్నాయి.ఆ వేడంతా కిటికీలు, తలుపుల ద్వారా ఇంట్లోకి చొరబడుతుంది. దాన్ని అడ్డుకునేందుకు ఉపశమనంగా కర్టెన్లనూ వాడొచ్చు. మరి ఈ వేడికి ఎలాంటి ఫ్యాబ్రిక్ మంచిదో చూద్దామా..

**కాటన్‌తో..** కర్టెన్లు అనగానే పాలియస్టర్‌ని ఎంచుకుంటారు. శుభ్రం చేయడానికి తేలికగా ఉంటుందని తొందరగా మురికి కూడా పట్టవని, అయితే, దీన్ని మిగిలిన కాలాల్లో ఉపయోగించినా వేసవిలో మాత్రం కాటన్‌కు ప్రాధాన్యమివ్వండి. గది అంతా చల్లగా ఉంటుంది. బయటి వేడిని తొందరగా లోపలికి రానివ్వదు. కాటన్‌లోనూ లేత రంగులయితేనే మంచిది. వేడిని గ్రహించవు.

# వేడిని తగ్గించే కర్టెన్లు..



**మ్యాట్‌లు...** కిటికీలకు బయటి నుంచి వెదురుతో చేసిన మ్యాట్‌లు తగిలించొచ్చు. అవి వేడిని లోపలికి రాకుండా అవుతాయి. రాత్రి సమయంలో వాటిని పైకి కట్టేసుకోవచ్చు. ఉదయం ఎండ మొదలవగానే వాటిని కొంత లాగేస్తే సరి.

**జనపనారతో..** ఇప్పుడు జనపనార మ్యాట్‌లు దొరుకుతున్నాయి. వాటిని బయటినుంచితగిలిస్తే సరి. వాటిని మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో తిపుతూ ఉండాలి. కిటికీలకి అల్లుకునే మొక్కలాంటివి. ❑

# ఈ కాలంలో పోషక పానీయాలు..



ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకొనే అలవాటుటే చర్మం నిత్య యవ్వనమే అంటున్నారు ఆహారనిపుణులు. వీటిని పోషకాల పానీయాలుగా మారిస్తే మరిన్ని ప్రయోజనాలు అందుతాయని సూచిస్తున్నారు. వీటితో ఆరోగ్యకరమైన చర్మం మన సొంతమైతే, అందం మన చెంత ఉన్నట్లే అని చెబుతున్నారు.

గ్లాసు పాలకు చెంచా పీనట్ బటర్, పావుచెంచా దాల్చిన చెక్కపొడి, గుప్పెడు నానబెట్టిన ఓట్స్ చెంచా సత్తు పౌడర్‌ను మిక్సీలో వేసి చేసిన స్మూతీపై సబ్జాగింజలు చల్లి తీసుకొంటే చాలు. ఇందులోని కాల్షియం, మిటమిన్ ఈ,డి సహా ప్రొటీన్లు కొలాజెన్ ఉత్పత్తికి తోడ్పడి చర్మానికి మృదుత్వాన్నిస్తాయి. ఈ స్మూతీలోని అమినోయాసిడ్స్ ఇన్‌ఫ్లమేషన్ సమస్యను తగ్గించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్తసరఫ రాను మెరుగు పరిచి చర్మాన్ని మెరిపిస్తాయి.

**మజ్జిగతో సబ్జా....** గ్లాసు మజ్జిగలో పావుచెంచా జీలకర్ర పొడి, సరిపడా రాక్‌సాల్ట్ వేసికలిపిన తర్వాత సబ్జా గింజలను చల్లితే చల్లని పోషకాల పానీయం సిద్ధమవుతుంది. ఇందులోని ఒమేగా–3 యాసిడ్స్ చర్మానికి మృదుత్వాన్నిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్స్ చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి ప్రభావితంకాకుండా రక్షిస్తాయి. చర్మంలోని వ్యర్థాలను బయటకు పంపి కాంతులీనేలా చేస్తాయి.



**కొబ్బరినీళ్లకు...** ప్రకృతి పానీయంగా పిలిచే కొబ్బరినీళ్లను గ్లాసు తీసుకొని ఇందులో టేబుల్ స్పూన్ గోండ్ కటీరాని కలపాలి. రుచకరమైన ఈ పానీయంలో ఎసికె విటమిన్లు మెండుగా ఉండి చర్మాన్ని పొడిబారకుండా సంరక్షించి మృదువుగా, మెరిసేలా చేస్తాయి. ❑

# ఏ వయసులో ఫోను ఇస్తున్నారు?

స్మార్ట్ ఫోన్లు మన జీవితంలో భాగమయ్యాయి. ఆటలనుంచి చిన్న చిన్న లెక్కలు సైతం అందులోనే చేసే పరిస్థితి. ఫోన్ల ద్వారా పిల్లలు చాలా సమాచారం తెలుసుకోవచ్చు. నిజమే కానీ ఏ వయసులో పిల్లలకు ఫోను ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా? పిల్లలు ఫోను వినియోగించే సమయాన్ని నియంత్రణలో ఉంచాలి. అవసరం మేరకే వాకునేలా అలవాటు చేయాలి. అప్పుడే మిగతా విషయాపైనా శ్రద్ధ పెట్టగలరు. ప్రపంచంలో అత్యంత సంపన్నుడైన బిల్‌గేట్స్ వాళ్ల పిల్లలకు 14 ఏళ్లు నిండే వరకూ ఫోను ఇవ్వలేదట.



**బహుమతిగా..** పిల్లలకు పది లేదా పన్నెండేళ్లు వచ్చినప్పుడు మనం వాళ్లకు బహుమతిగా ఫోను కొనివ్వొచ్చు. ఆ వయసులోనే వారు సంభాషణలు పూర్తిగా అర్థం చేసుకోగలరు. అలాంటప్పుడు ఇస్తే ఉపయోగం ఉంటుంది.

**బాధ్యతతో...** చదువుకునేప్పుడు పిల్లలకు ఫోన్లు ఉపయోగపడతాయి. అయితే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరం. ఎంత సమయం, ఏమేం చూస్తున్నారన్న విషయం తల్లి దండ్రులు ఎప్పటికప్పుడు కనిపెడుతుండాలి. అలా అయితేనే పిల్లలు ఆన్‌లైన్ మోసాల వంటి వాటికి గురికాకుండా కాపాడొచ్చు. ❑

# వ్యాపారం చిన్నదైతేనేం ..

పిల్లలు, కుటుంబం కోసం కెరియర్‌ని పక్కన పెడుతున్న వారెందరో! అలాగని 'గృహిణిగానే మిగిలిపోవాలి' అని చాలామంది అనుకోవడం లేదిప్పుడు. ఇంటి నుంచే వ్యాపారాలు చేస్తున్నారు. ఆ ఆలోచన మంచిదే.. తడబడకుండా ముందడుగు వేయాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.



- ముందు కొద్దిపాటి పెట్టుబడితో ప్రయత్నిద్దామన్న ధోరణే చాలామందిది. దీంతో తక్కువ ధరకే వస్తువులు ఎక్కడ దొరుకుతాయా అని పరిశీలిస్తుంటారు. ఇలాంటప్పుడు నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. ఖరీదు చేసేముందే అన్నింటినీ చెక్ చేసుకున్నాకే అమ్మకానికి తీసుకురావాలి. అప్పుడే వినియోగదారులకు మీపై నమ్మకం ఏర్పడుతుంది.
- కొనడం.. అమ్మడం మాత్రమే నా పని అనుకోవద్దు. వినియోదారులతో సత్సంబంధాలూ నెరపాలి. వస్తువు సమయానికి చేరిందా, నాణ్యత ఎలాగుందన్నవి ఆరా తీయాలి. వాళ్లేన్లదైనా అసంతృప్తి వెలిబుచ్చినా, కోపం ప్రదర్శించినా సంయమనం పాటించాలి. సరైన పరిష్కారం చూపించగలగాలి. అంటే పెద్ద సంస్థల కాల్‌సెంటర్ తరహా సేవలు అందించగలగాలి. అప్పుడే వాళ్లకి మీపై విశ్వాసం ఏర్పడుతుంది. భవిష్యత్తులోనూ తిరిగి మీ వద్దకు రావడానికి ఆసక్తి చూపుతారు.
- నష్టాలను ఎవరూ ఇష్టపడరు. కానీ ప్రారంభంలో అవి పలకరించడం సహజమే. అలాగని డీలా పడొద్దు. ఒక్కోసారి సమయమంతా వ్యాపారానికే కేటాయిస్తున్నట్లు అనిపిస్తుంది.సమయ నిర్వహణకు దారులు వెతకాలే తప్ప నెగెటివ్ ఆలోచనలు రానీయొద్దు. ఓపికతో ఉంటేనే ముందుకు సాగగలం.
- ఎంతసేపూ మీ పనులతోనే బిజీగా గడిపేయొద్దు. మీ పోటీదారులు ఎవరు? వాళ్లు అనుసరించే పద్ధతులను గమనించాలి. ఇంట్లో చేసే వ్యాపారానికి పోటీ ఏంటి? అన్న ఆలోచన వద్దు. మీ తరహాలో వ్యాపారం చేసే వాళ్లు ఎలా ఆకట్టుకుంటున్నారు? ఏవిధంగా సాగుతున్నారన్నది పరిశీలించాలి. వాళ్లను అనుసరించాలనేం లేదు. కానీ ఈ తరహా పరిశోధన కొత్త ఆలోచనలనిస్తుంది. అదీ మీ వ్యాపారానికి అనుకూలమే. ❑

# ఐపిఎల్‌లో ఇక నేటినుంచి ప్లేఆఫ్స్

**ముంబయి:** ఐపిఎల్ 2023 సీజన్ ముగింపుదశకు చేరుతోంది. సీజన్‌లో లీగ్‌దశ మ్యాచ్‌లు అన్నీ ముగిసాయి. ఇక నేటినుంచి ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు తెరలేస్తుంది. పాయింట్లపట్టికలో టాప్‌నాలుగులో నిలవడంద్వారా గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్‌కింగ్స్, లక్నో సూపర్‌ఝెయింట్స్, ముంబయి ఇండియన్స్ జట్లు ప్లే ఆఫ్స్‌కి అర్హత సాధించాయి. మిగిలిన ఆరుజట్లు ఇంటిబాటపట్టాయి. టాప్‌టూలో నిలిచిన గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్లమధ్య చెన్నైలోని చేపాక్ స్టేడియంలో క్వాలిఫయర్ వన్ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టుకి మాత్రం క్వాలిఫయర్2లో ఆడేందుకు మరోఛాన్స్ ఉంటుంది. పాయింటన లపట్టికలో టాప్2లో నిలిచిన ఈ రెండుజట్లకు మాత్రమే సెకండ్‌ఛాన్స్ ఉంటుంది. ఇకమూడు నాలుగుస్థానాల్లో ఉన్న లక్నో సూపర్‌జెయింట్స్, ముంబయి ఇండియన్స్ జట్లమధ్య బుధవారం రాత్రి ఏడున్నరకు చేపాక్‌లోనే ఎలిమినేటర్‌మ్యాచ్ ఉంటుంది.

ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు టోర్నీనుంచి నిష్క్రమిస్తుంది. గెలిచిన జట్టు క్వాలిఫయర్2లో ఆడుతుంది. అహ్మదాబాద్ వేదికగా శుక్రవారం రాత్రి క్వాలిఫయర్‌వన్‌లో ఓడిన జట్టు ఎలిమినేటర్‌మ్యాచ్‌లో గెలిచిన టీమ్ మధ్య క్వాలిఫయర్2 మ్యాచ్‌జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన టీమ్ ఇంటిబాట పట్టనుంది. గెలిచిన జట్టు క్వాలిఫయర్‌వన్ విజేతతో ఈనెల 28న ఆదివారం ఫైనల్‌లో తలపడుతుంది. ఈ క్వాలిఫయర్2 ఫైనల్ మ్యాచ్‌కు అహ్మదాబాద్‌లోని మోడీ స్టేడియం ఆతిథ్యం ఇస్తుంది.



ఫైనల్ మ్యాచ్‌కూడా రాత్రి 7.30 గంటలకు జరుగుతుంది. గత ఏడాది గుజరాత్ టైటాన్స్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

**ప్లే ఆఫ్స్ అర్హత మాటీమ్‌కు లేదు: ఆర్సీబీ కెప్టెన్ డుప్లెసిస్**

ఆర్సీబీ టీమ్‌కు ప్లేఆఫ్స్‌లో ఆడే అర్హత రాకపోవచ్చని కెప్టెన్ డుప్లెసిస్ ముందే చెప్పాడు. గుజరాత్ టైటాన్స్‌తో ముందురోజు జరిగిన మ్యాచ్‌లో బెంగళూరుటీమ్ 197 పరుగులుచేసినా పరాజయం చవిచూసింది. ప్లేఆఫ్స్‌కి అర్హత సాధించాలంటే తప్పక గెలిచేమ్యాచ్ కావడంతో విరాట్‌కోహ్లీ పట్టుదలగా ఆడి 101 పరుగులుచేసాడు. కానీ బౌలర్లు తేలిపోవడంతో ఛేదనలో శతకం బాదిన శుభమన్‌గిల్‌మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే గుజరాత్‌ను గెలిపించాడు. దాంతో బెంగళూరు ఇంటిబాట పట్టింది. లీగ్‌దశలో నిష్క్రమించడంపై కెప్టెన్ డుప్లెసిస్ స్పందించాడు. హైదరాబాద్‌పై గెలిచిన తర్వాత గుజరాత్‌తోమ్యాచ్‌కి ముందు ఆర్సీబీపై అంచనాలుపెరిగిపోయాయి. టేబుల్‌టాప్ గుజరాత్‌తో ఢీకొంటున్నామని మాకు తెలుసు. కానీ గత రెండుమ్యాచ్‌ల్లో లభించిన జోష్‌ని ప్లేఆఫ్స్‌కి చేరేందుకు ఉపయోగించ లేకపోయాం. గుజరాత్‌లాంటి స్ట్రాంగ్ టీమ్‌తో తలపడేటపుడు అత్యుత్తమ ప్రదర్శన కనబరచాల్సి ఉంటుంది. కానీ నిజాయితీగా చెప్పాలంటే ఐపిఎల్ 2023లో ఉన్న బెస్ట్‌టీమ్స్ జాబితాలో లేం. కానీ లక్కీగా మాకు కొన్ని విజయాలు వచ్చాయి. అయితే ఓవరాల్‌గా చెప్పాలంటే మాత్రం ప్లేఆఫ్స్‌కి వెళ్లే అర్హత మాకులేదు అని డుప్లెసిస్ అన్నాడు. ఈసీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన బెంగళూరు ఏడు మ్యాచ్‌ల్లో మాత్రమే విక్టరీ నమోదుచేసింది. పాయింట్ల పట్టికలో ఆరోస్థానంతో ఈ సీజన్‌ని ఆర్సీబీ ముగించింది.




## డబ్ల్యుటిసి ఫైనల్‌కు హేజిల్‌వుడ్ జోష్

**న్యూఢిల్లీ:** భారత్ ఆస్ట్రేలియా జట్లమధ్య వచ్చేనెల ఏడునుంచి 11 వరకూ ఐసిసి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఫైనల్‌కు ఇంగ్లండ్ ఆతిథ్యం ఇస్తోంది. భారత్‌జట్టులోని సగంమంది ప్లేయర్లు మంగళవారం అక్కడికి వెళుతున్నారు. మరికొందరు ఆటగాళ్లు ఈనెల 28వతేదీ ఐపిఎల్ ఫైనల్‌ముగిసాక అక్కడికి చేరుకుంటారు. మరోవైపు ఆసీస్‌టీమ్‌నుంచి కూడా డబ్ల్యుటిసి ఫైనల్‌కి ప్రకటించిన టీమ్‌పై అప్‌డేట్ వచ్చింది. ఐపిఎల్ 2023 సీజన్‌మధ్యలోనే స్వదేశానికి వెళ్లిన ఫాస్ట్‌బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్ సాధించాడు. కాలిమడమ గాయంతో ఈ ఏడాది ఆరంభంలో భారత్‌తో సిరీస్‌కి దూరంగా ఉన్న హేజిల్‌వుడ్ ఐపిఎల్ 2023సీజన్‌లోను ఆర్సీబీ తరపున కేవలంమూడు మ్యాచ్‌లే ఆడాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లోను కలిపి వేసిన ఓవర్లు తొమ్మిది మాత్రమే. అయితే ప్రస్తుతం హేజిల్‌వుడ్ పూర్తిఫిట్‌నెస్ సాధించాడని ఆస్ట్రేలియా క్రికెట్‌బోర్డు వెల్లడించింది. నెట్స్‌లో బౌలింగ్‌చేస్తున్నట్లు క్లారిటీ ఇచ్చింది. డబ్ల్యుటిసి ఫైనల్ తర్వాత ఇంగ్లండ్ గడ్డపైనే యాషెస్‌సిరీస్‌లో ఇంగ్లండ్‌తో ఆసీస్ తలపడనున్నది. జూన్ 16 నుంచి జులై 31వరకూ యాషెస్ సిరీస్ జరుగుతుంది.

## కోహ్లీ మోకాలికి గాయం



**బెంగళూరు:** ఆర్సీబీ మాజీ కెప్టెన్ విరాట్‌కోహ్లీ మోకాలికి గాయం అయింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయ్ శంకర్‌క్యాచ్ కోసం విరాట్‌కోహ్లీ డైవ్‌చేసాడు. ఈ క్రమంలో ఆతని మోకాలికి గాయం కావడంతో మైదానం వీడి మ్యాచ్ ముగిసేవరకూ డగౌట్‌లోనే కూర్చున్నాడు. ఈ మ్యాచ్‌లో చివరికి బెంగళూరు టీమ్ ఆరువికెట్ల తేడాతో గుజరాత్‌చేతిలో ఓటమి పాలయింది. అలాగే సీజన్‌నుంచి కూడా నిష్క్రమించింది. మ్యాచ్‌లో కోహ్లీ 61 బంతుల్లోనే 101 పరుగులుచేయడంతో బ్యాటింగ్ చేసిన టీమ్ ఐదు వికెట్ల నష్టానికి 197 పరుగులుచేసింది. అనంతరం ఛేదనలో శుభ్‌మన్‌గిల్ 52బంతుల్లోనే 104 పరుగులుచేయడంతో మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది. గిల్‌తోపాటు దూకుడుగా ఆడి అర్ధసెంచరీ నమోదుచేసిన విజయ్‌శంకర్ 53పరుగులుచేసాడు. వికెట్‌కోసం ఫీల్డింగ్‌లో డైవ్‌చేసి కోహ్లీ గాయపడ్డాడు. అయితే అదేమీ అంత పెద్ద గాయం కాదని బెంగళూరుకోచ్ సంజయ్ బంగర్ వెల్లడించారు. కోహ్లీ మోకాలికి గాయం అయింది. కానీ అంత సీరియస్‌కాదు. నాలుగురోజుల్లోనే కోహ్లీ రెండుసెంచరీలుచేసాడు. ఒకమ్యాచ్‌లో 40 ఓవర్లపాటు ఆతడు బ్యాటింగ్, ఫీల్డింగ్‌చేస్తూ ఉన్నాడు. శారీరకంగా అలిసిపోయాడని, ఆందోళన అవసరం లేదని సంజయ్‌బంగార్ చెప్పాడు.

## పిచ్చి పోస్టులతో ఆర్సీబీ ఫ్యాన్స్ పైశాచికం

### శుభ్‌మన్‌గిల్, సోదరి షానీగిల్‌పై అసభ్య పోస్టులు



**బెంగళూరు:** అభిమానుల ఆగడాలు హద్దుమీరుతున్నాయి. ఆర్సీబీ ఓటమికి గుజరాత్ ఓపెనర్ శుభ్‌మన్‌గిల్ కారణమని తేల్చేసుకున్న ఆర్సీబీ అభిమానులు జుగుప్సాకరమైన ట్రోలింగ్‌కు దిగారు. తమ ఆటగాళ్లనేకాకుండా అసాధారణ ప్రతిభచూపించిన ప్రత్యర్థి ఆటగాడిని సోషల్‌మీడియా వేదికగా టార్గెట్‌చేసారు. ఆతని చావును కోరడమే కాకుండా కుటుంబసభ్యులపైనా జుగుప్సాకరమైన రీతిలో కామెంట్లుపెట్టారు. ఈ సైకోల వ్యవహారం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. మ్యాచ్ ఆరంభంలో బాగానే ఉఆన్న తర్వాత శుభ్‌మన్‌గిల్ ఆర్సీబీ పతనాన్ని శాసించాడు. ఆర్సీబీ సారధి డుప్లెసిస్ కూడా గిల్‌ను త్వరగా ఔట్‌చేసి ఉంటే మ్యాచ్ మాదేనని చెప్పాడు. గిల్ దూకుడును తట్టుకోలేని కొందరు సైకో ఫ్యాన్స్ ఆతడిని సోషల్‌మీడియాలో టార్గెట్‌చేసారు. ఆతని సోదరి షానీల్‌గిల్‌పైనా రాయలేని పదాలతో దూషణకు దిగారు. ఒకారు యాక్సిడెంట్‌కు సంబంధించినఫోటోషేర్‌చేసి ఈకారులో గిల్ ఉంటే బాగుండేది అంటూ పోస్టులు పెట్టారు. మరికొందరైతే గిల్ నువ్వు, నీట్రాన్స్ జెండర్‌సోదరి తలలు తెగిపడాలి. ఈ రోజునుంచి గుర్తుపెట్టుకో నీజీవితంలో అన్నీ అపశకునాలే అంటూ కొందరు పోస్టులు పెడుతూ మాశాపాలే నీ నాశనానికి బీజం వేస్తాయంటూ మరికొందరు దారుణంగా కామెంట్లు పోస్టుచేయడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి షానీల్‌గిల్ బికినీ వేసిన ఫోటోను షేర్‌చేస్తూ ఖలిస్తానీ ఉగ్రవాది అని దూషించారు.

## రాజస్థాన్ రాయల్స్‌లో టైగర్ గ్లోబల్స్ పెట్టుబడి!




**జైపూర్:** ఐపిఎల్‌లో సక్సెస్‌ఫుల్ జట్లలో ఒకటిగా ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు అమెరికాకు చెందిన టైగర్‌గ్లోబల్ కంపెనీ సిద్ధం అయింది. ఈ ఫ్రాంచైజీకి ఏకంగా 650 మిలియన్ డాలర్ల విలువ కట్టిన ఈ కంపెనీ 40 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ముందుకు వచ్చింది. ఈడీల్ మరికొన్ని రోజుల్లోనే పూర్తవుతుందని అంచనా. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో మరో షేర్ హోల్డర్ యుకెకు చెందిన మనోజ్ బదాలే ఉన్నారు. ఆయన వద్ద ఈఫ్రాంచైజీలో ఏకంగా 60శాతం షేర్లు ఉన్నాయి. ఈ మనోజ్‌బదాలేలో డైరెక్టుగా లేదా పరోక్షంగా 40 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని న్యూయార్క్‌లోని టైగర్ గ్లోబల్ నిర్ణయించింది. టైగర్ గ్లోబల్ ఇటీవలికాలంలో భారత్‌లోని వివిధ కంపెనీలపై ఫోకస్‌పెట్టింది. ఫ్లిప్‌కార్ట్, జోమాటో వంటికంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. చాలాకాలంగా ఐపిఎల్‌లోకూడా పెట్టుబడులు పెట్టి తమ వ్యాపారం విస్తరించాలనిచూస్తోంది. ఈదిశగానే రాజస్థాన్ రాయల్స్‌తో ఈ డీల్ ఫైనల్‌చేసుకున్నట్లు సమాచారం. గతంలో 2021లో యుఎస్‌కు చెందిన రెడ్‌బర్డ్ క్యాపిటల్స్ రాజస్థాన్‌రాయల్స్‌లోని కొన్ని షేర్లు కొనుగోలుచేసింది. తాజా ఒప్పందంతో రాజస్థాన్ విలువ మరింత పెరుగుతందేమో చూడాలి.

## టిసిఎస్‌కు రూ.15వేల కోట్ల ఆర్డర్

**ముంబై, మే 22:** ప్రభుత్వ యాజమాన్యంలోని అతిపెద్ద టెలికం సంస్థ బిఎస్ఎన్ఎల్ నుంచి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నేతృత్వంలోని కన్సార్టియం భారీ ఆర్డర్ చేజిక్కించుకుంది. మే 22, 2023న దాదాపు రూ.15వేల కోట్ల విలువైన అడ్వాన్స్ పర్చేజ్ ఆర్డర్‌ను అందుకున్నట్లు ప్రకటించింది. అమెరికా, యూకే మార్కెట్ మందగించిన సమయంలో దేశీయ అతిపెద్ద సాఫ్ట్‌వేర్ ఎగుమతిదారు అతి పెద్ద డీల్ కుదుర్చుకున్నారు. దేశవ్యాప్తంగా 4జి నెట్‌వర్క్ విస్తరణ అమలు ప్రణాళికలో ఉన్నట్లు స్టాక్ మార్కెట్ ఫైలింగ్స్‌లో వెల్లడించింది. కన్సార్టియంలో టాటా గ్రూప్ టెలికం గేర్ మేకింగ్ కంపెనీ తేజస్ నెట్‌వర్క్స్ ఉంది. ఇది రేడియో యాక్సెస్ నెట్‌వర్క్స్ పరికరాలను సరఫరా చేయడానికి, సర్వీసింగ్ చేయడానికి బాధ్యత వహిస్తుంది. టిసిఎస్‌తో పాటు ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర రక్షణ ఐటిఐ లిమిటెడ్‌కి కూడా ఎపిఒ జారీచేయబడింది. ఈ ఒప్పందం టిసిఎస్‌కి ఆదాయాన్ని పెంచుతున్నప్పటికీ, ఇతరులతో జతకట్టడం కారణంగా మార్జిన్ తగ్గుతుందని తెలుస్తోంది. బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా జరిగిన మూడో అతిపెద్ద ఒప్పందం ఇదని తెలుస్తోంది. దీనికి ముందు అమెరికా, బ్రిటన్ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. జులై 2022లో కేంద్ర మంత్రి వర్గం బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణకు రూ.1.64 లక్షల కోట్ల భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఇందులో రూ.43,964 కోట్ల నగదు మద్దతు, రూ.1.20 లక్షల కోట్ల నగదు రహిత సహకారం ఉన్నాయి. పునరుద్ధరణ ప్యాకేజీలో బిఎస్ఎన్ఎల్ సేవల నాణ్యతను మెరుగుపరచడం, బ్యాలెన్స్ షీట్‌ను తగ్గించడం, భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్‌తో విలీనం ద్వారా ఫైబర్ రీచ్‌ను విస్తరించడం అనే మూడు ప్రధాన అంశాలున్నాయి.





## రూ.50వేలు మించితే పాన్ తప్పనిసరి: ఆర్‌బిఐ

**న్యూఢిల్లీ, మే 22:** నగదు నిర్వహణలో భాగంగానే రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నామని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. 2016లో నోట్ల రద్దు తర్వాత వ్యవస్థలోకి వేగంగా నగదును చొప్పించడంలో భాగంగానే రూ.2వేల నోటును తీసు కొచ్చినట్లు వివరించారు. నోట్ల మార్పిడికి తగ్గిన ఏర్పాట్లు చేసుకోవాలని బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు సోమవారం మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. సెప్టెంబరు 30 నాటికి చాలా వరకు రూ.2వేల నోట్లు ఖజానాకు చేరతాయని తాము ఆశిస్తున్నట్లు శక్తికాంత దాస్ తెలిపారు. నోట్ల మార్పిడి సమయంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆర్‌బిఐ చర్యలు తీసుకుంటుందన్నారు. మార్పిడి కోసం బ్యాంకుల వద్ద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆర్‌బిఐ చర్యలు తీసుకుంటుందన్నారు. మార్పిడి కోసం బ్యాంకుల వద్ద ప్రజలు హడావుడి పడాల్సిన అవసరం లేదని సూచించారు. నాలుగు నెల సమయం ఉందని, ప్రజలు దీన్ని సీరియస్‌గా తీసుకొని నోట్లన్నీ వాపస్ చేస్తారనే ఉద్దేశంతోనే అంత సమయం ఇచ్చామని తెలిపారు. కొందరు వ్యాపారులు గత కొంత కాలం నుంచే రూ.2వేల నోట్లను తిరస్కరిస్తున్నారన్నారు. ఉపసంహరణ ప్రకటన తర్వాత అది మరింత ఎక్కువై ఉంటుందని పేర్కొన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ మొత్తంలో చేసే డిపాజిట్లకు పాన్ సమర్పించాలనే నిబంధన ఇప్పటికే ఉన్నట్లు శక్తికాంత దాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ నిబంధన రూ.2వేల నోట్ల డిపాజిట్లకూ వర్తిస్తుందని స్పష్టం చేశారు. నేటి నుంచి బ్యాంకుల్లో నోట్ల మార్పిడి ప్రక్రియ ప్రారంభమవుతుందని కూడా ఆయన తెలిపారు. రూ.2వేల నోట్ల స్థానంలో ఇతర నోట్లను ఇచ్చేందుకు తగినంత నగదు అందుబాటులో ఉంచామన్నారు. ఉపసంహరణ వల్ల ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చాలా తక్కువని తెలిపారు. చలామణిలో ఉన్న కరెన్సీలో రూ.2వేల నోట్ల వాటా కేవలం 10.18 శాతం మాత్రమేనని వెల్లడించారు. రూ.1000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టనున్నారని వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలేనని కొట్టిపారేశారు. అదేవిధంగా గుర్తింపు కార్డులు లేకుండా డిపాజిట్లను అనుమతిస్తే, నల్లధనాన్ని ఎలా గుర్తిస్తారనే ప్రశ్నకు దాస్ స్పందించారు. డిపాజిట్ల విషయంలో ఇప్పటికే అవలంబిస్తున్న నిబంధలనే రూ.2వేల నోట్ల డిపాజిట్లకూ వర్తింపచేయాలని బ్యాంకులకు సూచించినట్లు తెలిపారు.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబై, మే 22:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిసాయి. ఉదయం సానుకూలంగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు కొద్దిసేపట్లోనే కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో ముగిసాయి. చివరికి సెన్సెక్స్ 234 పాయింట్లు లాభపడి 61,963.68 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 111 పాయింట్లు లాభపడి 18,314.40 వద్ద నిలిచింది. టెక్ మహీంద్రా, విప్రో, టిసిఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, ఎల్అండ్‌టి, సన్‌ఫార్మా, ఐటిసి, టైటాన్, మారుతీ సుజుకీ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. నెస్లే ఇండియా, యాక్సిస్ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, టాటా మోటార్స్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐబ్యాంకు, హిందుస్థాన్ యూనిలీవర్, ఇండస్ ఇండ్ బ్యాంకు, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు క్షీణించాయి. గ్లాండ్‌ఫార్మా షేరు విలువ గత రెండు సెషన్లలో 33శాతానికిపైగా క్షీణించింది. ఇంట్రాడేలో 861 రూపాయల వద్ద యేడాది కనిష్టానికి చేరింది. చివరికి 16.12 శాతం నష్టపోయి 893.85 రూపాయల వద్ద నిలిచింది.

## రష్యాకు 11 రెట్లు పెరిగిన ఎగుమతులు

**న్యూఢిల్లీ, మే 22:** ఈ యేడాది ఏప్రిల్‌లో భారత్ నుంచి రష్యాకు వస్తువుల ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని గణాంకాలు వెల్లడించాయి. ఇంజినీరింగ్ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ తాజా డేటా ప్రకారం గత నెలలో మన దేశం నుంచి రష్యాకు జరిగిన ఎగుమతుల విలువ భారత్ కరెన్సీలో సుమారు రూ.1,107 కోట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే నెలలో ఇంజినీరింగ్ ఎగుమతులు రూ.97 కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో అమెరికా, చైనా మార్కెట్లకు భారత్ ఎగుమతులు ప్రతికూలంగా ఉన్నాయి. అమెరికాకు ఇంజినీరింగ్ ఎగుమతులవిలువ 25శాతం తగ్గాయి. చైనాకు 15.5శాతం పడిపోయాయి. ఇక రష్యా తర్వాత ఓమన్ దేశానికి భారత్ నుంచి ఇంజినీరింగ్ ఎగుమతులు రెండింతలు పెరిగి రూ.1,276 కోట్లకు చేరుకుంది. మొత్తంగా భారత్ నుంచి ఇంజినీరింగ్ ఎగుమతులు ఈయేడాదిలో క్రమంగా తగ్గుతున్నాయి. ఏప్రిల్‌లో ఈ ఎగుమతులు 7.15శాతం పడిపోయాయని ఎగుమతి ప్రమోషన్‌కౌన్సిల్ పేర్కొంది. రాగి, సంబంధిత ఉత్పత్తులు, బాయిలర్లు, పంపులు, వాల్వ్‌లు, ఎయిర్‌కండిషనర్ మెషినరీ, ఆటో విడిభాగాలు, విద్యుత్ యంత్రాలు సానుకూల వృద్ధిని సాధించాయి. ఇనుము, ఉక్కు, ఉక్కు ఉత్పత్తులు, అల్యూమినియం, జింక్, నికెల్, సీసం, ద్విచక్ర వాహనాలు, ఆటో టైర్లు వంటివి ప్రతికూల వృద్ధిని చూశాయి.




## రుణాన్ని చెల్లించనున్న అనిల్ అంబానీ!

**ముంబై, మే 22:** ఒకప్పుడు భారత వ్యాపార ప్రపంచంలో వెలుగువెలిగిన అంబానీ సోదరుడు అనిల్ కుప్పకూలటం అందరికీ తెలిసిందే. ఇదే సమయంలో సోదరుడు ముఖేష్ మాత్రం తన వ్యాపారాలను అనేక రెట్లు పెంచుకున్న దేశంలో అగ్రగామి వ్యాపారవేత్తగా కొనసాగుతున్నారు. తాజాగా అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ విదర్భ ఇండస్ట్రీస్ పవర్ రుణదాతలకు తన లోన్స్ క్లియర్ చేయడానికి రూ.1,200 కోట్ల వన్-టైమ్ సెటిల్‌మెంట్‌ను ప్రతిపాదించిందని అంతర్గత వర్గాల ద్వారా వెల్లడైంది. ఈ వార్త నేపథ్యంలో రిలయన్స్ పవర్ కంపెనీ షేర్లు సోమవారం బిఎస్ఇలో లాభపడ్డాయి. రుణాల చెల్లింపునకు రిలయన్స్ పవర్ వన్-టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌కు గ్లోబల్ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ వెర్డే పార్ట్‌నర్స్ అంగీకరించినట్లు తెలిసింది. రిలయన్స్ పవర్ సెప్టెంబరు 2022లో రూ.1200 కోట్ల వరకు రుణాన్ని పొందేందుకు వెర్డే పార్ట్‌నర్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. జూన్ 2021లో వెర్డే పార్ట్‌నర్స్ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో రూ.550 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ సంస్థ అనేక ఇరత పవర్ కంపెనీల్లో కూడా తన పెట్టుబడులను కలిగి ఉంది. రిలయన్స్ పవర్ ప్రతిపాదన ప్రకారం యాక్సిస్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర సహా రుణదాతలకు రిలయన్స్ పవర్ రూ.1200 కోట్లు చెల్లించాల్సి ఉంది. విదర్భ ఇండస్ట్రీస్ బ్యాంకుల నుంచి విదేశీకరెన్సీలతో పాటు దేశీయ కరెన్సీల్లో టర్మ్ లోన్స్ పొందింది. మార్చి 31, 2022నాటికి రిలయన్స్ పవర్ మొత్తం రుణ బకాయిలు రూ.2,216.43 కోట్లుగా ఉంది.




## వాణిజ్యం

### రూ.2వేల నోట్లతో బంగారం కొనుగోళ్లు

**ముంబై, మే 22:** విపరీతంగా పెరిగిన బంగారం ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనుగోలు విముఖత చూపిస్తున్నారు. ఇటీవల కాలంలో చూస్తే బంగారం కొనుగోలు పెరిగినధరల నేపథ్యంలో గణనీయంగా తగ్గాయి. అయితే తాజాగా ఆర్‌బిఐ తీసుకున్న రూ.2వేల నోట్ల ఉపసంహరణ నిర్ణయం మళ్లీ బంగారం కొనుగోళ్లను పెంచుతుందని నిపుణులు భావిస్తున్నారు. అందుకు బంగారం కొనుగోలు చేయడాన్ని ఒక మార్గంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండు వేల రూపాయల నోట్లతో బంగారాన్ని కొనుగోలుచేస్తామని, బంగారు షాపు యజమానులతో బేరసారాలుచేస్తున్నారు. ఇక ఇదే అదునుగా బంగారం షాపు యజమానులు బ్లాక్‌లో డబ్బులు దాచిన బడాబాబుల నుంచి అదనంగా పిండే ప్రయత్నాలు మొదలుపెట్టిరు. షాపుల యజమానులు సహకరిస్తే దీంతో ఆర్‌బిఐ ఇచ్చిన గడువు ముగిసేలోగా బంగారం



కొనుగోళ్లు బాగా పెరుగుతాయని ఒక అంచనా. నిన్నమొన్నటి వరకు విపరీతంగా పెరిగిన బంగారం ధరలతోబంగారం కొనుగోళ్లు అంటేనే దూరం పారిపోయిన వాళ్లు ఇప్పుడు ఆర్‌బిఐ తీసుకున్న సంచలన నిర్ణయం దెబ్బకు బంగారం కొనుగోళ్లపై ఫోకస్ పెడుతున్నారు. ఇప్పటికే పలువురు బంగారం కొనుగోళ్లకు రూ.2వేల నోట్లు ఇస్తే 5శాతం నుంచి 10 శాతం వరకు అదనంగా తీసుకున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం బంగారం ధరలు 62వేల రూపాయల వరకు ఉంటే తాజా రూ.2వేల నోట్ల మార్పిడి దెబ్బకు ఆ కస్టమర్లకు బంగారం ధర షాపుల యజమానులు వసూలు చేస్తున్న అదనపు ఛార్జీలతో కలిపి రూ.66వేలవరకు పడుతుందని తెలుస్తుంది. సాధారణంగా బంగారం కొనుగోలు చేసే వారు రూ.2లక్షలలోపు బంగారం, వెండి ఆభరణాలను, వస్తువులను కొనుగోలు చేస్తే అందుకు పాన్, ఆధార్‌సమర్పించాల్సిన అవసరంలేదు. ఈ క్రమంలో బంగారం షాపులలో లెక్క దొరక్కుండా రూ.2వేల నోట్ల మార్పిడికి చాలా మంది బడా బాబులు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.